PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి


ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 318 | విజయవాడ, ఆదివారం 23 జూన్ 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00

Vol No | Vijayawada, Sunday 23 June 2024 | Rs

జిఎస్‌టి పరిధిలోకి పెట్రోల్, డీజిల్!



- కేంద్ర ప్రభుత్వ యోచన
- కొన్నిటిపై టాక్స్ తగ్గింపు
- 53వ జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం

లోపలి పేజీలో..




సెమీస్‌కు రోహిత్ సేన

- బంగ్లాదేశ్‌తో 50 పరుగుల తేడాతో గెలుపు

8

జవాబుదారీగా ఉందాం

- స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించిన అయ్యన్నపాత్రుడు
- అభినందనలో సిఎం, డిప్యూటీ సిఎం ప్రభృతులు
- గైర్హాజరైన వైసిపి



అయ్యన్నపాత్రుడును స్పీకర్ స్థానంలో కూర్చొబెట్టేందుకు వచ్చిన సిఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు సత్యకుమార్ యాదవ్, అచ్చెన్నాయుడు, ప్రొటెం స్పీకర్ బుచ్చయ్య చౌదరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నూతన శాసనసభ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, సభ నిర్వహణలో ఉన్నత సాంప్రదాయాలను నెలకొల్పాలన్న ఆకాంక్షను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తోపాటు పలువురు మంత్రులు, శాసనసభ్యులు వ్యక్తం చేశారు. రాష్ట్ర 16వ అసెంబ్లీకి స్పీకర్‌గా ఎన్నికైన సీనియర్ ఎంఎల్‌ఎ చింతకాయల అయ్యన్న పాత్రుడు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను అభినందిస్తూ సభలో ప్రసంగించిన ప్రతి ఒక్కరూ ప్రజల ఆకాంక్షల మేరకు, నిష్పక్షపాతంగా సభను నిర్వహించాలని కోరారు. అంతకుముందు స్పీకర్ పదవికి ఒకే నామినేషన్ దాఖలు కావడంతో అయ్యన్నపాత్రుడు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి అధికారికంగా ప్రకటించారు. అనంతరం అయ్యన్నపాత్రుడును సభ్యుల హర్షధ్వానాల మధ్య ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు సత్యకుమార్ యాదవ్, అచ్చెన్నాయుడు పోడియం మీదకు తీసుకెళ్లి స్పీకర్ స్థానంలో కూర్చొబెట్టారు. నూతనంగా ఎన్నికైన స్పీకర్‌ను సభలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల శాసనసభపక్ష నేతలు సభాధ్యక్ష స్థానం వరకు తీసుకెళ్లి ఆశీనులను చేసి రావడం సాంప్రదాయంగా వస్తోంది. తాజాగా ఈ సాంప్రదాయాన్ని వైసిపి పాటించలేదు. శాసనసభకు శనివారం ఆ పార్టీ సభ్యులు గైర్హాజరయ్యారు. వైసిపి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందులకు వెళ్లగా, మిగిలిన సభ్యులు సభకు రాలేదు. దీంతో స్పీకర్ బాధ్యతల స్వీకరణతోపాటు, ఆయన అభినందన కార్యక్రమానికి వైసిపి దూరంగా ఉన్నట్లైంది.

ప్రజా సమస్యలు చర్చిద్దాం : చంద్రబాబునాయుడు

సభ్యులు ప్రజా సమస్యలను చర్చకు తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. అయ్యన్న పాత్రుడు అందరి ఆమోదంతో ఏకగ్రీవంగా స్పీకర్ కావడం సంతోషంగా ఉందని చెప్పారు. '66 ఏళ్ల వయసున్నా అయ్యన్న ఇప్పటికీ ఫైర్‌బ్రాండే. నీతి నిజాయితీని పుణికిపుచ్చుకుని రాజకీయాలు చేశారు. గత ఐదేళ్లలో ఎన్నో ఇబ్బందులు పెట్టినా ఎదుర్కొన్నారు. 23 కేసులు పెట్టినా రాజీలేని పోరాటం చేశారు. ఆ స్ఫూర్తితోనే చట్టసభలను ప్రజాస్వామ్యయుతంగా నడుపుతారని ఆశిద్దాం' అని అన్నారు. ప్రజల జీవితాన్ని మార్చే శక్తి ప్రభుత్వ విధానాలకు ఉందని, అటువంటి విధానాలకు రూపకల్పన చేసేది చట్టసభలే అని తెలిపారు. పివి నరసింహారావు పెట్టిన సంస్కరణలను ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలో అమలు చేస్తే వాటి ప్రభావం ఇప్పుడు కనిపిస్తోందని చెప్పారు. 2047 వికసిత్ భారత్ కావాలన్న లక్ష్యంతో ప్రధాని మోడీ పనిచేస్తున్నారని, అదే స్ఫూర్తితో వికసిత్ ఆంధ్రప్రదేశ్ సాధిస్తామని చెప్పారు. అందుకు అనుగుణంగా సభలో చర్చలు, నిర్ణయాలు, పాలసీలు రావాలని అన్నారు గత సభల్లో టంగుటూరి ప్రకాశం, పుచ్చలపల్లి సుందరయ్య, మోటూరు హనుమంతరావు, కొరటాల

మిగతా 2లో

నీట్ పిజి పరీక్ష వాయిదా

- ఎన్‌టిఎ డైరెక్టర్‌పై వేటు
- సుభోద్ స్థానంలో ప్రదీప్ సింగ్ నియామకం

న్యూఢిల్లీ : జాతీయ స్థాయి పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, అక్రమాల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. వైద్య విద్యా ఉన్నత కోర్సులకు సంబంధించి ఈ నెల 23న ఆదివారం జరగాల్సిన నీట్ పిజి ప్రవేశ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది. వాయిదా వేసిన పరీక్షను ఎప్పుడు నిర్వహిస్తామనేది త్వరలోనే తేదీని ప్రకటిస్తామని తెలిపింది. జాతీయ స్థాయిలో కొన్ని పోటీ పరీక్షల విశ్వసనీయతపై ఇటీవల అనుమానాలు వ్యక్తమైన నేపథ్యంలో నీట్ పిజి ప్రవేశ పరీక్ష ప్రక్రియలో మార్పులు చేయాల్సివున్నందన ఈ పరీక్షను వాయిదా వేస్తున్నామని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ప్రకటించింది. విద్యార్థుల ప్రయోజనార్థమే వాయిదా నిర్ణయం తీసుకున్నామని, పరీక్షల ప్రక్రియ సత్యనిష్టతను కాపాడేందుకు ఈ చర్య తప్పనిసరి అయినదని పేర్కొంది.

ఈ కుంభకోణంలో కేంద్ర ప్రభుత్వం తన పరువు కాపాడుకోవడానికి అడ్మినిస్ట్రేషన్ ఇన్‌ఛార్జిగా ఉన్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) డైరక్టర్ జనరల్ (డిజి)పై వేటు వేసింది. ఆయన స్థానంలో రిటైర్డ్ ఐఎఎస్ అధికారి ప్రదీప్‌సింగ్ ఖరోలాను నియమించింది. ప్రదీప్ ప్రస్తుతం భారత వాణిజ్య ప్రోత్సాహక సంస్థ (ఐటిపిఒ) ఛైర్మన్‌గాను, మేనేజింగ్ ఎడిటర్‌గానూ ఉన్నారు. ఎన్‌టిఎ డైరెక్టర్ జనరల్‌గా ఆయన అదనపు బాధ్యతలు చేపట్టనున్నారు. 'రెగ్యులర్ నియామకాలు చేపట్టే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు జారీ చేసేవరకు..' ప్రదీప్ ఈ పదవిలో కొనసాగుతారని కేంద్ర వ్యక్తిగత మంత్రిత్వ శాఖ శనివారం పేర్కొంది. నీట్ స్కామ్, నెట్ లీకేజి వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా కోసం ప్రతిపక్షాలు, విద్యార్థి సంఘాలు పట్టుబడుతుండడంతో సుబోద్ కుమార్‌ను బలిపశువును చేసింది.

భారీగా ఐఎఎస్‌ల బదిలీలు

- పలువురు కలెక్టర్లు జిఎడికి
- వారి స్థానాల్లో నూతన నియామకాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పలువురు ఐఎఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం జిఓ 1100 విడుదల చేశారు. విజయనగరం జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎస్ నాగలక్ష్మిని గుంటూరు జిల్లా కలెక్టర్‌గా నియమించారు. గుంటూరు, విశాఖపట్నం జిల్లా కలెక్టర్లుగా పనిచేస్తున్న ఎం వేణుగోపాల్ రెడ్డి, ఎ మల్లికార్జునలను జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. విశాఖపట్నం జాయింట్ కలెక్టర్‌ను విశాఖపట్నం జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్‌గా నియమించారు. ప్రకాశం జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్‌ను అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. అల్లూరి సీతారామరాజు కలెక్టర్‌గా పనిచేస్తున్న ఎం విజయ సునీతను జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. చిత్తూరు జిల్లా కలెక్టర్ ఎస్ఎస్ మోహన్‌ను కాకినాడ కలెక్టర్‌గా బదిలీ చేశారు. కాకినాడ కలెక్టర్‌గా ఉన్న జె నివాస్‌ను జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఏలూరు జిల్లా కలెక్టర్‌గా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వెట్రిసెల్విని నియమించారు. ఏలూరు కలెక్టర్‌గా ఉన్న ప్రసన్న వెంకటేష్‌ను జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న పి ప్రశాంతిని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. ప్రస్తుతం ఆ జిల్లా కలెక్టర్‌గా ఉన్న కె మాధవీలతను జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్‌గా ఉన్న బిఆర్ అంబేద్కర్‌ను విజయనగరం జిల్లా కలెక్టర్‌గా నియమించారు. సాంకేతిక విద్య డైరెక్టర్‌గా ఉన్న సి నాగరాణిని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌గా నియమించారు. అక్కడ కలెక్టర్‌గా పనిచేస్తున్న సుమిత్ కుమార్‌ను చిత్తూరు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. కర్నూలు జిల్లా కలెక్టర్ గుమ్మల సృజనను ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌గా ఉన్న ఢిల్లీరావును జిఎడిలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న తమీమ్ అన్సరీయాను ప్రకాశం జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ఉన్న పి రంజిత్ భాషాను కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బదిలీ చేశారు. బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఇన్‌ఛార్జ్ కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించారు.



సహకారం మరింత బలోపేతం!

- హసీనా, మోడీ చర్చలు

లోపలి పేజీలో..



పొక్లెయినర్లతో వైసిపి కేంద్ర కార్యాలయాన్ని కూల్చివేస్తున్న అధికారులు

తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైసిపి కార్యాలయం కూల్చివేత

సీతానగరం వద్ద ఉద్రిక్తత


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సీతానగరంలో నిర్మాణంలో ఉన్న వైసిపి కార్యాలయ భవనాన్ని అధికారులు శనివారం తెల్లవారు జామున కూల్చివేశారు. దీంతో స్థానికంగా కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. భవన నిర్మాణానికి ఎటువంటి అనుమతులు లేవని, అందువల్లే కూల్చివేశామని అధికారులు చెబుతుండగా, హైకోర్టులో విచారణ జరుగుతుండగానే విధ్వంస చర్యకు దిగారని వైసిపి నేతలు అంటున్నారు. వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి ఈ మేరకు ట్వీట్ చేశారు. బెదిరింపులకు, కక్షసాధింపు చర్యలకు భయపడేది లేదని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటన ద్వారా టిడిపి ఐదేళ్ల పాలన ఎలా ఉండబోతోందో సందేశం ఇచ్చారని తెలిపారు. అంతకుముందు శనివారం తెల్లవారు జామున ఐదు గంటలకు పోలీస్ పహారా మధ్య

మిగతా 2లో

అదుపులోకి రాని అతిసార

- పెరుగుతున్న బాధితుల సంఖ్య
- జగ్గయ్యపేటలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య
- వేట్లపాలెంలో మహిళ మృతి



ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అతిసార బాధితులు

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, సామర్లకోట (కాకినాడ జిల్లా)

అతిసార అదుపులోకి రాకపోగా మృతుల సంఖ్య, బాధితుల సంఖ్య పెరుగుతోంది. దీంతో, అతిసార బాధిత గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలో అతిసారతో మరో ఇద్దరు మరణించడంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. కాకినాడ జిల్లా సామర్లకోటకు చెందిన ఒక మహిళ అతిసారతో మరణించారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం వేదాద్రికి చెందిన పసుమర్తి సత్యవతి (70), బూదవాడ గ్రామానికి చెందిన గుగులోతు జుమ్మా (65) వాంతులు, విరేచనాలతో బాధపడుతూ శనివారం మృతి చెందారు. చిల్లకల్లుకు చెందిన తోటపల్లి వెంకటేశ్వర్లు (75), జగ్గయ్యపేట శాంతినగర్ కాలనీకి చెందిన చట్టు శివన్నారాయణ (38) గురువారం మరణించారు. దీంతో, జగ్గయ్యపేట నియోజకవర్గంలో అతిసార మృతుల సంఖ్య నాలుగుకు చేరింది. మరో 14 మంది ఈ వ్యాధి బారిన పడడంతో బాధితుల సంఖ్య 40కు చేరింది. షేర్ మహమ్మద్‌పేటలోని సబ్ సెంటర్‌లోనూ, మండల పరిషత్ పాఠశాలలోనూ అధికారులు వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి బాధితులకు చికిత్స అందిస్తున్నారు.

జులై 1 నుండి స్టాప్ డయేరియా క్యాంపులు

ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు పద్మావతి

జులై 1 నుండి రెండు నెలల పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్టాప్ డయేరియా క్యాంపుల ద్వారా సర్వే చేయనున్నట్లు రాష్ట్ర ప్రజారోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ సంచాలకులు పద్మావతి తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి

మిగతా 2లో

యువతిపై అత్యాచారం, హత్య కేసులో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి-చీరాల, బాపట్ల జిల్లా

చీరాల మండలం ఈపురుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో యువతిపై అత్యాచారం, హత్య ఘటనలో ముగ్గురు నిందితులను పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి వకుల్ జిందాల్ వివరాలను వెల్లడించారు. ఈపురుపాలెం గ్రామం సీతారాంపేటకు చెందిన పి.సుచరిత (21) శుక్రవారం వేకువజామున తమ ఇంటి సమీపంలోని రైలు పట్టాల వద్దకు బహిర్భూమికి వెళ్లారు. అదే గ్రామానికి చెందిన దేవరకొండ విజయ్, కారంకి మహేష్ రైల్వే ట్రాక్ సమీపంలో మద్యం సేవిస్తున్నారు. అటుగా వచ్చిన సుచరితను ఇద్దరు నిందితులు బలవంతంగా చెట్లపొదల్లోకి లాక్కెళ్లి అత్యాచారం చేశారు. అనంతరం ముఖంపై దాడి చేసి హత్య చేశారు. నిందితులకు దేవరకొండ శ్రీకాంత్ సహకరించాడు. మృతురాలి తల్లి పంజుల కామాక్షి ఫిర్యాదు మేరకు చీరాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు బృందాలతో కేసును ఛేదించినట్లు ఎస్‌పి వెల్లడించారు. దేవరకొండ విజయ్, శ్రీకాంత్‌పై చీరాల పోలీస్‌స్టేషన్‌లో ఇది వరకే పలు కేసులు నమోదై ఉన్నాయి.

టెక్ స్టార్టప్‌లకు నిధుల కటకట

- గతేడాది నిధుల్లో 77% పతనం
- పెట్టుబడులకు ఇన్వెస్టర్ల అనాసక్తి
- విస్తరణలో సవాళ్లు

లోపలి పేజీలో..

గాజాలో ఆగని నరమేధం

- ఇజ్రాయిల్ దాడుల్లో మరో 44మంది బలి
- షాటీ శరణార్థ శిబిరంపై దాడిలో 24మంది
- తుఫా ప్రాంతంపై దాడిలో 20మంది మృతి

యానాం రీజెన్సీ కేసులో సిఐ, ఎస్ఐలకు జైలుశిక్ష

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి, యానాం

యానాంలో 2012 జనవరి 27న జరిగిన రీజెన్సీ సిరామిక్స్ ఘటనలకు, యూనియన్ నాయకుడు పోలీస్ స్టేషన్‌లో మరణించడానికి సంబంధించి నేరం రుజువు కావడంతో అప్పటి సిఐ పెరియసామి, ఎస్ఐ వీరభద్ర సామికి రెండేళ్ల జైలు శిక్ష, రూ.నాలుగు వేల చొప్పున జరిమానా విధిస్తూ శుక్రవారం పాండిచ్చేరి చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ బాలమురుగున్ తీర్పు వెలువరించారు. 2012లో రీజెన్సీ సిరామిక్స్ ఆఫీసర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు మచ్చా మురళీమోహన్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీస్ స్టేషన్‌లోనే ఆయన మృతి చెందడంతో కార్మికులు ఆందోళనకు దిగారు. అనంతర పరిణామాల్లో పరిశ్రమను యాజమాన్యం మూసివేసింది. యూనియన్ నాయకుడి మృతికి సంబంధించి సిబిఐ పోలీసులు సిఐ పెరియసామి, ఎస్ఐ వీరభద్రసామిలపై మూడు కేసులు నమోదు చేశారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఆదేశాలతో నాడు దాఖలైన కేసుల్లో దాదాపు 12 ఏళ్ల ఐదు నెలలపాటు న్యాయస్థానాల్లో విచారణ కొనసాగింది. నేరం రుజువు కావడంతో ఈ శిక్ష పడింది. సిఐ పెరియసామి ఇప్పటికే ఉద్యోగ విరమణ చేశారు. వీరభద్రసామి పుదుచ్చేరి ట్రాఫిక్ విభాగంలో పని చేస్తున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం రేపిన రీజెన్సీ పరిశ్రమ ఘటన యానాం చరిత్రలో మాయనిమచ్చగా మిగిలిపోయింది.

రీజెన్సీ యాజమాన్యానికి, కార్మికులకు మధ్యలో ఉన్న వివాదాన్ని పరిష్కరించడానికి అప్పటి స్థానిక కలెక్టర్ జవహర్ చిత్తశుద్ధితో ప్రయత్నం చేశారు. అది ఓర్వలేని యాజమాన్యం కలెక్టర్‌ను బదిలీ చేయించింది. కార్మికులపై పోలీసులను ప్రయోగించింది. పోలీసుల చేతిలో కార్మిక నాయకుడు మచ్చా మురళీ మోహన్ తీవ్ర చిత్రహింసలకు గురై స్టేషన్‌లోనే మరణించారు. ప్రజలు, కార్మికులు పెద్ద ఎత్తున ఆగ్రహం వ్యక్తం చేయగా పోలీసులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో తొమ్మిది మంది తీవ్ర గాయాలపాల య్యారు. ప్రజల ప్రతిఘటనతో

మిగతా 7లో

ఎస్‌సి, ఎస్‌టిలకు విద్యుత్ షాక్..!

- 200 యూనిట్లలోపు వినియోగదారులకూ జూన్ బిల్లులు
- భారీగా లబ్ధిదారుల కుదింపు?



కుంపటి బాబూరావుకు వచ్చిన బిల్లు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

ఉచిత విద్యుత్ పొందుతున్న ఎస్‌సి, ఎస్‌టిలకు ఎపిఎస్‌పిడిసిఎల్ షాక్ ఇచ్చింది. నిర్దేశించిన దానికన్నా మేలో తక్కువ విద్యుత్ వినియోగించిన వారికి కూడా జూన్‌లో బిల్లులు వచ్చాయి. లబ్ధిదారుల సంఖ్య కుదించడానికిగాను సిక్స్ స్టెప్పు వ్యాలిడిటీని ఆధారంగా చేసుకుని ఈ బిల్లులు ఇచ్చినట్లు తెలుస్తోంది. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించే ఎస్‌సి, ఎస్‌టిలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఎస్‌సి, ఎస్‌టి కాలనీలకు వెలుపల ఉండే వారికి విద్యుత్ రాయితీని గత ప్రభుత్వం తొలగించే ప్రయత్నం చేసింది. దీనిపై వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గింది. అయితే తాజాగా ఎన్నికలు ముగిసిన వెంటనే నూతన ప్రభుత్వం ఏర్పాటయ్యే క్రమంలో మరో రూపంలో బిల్లుల వసూలుకు విద్యుత్ సంస్థ పూనుకుంది. 200 యూనిట్లకు తక్కువ వినియోగించిన అనేక మంది ఎస్‌సి, ఎస్‌టిలకు బిల్లులు ఇచ్చింది. కృష్ణాజిల్లా చల్లపల్లి మండలం వెలివోలుకు చెందిన ఎస్‌సి వినియోగదారు కుంపటి బేబీ సరోజినీకి 72 యూనిట్లకు రూ.250 చెల్లించాలని, కుంపటి బాబురావుకు 96 యూనిట్లకు రూ.250 చెల్లించాలని బిల్లులు వచ్చాయి. ఈ గ్రామంలోని ఎస్‌టిలకు సంబంధించి కట్ట అచ్చమ్మకు 110 యూనిట్లకుగాను రూ.438, చింతల గ్రామంలోని ఎస్‌టి వినియోగదారుడు బండారు కోటీశ్వరావుకు 157 యూనిట్లకుగాను రూ.1,106 బిల్లులు వచ్చాయి. వెలువోలు దళితవాడలో 110 దళిత కుటుంబాలకుగాను గతంలో ఎప్పుడూ బిల్లు కట్టని 80 కుటుంబాలకు ఈ నెలలో బిల్లు వచ్చినట్లు తెలిసింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2,03,976 మంది ఎస్‌సి, ఎస్‌టి గృహ విద్యుత్ వినియోగదారులకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. తాజాగా వీరిలో అనేక మంది బిల్లులు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

లబ్ధిదారుల్లో ఆందోళన

ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో ఇంటికి మరొకరికి అద్దెకు ఇచ్చినా, లబ్ధిదారుడి పేరుపై ఒకటికి మించి అదనపు సర్వీసు మీటర్లు ఉన్నా, లబ్ధిదారుడు ప్రభుత్వ ఉద్యోగి అయినా, 3.5 ఎకరాలకు మించి వ్యవసాయ భూమి, 1000 చదరపు అడుగులకు మించిన గృహం, నాలుగు చక్రాల వాహనం, ఆదాయపు పన్ను రిటర్న్ తదితర అంశాలను ఆధారంగా చేసుకుని విద్యుత్ సంస్థ లబ్ధిదారులను కుదిస్తున్నట్లు తెలిసింది. గతంలో ఏ కారణంతో లబ్ధిదారుడిని అనర్హుడిగా పేర్కొందీ వెంటనే వివరాలు ఇచ్చేవారు. ప్రస్తుతం ఆ కారణాలను విద్యుత్ సంస్థ తెలియజేయడంలేదు. దీంతో లబ్ధిదారులు తమకు ఎందుకు ఉచిత విద్యుత్ తొలగించారో తెలియక ఆందోళన చెందుతున్నారు.

కేంద్ర మంత్రికి 'నీట్' సెగ

- హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి, నిజామాబాద్‌లో అరవింద్ ఇళ్ల ముట్టడి
- విద్యార్థి, యువజన సంఘాల నాయకుల అరెస్ట్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో, ఏలూరు అర్బన్, అమరావతి బ్యూరో

నీట్ పేపర్ లీకేజీ సెగ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని, బిజెపి ఎంపి అరవింద్‌ను తాకింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ)ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో శనివారం వారి ఇళ్లను ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర తోపులాట జరిగింది. నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. నిజామాబాద్‌లో విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీఛార్జి చేశారు. హైదరాబాద్ కాచిగూడలోని కిషన్‌రెడ్డి ఇంటిని విద్యార్థి సంఘాల నాయకులు ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. ఎన్‌ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ సహా మరికొందరు కాంగ్రెస్ కార్యకర్తలను, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు అశోక్‌రెడ్డి, డివైఎఫ్‌ఐ నగర కార్యదర్శి ఎండి.జావిద్, తెలంగాణ విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్, పలువురు ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నీట్ పరీక్ష పేపర్ లీకేజీ, అవకతవకలపై ఎన్‌టిఎను రద్దు చేయాలని, సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. పరీక్ష నిర్వహణలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని వివరించారు. కిషన్‌రెడ్డికి గనుల వేలం పాటపై ఉన్న శ్రద్ధ, లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుపై లేకపోవడం సిగ్గుచేటన్నారు. నీట్ పేపర్ లీకేజీ అంశంపై ప్రధాని మోడీని 'ఛాయ్ పే చర్చా కార్యక్రమం' నిర్వహించేలా కిషన్‌రెడ్డి అడగాలని డిమాండ్ చేశారు.

నిజామాబాద్‌లో విద్యార్థి సంఘాల నాయకులపై లాఠీఛార్జి

ఎన్‌టిఎను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో ఎంపి అరవింద్ ఇంటిని విద్యార్థి సంఘాల నాయకులు ముట్టడించారు. వారిపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. విద్యార్థి సంఘాల నాయకులను ఈడ్చుకుంటూ తీసుకెళ్లి అరెస్టు చేసి 3వ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అంతకుముందు విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించాల్సిన నీట్ పరీక్షలో స్కామ్ జరిగిందని, ఒకే పరీక్ష కేంద్రంలో 8 మంది విద్యార్థులకు 720కి 720 మార్కులు, 67 మందికి టాప్ ర్యాంకులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. పరీక్ష పత్రం లీకేజీలో లక్షల రూపాయలు చేతులు మారాయని, లక్షలాది మంది జీవితాలతో కేంద్ర ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ వెంటనే రాజీనామా చేయాలని, ఎన్‌టిఎను రద్దు చేయాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు, ఎఐపిఎస్‌యు, ఎన్‌ఎస్‌యుఐ, ఎఐఎస్‌ఎఫ్ నేతలు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని కిషన్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

ఎన్‌టిఎను రద్దు చేయాలని ఏలూరులో ధర్నా

నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించాలని, ఎన్‌టిఎని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏలూరులోని గ్రాండ్ ఆర్య హోటల్ వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ.. కేంద్ర విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలని, పరీక్ష పేపర్లు లీక్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏలూరు పట్టణ నాయకులు మహర్షి, బి.మనోజ్, వంశీ పాల్గొన్నారు.

నీట్ లీకేజి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్నకుమార్ డిమాండ్

వైద్య ప్రవేశ కోర్సులకు సంబంధించిన జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్) పేపర్ లీకేజ్ చేసిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టిఎ)ను రద్దు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కె ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు.. నీట్ పేపర్ లీకేజ్‌కి నిరసనగా ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం జరిగింది.

విజయవాడలోని ధర్నాచౌక్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్లకార్డులు పట్టుకొని మోకాళ్లపై నిల్చొని నిరసన వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా ప్రసన్న కుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజి జరగలేదని తొలుత వాదించిన కేంద్రప్రభుత్వం సుప్రీంకోర్టు సుమోటోగా కేసు స్వీకరించడంతో జరిగిందని ఒప్పుకోవాల్సి వచ్చిందన్నారు. లీకేజి వ్యవహారంలో ఎన్‌టిఏది కీలక పాత్ర అని పేర్కొన్నారు. ప్రశ్నాపత్రం ఎలా బయటకు వచ్చిందో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. బీహార్‌లో ఒక్కో విద్యార్థి నుంచి రూ.30లక్షల వరకు వసూలు చేశారని తెలిపారు. వందల కోట్ల కుంభకోణం జరిగిందని విమర్శించారు. వ్యాపం కుంభకోణం పేరుతో ఎన్‌టిఎను కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిందని, అంతకుమించిన కుంభకోణం ఎన్‌టిఎ ఆధ్వర్యంలో జరిగిందన్నారు.

ఇప్పుడు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో కేంద్రప్రభుత్వం చెప్పాలని నిలదీశారు. ప్రశ్నాపత్రం లీకేజ్ వెనుక ఎవరి హస్తం ఉందో కేంద్రప్రభుత్వం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. భారీ అవినీతికి బిజెపి ఆధ్వర్యంలోని కేంద్రప్రభుత్వమే బాధ్యత వహించాలని, కేంద్ర విద్యాశాఖమంత్రి ధరేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఎన్‌టిఎను రద్దు చేసి వైద్యకోర్సుల ప్రవేశ పరీక్షను రాష్ట్రాల పరిధిలోనే ఉంచాలని డిమాండ్ చేశారు. నెట్ పరీక్షను రద్దు చేయడంతో ఎన్‌టిఎ వైఫల్యం తేటతెల్ల మయిందన్నారు. నెట్ పరీక్షపై జరిగిన అవకతవకలపై స్వతంత్ర దర్యాప్తుతో పారదర్శకంగా జరగాలని డిమాండ్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వరరావు, సహాయ కార్యదర్శి కుమారస్వామి, విజయవాడ నగర నాయకులు భువనేశ్వర్, షణ్ముఖ్, జ్వలిత, అవినాష్, ఉషా, యశస్విని దేవి తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు



నివాళులర్పిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, లోకనాథం

అశ్రు నయనాలతో సావిత్రమ్మ అంత్యక్రియలు

- హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

పార్టీ అభిమాని జాని సావిత్రమ్మ అంత్యక్రియలు శనివారం అశ్రునయనాల మధ్య జరిగాయి. ఈ నెల 21న హైదరాబాద్ (విద్యానగర్)లోని తన కుమారుని నివాసంలో ఆమె మరణించిన విషయం తెలిసిందే. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం నవభారత్ నగర్ కాలనీకి ఆమె భౌతికకాయాన్ని తరలించి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, లోకనాథం హాజరై శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు అధ్యక్షతన జరిగిన సంతాప సభలో వి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పార్టీ ఒక కుటుంబ సభ్యురాలిని కోల్పోయిందన్నారు. పది మంది కోసం ఆలోచించి, వారికి పాటుపడాలనే గొప్ప సంకల్పం ఉన్న మంచి వ్యక్తి సావిత్రమ్మ అని కొనియాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు తులసీదాస్ మాట్లాడుతూ సావిత్రమ్మ గొప్ప విప్లవతత్వం ఉన్న వ్యక్తి అని, కమ్యూనిస్టు పార్టీ సంప్రదాయాలను అనుసరిస్తూ విప్లవ చైతన్యం, పార్టీపై అచంచల విశ్వాసం కనబరిచారని తెలిపారు. లోకనాథం మాట్లాడుతూ సావిత్రమ్మ తన ముగ్గురు కుమారులను సైతం పార్టీకి అప్పగించిన త్యాగమూర్తి అని అన్నారు. అనంతరం జరిగిన అంత్యక్రియల్లో ఆమె కుమారులు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బాబూరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సభ్యులు, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి జయరాం, మరో కుమారుడు పోస్టల్ యూనియన్ నాయకులు జ్యోతీశ్వరరావు, జిల్లా పార్టీ నాయకులు భవిరి కృష్ణమూర్తి, కె.శ్రీనివాసు, ప్రజాశక్తి విశాఖ, శ్రీకాకుళం ఎడిషన్ల మేనేజర్లు ఎం.వెంకటేశ్వరరావు, పి.కామినాయుడు, సిపిఎం నాయకులు, కార్యకర్తలు, పలు ప్రజాసంఘాల నాయకులు, అభిమానులు, కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

టెట్ నిర్వహించాలి

- మంత్రి లోకేష్‌ను కోరిన టిడిపి ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహించాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను టిడిపి ఎమ్మెల్సీలు కోరారు. టిడిపి కార్యాలయంలో శనివారం లోకేష్‌ను కలిసి ఎమ్మెల్సీలు కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. 16,347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్‌సి భర్తీకి సంబంధించిన ఫైల్‌పై ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు తొలిసంతకం చేశారని గుర్తు చేశారు.

ఈ నిర్ణయం నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులకు ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ఇటీవల బిఎడ్, డిఎడ్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు కూడా టెట్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం ఇవ్వాలని కోరారు.

తాడేపల్లిలో నిర్మాణంలో ఉన్న వైసిపి కార్యాలయం కూల్చివేత

(మొదటి పేజీ తరువాయి)

బుల్డోజర్లు, ప్రొక్లయినర్లతో అధికారులు భవనాన్ని కూల్చిశారు.సిఆర్‌డిఎ ఆదేశాలతో ఈ చర్య తీసుకున్నట్లు మంగళగిరి, తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తెలిపారు. స్థానికులను ఆ పరిసరాల్లోకి రానీయ్యకుండా మొత్తం నిర్మాణాన్ని రెండు గంటల్లో కూల్చివేశారు. సీతానగరం ఎదురుగా బోట్ యార్డుగా ఉపయోగించిన 202/1 సర్వే నంబర్లోని రెండు ఎకరాల ఇరిగేషన్ భూమిని వైసిపి కార్యాలయంకోసం గత ప్రభుత్వం లీజుకు కేటాయించింది. ఏడాది క్రితం పనులు ప్రారంభించారు. అయితే, ఈ స్థలాన్ని రెవెన్యూశాఖకు ఇచ్చేందుకు ఇరిగేషన్‌శాఖ అప్పట్లోనే అభ్యంతరం చెప్పింది. సిఆర్‌డిఎ కూడా ఎటువంటి అనుమతులు ఇవ్వలేదు. దీంతో ఎలాంటి నిర్మాణపు అనుమతులు లేకుండానే పనులను చేపట్టారు. కనీసం ప్లాన్ కోసం దరఖాస్తు కూడా చేయలేదని అధికారులు చెబుతున్నారు. ఇరిగేషన్ స్థలాన్ని వైసిపి కబ్జాచేసి కార్యాలయం కడుతోందని తెలుగుదేశం గుంటూరు జిల్లా ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు సిఆర్‌డిఎకు ఫిర్యాదు చేశారు. పోతినేని శ్రీనివాసరావు ఫిర్యాదుపై వైసిపికి సిఆర్‌డిఎ నోటీసులు ఇచ్చినా స్పందించలేదని చెప్పారు.

కోర్టు ఆదేశాలను తుంగలో తొక్కి కూల్చివేశారు : వైసిపి

రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం అమలులో బాగంగానే సిఆర్‌డిఎ వైసిపి కార్యాలయాన్ని కూల్చివేసిందని వైసిపికి చెందిన మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే టిజెఆర్ సుధాకర్‌బాబు విమర్శించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 10 రోజుల్లోనే విధ్వంసపాలన మొదలుపెట్టారని అన్నారు. పోలీసుల పహారాలో ఈ ప్రభుత్వ దమనకాండ కొనసాగిందన్నారు. నిర్మాణంలో వున్న ఈ భవనాన్ని ఈ భవనాన్ని కూల్చేయాలన్న సిఆర్‌డిఎ ప్రిలిమనరి ప్రొసీడింగ్స్‌పై తమపార్టీ హైకోర్టును కోర్టును ఆశ్రయించిందని తెలిపారు. ఈ అంశంపై చట్టాన్ని మీరి వ్యవహరించవద్దని కోర్టు చెప్పిన అంశాన్ని తమ అడ్వకేట్ సిఆర్‌డిఎ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా కూల్చివేశారని ఇది కోర్టు దిక్కరణ చర్యఅని అన్నారు. కోర్టులోనే తేల్చుకుంటామని అన్నారు.

జవాబుదారీగా ఉందాం

(మొదటి పేజీ తరువాయి)

సత్యనారాయణ, కాకాని వెంకటరత్నం, గుంటూరు బాపనయ్య, తరిమెల నాగిరెడ్డి, చంద్ర పుల్లారెడ్డి, ఎన్‌జి రంగా, అయ్యదేవర కాళేశ్వరరావు వంటి మహామహులు ఉన్నారని, వారిని సభలోని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పేదరికం, ఆర్థిక అసమానతలు తగ్గించుకునేందుకు అడుగులు పడాలని, ఆ తరహా చర్చలు సాగాలని కోరారు. గత సభలో తననూ, తన కుటుంబాన్ని ఇష్టారాజ్యంగా మాట్లాడారని, రాజకీయాల్లో లేని తన కుటుంబ సభ్యురాలిపై అసభ్యకరమైన వ్యాఖ్యానాలు చేశారని, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని, భరించలేక కన్నీళ్లు కూడా పెట్టుకోవాల్సి వచ్చిందని తెలిపారు. అలా అవమానించిన వ్యక్తులు సభలో ఉండకూదని ప్రజలు టిడిపిని గెలిపించారని పేర్కొన్నారు. పవన్ కల్యాణ్ కూడా హుందాగా వ్యవహరించారని పేర్కొన్నారు. జీవితాంతం ప్రజలకు రుణపడి ఉంటానని, మళ్లీ జన్మంటూ ఉంటే తెలుగుగడ్డపై పుట్టి రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు.

చట్టాలు ఉల్లంఘించకూడదు : పవన్ కల్యాణ్

డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ మాట్లాడుతూ సభకు ఎన్నికైన వారు శాసనాలు రూపొందించడానికే తప్ప ఉల్లంఘించడానికి కాదని పేర్కొన్నారు. విధానాలు, చట్టం మీద అర్థవంతమైన, ఉన్నత చర్చ జరగాలని, అవి కొట్టుకునేలా ఉండకూడదని తెలిపారు. గత పాలకులు విజయాన్ని తీసుకున్నంత తేలికగా ఓటమిని తీసుకోలేకపోయారని, అందుకే సభకు రాలేదని పేర్కొన్నారు.. రాబోయే తరాలకు గొప్ప భవిష్యత్‌ను ఇచ్చేలా సభ ఉండాలని పేర్కొన్నారు. స్పీకర్‌గా ఎన్నికైన అయ్యన్నపాత్రుడు గతంలో ఆగ్రహంగా స్పందించేవారని, ఇప్పుడు ఆ అవకాశం లేదని అన్నారు. 'అల్లరి పిల్లాడిని స్కూల్ లీడర్‌గా చేసినట్లుంది.' 'మీకు కోపం వస్తే రుషికొండకు గుండుకొట్టినట్లు ఉత్తరాంధ్ర యాసలో పదునైన మాటలతో ప్రత్యర్థులకు గుండు కొట్టేస్తారు" అనగానే సభ్యులు పెద్దఎత్తున నవ్వారు.

అర్థవంతమైన చర్చలు జరగాలి : స్పీకర్ అయ్యన్నపాత్రుడు

1983లో తుఫాన్‌లా ఎన్‌టిఆర్ నాయకత్వంలో తెలుగుదేశం వచ్చినప్పుడు కూడా ఇన్ని సీట్లను ప్రజలు ఇవ్వలేదని, గత ప్రభుత్వ పనితీరు చూసి నారా చంద్రబాబునాయుడి దార్శనికతకు రికార్డుస్థాయి గెలుపును కట్టబెట్టారని స్పీకర్ అయ్యన్న పాత్రుడు అన్నారు. ఈ సభలో 22 మంది మహిళలు వున్నారని, ఇది స్వాగతించాల్సిన అంశమని అన్నారు. 88 మంది మొదటిసారి శాసనసభకు ఎన్నికయ్యారని, వారంతా నేర్చుకోవాల్సింది చాలా వుందని అన్నారు. సభలో ఎలా ప్రశ్న వేయాలి అనే అంశంపై శిక్షణ ఇస్తామన్నారు. శాసనసభలో మాట్లాడితే ఇక్కడ వుండే వారేకాక రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు గమనిస్తుంటారని గుర్తుంచుకోవాలని అన్నారు.

ఏడుసార్లు ఎమ్మెల్యేగా అయ్యన్న

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చింతకాయల అయ్యన్నపాత్రుడుకు నాలుగు దశాబ్దాలకు పైగా రాజకీయ అనుభవం ఉంది. 1983లో టిడిపి ఆవిర్భావంతో రాజకీయాల్లోకి ప్రవేశించిన ఆయన ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా, ఒకసారి పార్లమెంట్ సభ్యునిగా పనిచేశారు. 16 సంవత్సరాలు మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

'పొల్యూషన్ ఆడిట్ తప్పనిసరి'

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాలుష్య నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అందులో భాగంగా పొల్యూషన్ ఆడిట్ తప్పనిసరిగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు. విజయవాడలోని ఆయన నివాసంలో శనివారం అటవీశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లాలోని కాలుష్యం లెక్కలు తీయాలని, జల వాయు కాలుష్యాలకు సంబంధించిన పూర్తి వివరాలు అందించాలని అధికారులను ఆదేశించారు. పరిశ్రమల వారీగా కాలుష్యం వివరాలు అందించడంతో పాటు కాలుష్య నియంత్రణకు అనుసరించాల్సిన విధానాలు కూడా తెలపాలన్నారు. కృష్ణా, గోదావరి తీరాల్లో కాలుష్యం, కాగితపు పరిశ్రమల నుంచి వస్తున్న జలకాలుష్యంపైనా చర్చించారు. ఈ రెండు జీవనదుల శుద్ధీకరణపైనా దృష్టి పెట్టాలని దిశా నిర్దేశం చేశారు. ఎర్ర చందనం అక్రమ రవాణా అరికట్టడానికి టాస్క్‌ఫోర్స్‌ను బలోపేతం చేస్తామన్నారు. ఇక్కడ నుంచి స్మగ్లర్లు తరలించిన ఎర్రచందనం నేపాల్‌లో భద్రతా సిబ్బందికి పట్టుబడిందని పవన్‌కల్యాణ్ తెలిపారు.

అదుపులోకి రాని అతిసార

(మొదటి పేజీ తరువాయి)

ఇంటికీ రెండు ఒఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వడంతోపాటు ఆరోగ్యం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తామని చెప్పారు. జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను శనివారం ఆమె పరామర్శించారు. రోగుల పరిస్థితిని, అతిసార వ్యాప్తికి కారణాలను ఎన్‌టిఆర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఎం.సుహాసినిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో పద్మావతి మాట్లాడుతూ మంచినీరు, ఆహారం కలుషితం కావడం వల్ల అతిసార ప్రబలినట్లు తెలిసిందన్నారు.

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెం శివారు జొన్నలదొడ్డిలో అతిసార బాధితుల సంఖ్య 36కు చేరింది. కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కొమ్మోజు సత్యవేణి (43) శనివారం మృతి చెందారు. ఈ గ్రామంలో కాకినాడ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నరసింహ నాయక్ పర్యటించారు. అతిసార ప్రబలడానికి కారణాలపై ఆరా తీశారు. గ్రామంలో ఈ నెల 19 నుంచి అతిసార కేసులు నమోదవుతూ వస్తున్నాయని, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని, పారిశుధ్య సమస్య పట్టించుకునే వారు లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. తాగునీటి కాలుష్యం వల్లే అతిసార ప్రబలిందన్నారు.

నీరు కలుషితం కాకుండా చర్యలు
: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్

మంచినీటి పైపు లైన్లలో లీకేజీల ద్వారా నీరు కలుషితమవుతోందని, నీటి కలుషిత ప్రాంతాల్లో తక్షణమే చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ అధికారులను ఆదేశించారు. డయేరియా విషయంలో పూర్తి అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి దిశా నిర్దేశం చేశారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మునిసిపల్ శాఖలతో వైద్య ఆరోగ్య శాఖాధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు. డయేరియా బాధితులకు సత్వరమే వైద్య సేవలందించాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలన్నారు. డయేరియా నియంత్రణపై జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదేశించారు.



తనను కలిసేందుకు వచ్చిన మహిళతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

ప్రజల నుంచి వినతులు స్వీకరించిన చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రతి శనివారం టిడిపి కార్యాలయానికి వెళ్లి కార్యకర్తలు, సామాన్య ప్రజలను కలిసేందుకు సమయం ఇస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా పార్టీ కార్యాలయానికి వెళ్లిన ఆయన అక్కడకు వచ్చిన వందల మందిని కలిశారు. వారి నుండి వినతిపత్రాలు స్వీకరించారు. టిడిపి ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూడా కార్యకర్తల నుంచి వచ్చిన వారిని కలిశారు.కార్యకర్తలు అందించిన వినతిపత్రాలను స్వీకరించారు. టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశానికి వచ్చిన ఎంపిలు లోకేష్‌ను కలిశారు.

రూ.25 లక్షల విరాళమిచ్చిన వైష్ణవిని అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిన సిఎం

రాజధాని అమరావతి నిర్మాణం కోసం ముదినేపల్లికి చెందిన వైష్ణవి రూ.25 లక్షలు, పోలవరం నిర్మాణం కోసం లక్ష విరాళమిచ్చారు. శనివారం ఉదయం ఉండవల్లిలోని సిఎం క్యాంపు కార్యాలయంలో విరాళం అందుకున్న వెంటనే చంద్రబాబునాయుడు ఆమెను అభినందించి, అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించారు. తమకు మూడు ఎకరాల భూమి ఉందని, ఎకరం అమ్మగా వచ్చిన డబ్బును విరాళమిచ్చినట్లు వైష్ణవి తెలిపారు. పోలం అమ్మి మరీ విరాళం డబ్బు ఇవ్వడం అభినందనీయమని చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. తండ్రి సహకారంతో వైష్ణవి అభినందనీయమైన పని చేశారని తెలిపారు. అనంతరం శాలువా కప్పి వైష్ణవిని, ఆమె తండ్రి మనోజ్‌ను సన్మానించారు. ఆమె ప్రస్తుతం విజయవాడలో ఎంబిబిఎస్ రెండో సంవత్సరం చదువుతున్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించేందుకే 'జన దర్బార్'

- అర్జీలు స్వీకరించిన పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యలతో వచ్చే వారి నుంచి వినతులు స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు జనసేన పార్టీ కార్యాలయం వద్ద హెల్ప్‌డెస్క్‌లు (జన దర్బార్) ఏర్పాటు చేశారు. శాసన సభ సమావేశాలు ముగిసిన తర్వాత పార్టీ కార్యాలయానికి వచ్చిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ స్వయంగా హెల్ప్‌డెస్క్ వద్ద ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. విజయవాడలో చదువుకుంటున్న తన కుమార్తె మైనర్ అని, ఆమెను ప్రేమ పేరిట ట్రాప్ చేశారని భీమవరం నుంచి వచ్చిన శివకుమారి మొరపెట్టుకుంది. తమ కూతురు చదువుకునే విజయవాడ పోలీస్ కమిషనరేట్ పరిధిలోనిది కావడంతో మాచవరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిది నెలల తరువాత జాడ తెలిశాక కూడా తమకు అప్పగించడం లేదంటూ ఎఫ్‌ఐఆర్ కాపీని చూపించడంతో, పవన్‌కల్యాణ్ మాచవరం సిఐకు ఫోన్ చేశారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మాచర్ల నియోజకవర్గం రెంటచింతల ప్రాంతానికి చెందిన మత్స్యకారుడు జంపయ్య దంపతులు తమను ఇంటి కోసం సొంత మనుమళ్లే వేధిస్తున్నారని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. రెవెన్యూ, పోలీస్ అధికారులతో మాట్లాడతానని పవన్‌కల్యాణ్ హామీ ఇచ్చారు. కర్నూలుకు చెందిన సువర్ణ తన కుమారునికి బ్రెయిన్ ఆపరేషన్‌కు ఆర్థిక సహాయం అందించాలని, జగ్గయ్యపేట వ్యవసాయ మార్కెట్ యార్డులో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగి శ్రీపాటి నాగరాజు తనను రాజకీయ కారణాలతో ఉద్యోగం నుంచి తొలగించారని, తనను ఆదుకోవాలని వినతిపత్రాలు అందజేశారు.



జన దర్బార్‌లో పవన్ కల్యాణ్

వికలాంగులతో ప్రత్యేక సమావేశం

30మంది వికలాంగులు శనివారం జనసేన పార్టీ కార్యాలయంలో డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌ను కలిశారు. వారందరితో ప్రత్యేకంగా మాట్లాడిన ఆయన వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

పవన్‌కల్యాణ్‌కు
సెక్రటేరియట్ హౌస్‌కీపింగ్ ఉద్యోగుల వినతి

రాష్ట్ర సచివాలయంలో పనిచేస్తున్న 154మంది హౌస్ కీపింగ్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని పవన్‌కల్యాణ్‌ను కోరారు. శాసనసభ సమావేశాల రెండో రోజు శనివారం స్పీకర్ ఎన్నిక సందర్భంగా పవన్‌కల్యాణ్ అసెంబ్లీ ప్రాంగణమంతా కలియ తిరిగారు.

ఈ సందర్భంలో హౌస్‌కీపింగ్ సిబ్బంది తమ సమస్యలు విన్నవించుకున్నారు. రాజధాని ప్రాంత రైతు కూలీలం ఎనిమిదేళ్ల కిందట నెలకు రూ.6వేలకు ఉద్యోగంలో చేరామని, ప్రస్తుతం రూ.10వేలు ఇస్తున్నారని సిబ్బంది పేర్కొన్నారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ పరిధిలో ఉన్నామని, అమరావతి రైతు కూలీలుగా ఉండటంతో తొలి రోజుల్లో నెలకు రూ.2,500 భత్యం వచ్చేదని, ప్రస్తుతం కీపింగ్ ఉద్యోగమని చెప్పి ఆ భత్యం నిలిపివేశారని పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లారు. విషయాన్ని సిఎం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని పవన్‌కల్యాణ్ హామీనిచ్చారు.

ధైర్యంగా ఉండండి..

- నాయకులు, కార్యకర్తలతో వైఎస్.జగన్



నాయకులు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న జగన్

ప్రజాశక్తి-కడప/వేంపల్లె/పులివెందుల టౌన్

ధైర్యంగా ఉండాలని, ఐదేళ్లు తొందరగా వస్తాయాని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి నాయకులు, కార్యకర్తలతో అన్నారు. వైఎస్‌ఆర్ జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా శనివారం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో కడపకు చేరుకున్నారు. కడప నుంచి రోడ్డు మార్గంలో పులివెందులకు వచ్చారు. జగన్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పులివెందుల క్యాంపు కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో జగన్ సమావేశమయ్యారు. జగన్‌ను కలిసిన వారిలో కడప ఎంపి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, కడప మేయర్ సురేష్ బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, మాజీ డిప్యూటీ శాసనమండలి ఛైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జగన్ కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం

జగన్ పర్యటనలో అపశృతి చోటుచేసుకుంది. పులివెందుల పర్యటనలో భాగంగా జగన్ శనివారం గన్నవరం నుంచి కడప విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడ నుండి రోడ్డు మార్గాన పులివెందులకు వెళుతుండగా రామరాజుపల్లి సర్కిల్ వద్ద చిన్న అపశృతి చోటుచేసుకుంది. జగన్ అభిమానులు రోడ్డుకు అడ్డంగా రావడంతో కాన్వాయ్‌లోని ఓ వాహనం సడన్ బ్రేక్ వేయడంతో వెనుకాలే వస్తున్న ఇన్నోవా కారును ఫైర్ ఇంజన్ ఢీకొంది. దీంతో, కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



కాన్వాయ్‌లో దెబ్బతిన్న కారు

పులివెందుల్లో తోపులాట..

జగన్‌ను కలిసేందుకు వైసిపి శ్రేణులు తోసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. భద్రతా సిబ్బంది జగన్ కార్యాలయంలోకి కాకుండా తన నివాసంలోనికి వెళ్తారని అక్కడ బందోబస్తు ఏర్పాటు చేశారు. అనుకోకుండా కార్యాలయాలోకి జగన్ రావడంతో అప్పటికే అక్కడ భారీగా తరలివచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆయనను కలిసేందుకు ఒక్కసారిగా దూసుకొచ్చారు. ఒకరికొకరు తోసుకోవడంతో తోపులాట జరిగింది. ఈ తోపులాటలో కొంత మంది కిటికీల మీద పడడంతో అద్దాలు పగిలాయి.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-చీరాల (బాపట్ల జిల్లా)
అత్యాచార ఘటనల నివారణకు తమిళనాడు తరహాలో సమగ్ర కార్యాచరణ చేపట్టాలని, నిందితులను కఠినంగా శిక్షించటంతో పాటు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి కోరారు. చీరాల పట్టణంలోని బాపమ్మ కల్యాణ మండపంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాపట్ల జిల్లా చీరాల మండలం ఈపురుపాలెంలో 21 ఏళ్ల యువతిపై అత్యాచారం, హత్య జరిగిన ఘటనపై రాష్ట్ర హోం మంత్రి స్పందించిన తీరు స్వాగతించదగ్గ అంశమన్నారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వంటి వాటిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, సీనియర్ నాయకులు పి.కొండయ్య, డివిజన్ కార్యదర్శి ఎన్.బాబూరావు పాల్గొన్నారు.

అదృశ్యమైన చిన్నారి హత్య

- భార్యపై అనుమానంతో కూతురిని చంపిన తండ్రి

ప్రజాశక్తి-నార్పల
అనంతపురం జిల్లా నార్పలలో ఈ నెల 20న అదృశ్యమైన ఆరేళ్ల పావని హత్యకు గురైంది. భార్యపై అనుమానంతో కూతురిని బావిలో పడేసి తండ్రే హత్య చేశాడు. హత్యకు సంబంధించిన వివరాలను మీడియాకు పోలీసులు వెల్లడించారు. వారి వివరాల మేరకు.. అనంతపురం జిల్లా నార్పల కొత్త బస్టాండ్ కాలనీలో నివసిస్తున్న దంపతులు గణేష్, అమలకు కుమార్తె పావని (6), కుమారుడు ఉన్నారు. గణేష్ ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తుండగా, అమల గృహిణి. భార్యపై అనుమానంతో ప్రతిరోజూ గొడవపడేవాడు. దీనికి తోడు కూతురు తనకు పుట్టలేదనే అనుమానం పెంచుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 20న పాఠశాల నుంచి చిన్నారిని ఇంటికి తీసుకువచ్చే క్రమంలో నార్పల సమీపంలోని పాడుబడ్డ బావిలో పావనిని తోసేశాడు. తన కూతురు కనిపించడం లేదని తండ్రే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చిన్నారి ఆచూకీ కోసం ఎస్‌పి రంగంలోకి దిగారు. శనివారం ఉదయం బావి వద్ద తచ్చాడుతూ పోలీసులకు కంటపడడంతో తమదైన శైలిలో విచారించారు. రెండు రోజుల క్రితం తానే కూతురిని బావిలో తేసేశానని, మృతదేహం నీటిలో తేలియాడుతుందేమోనని చూసేందుకు వచ్చానని అసలు విషయం చెప్పాడు. బావిలో గాలించగా ముళ్ల చెట్ల కింద చిన్నారి పావని మృతదేహం పోలీసులకు లభ్యమైంది.


కూతురితో తండ్రి గణేష్ (ఫైల్)

2400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి-కర్నూలు క్రైం
కర్నూలు నగరంలోని బంగారుపేటలో శనివారం సారా స్థావరాలపై దాడి చేసి 2400 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. సారా తయారీ అవుతుందన్న సమాచారం మేరకు కర్నూలు సబ్ డివిజన్ డిఎస్‌పి కె.విజయ శేఖర్ తన సిబ్బందితో కలిసి బంగారుపేటలో నాటు సారా స్థావరాలపై దాడులు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సారా తయారీ కోసం సిద్ధం చేసి ఉంచిన 2,400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. 150 లీటర్ల నాటుసారా, వంద కిలోల నల్లబెల్లంను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో కర్నూలు టుటౌన్ సిఐ ఇంతియాజ్ బాషా, కర్నూలు ఒకటవ పట్టణ సిఐ పవన్ కుమార్, కర్నూలు నాల్గవ పట్టణ సిఐ శంకరయ్య, కర్నూలు సెబ్ సిఐ నరసనాయుడు, మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్.విశ్వేశ్వరరెడ్డి, టుటౌన్ ఎస్ఐ శ్రీధర్‌బాబు, సెబ్ ఎస్ఐ రెహనాబేగం, మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల తనఖాపై స్పందించేనా ?

- బిల్డ్ ఎపి మిషన్ పేర 13 స్థలాలు, ఆస్తులు వేలం, కుదువ
- బ్యాంకుల నుంచి వైసిపి ప్రభుత్వం తీసుకున్న రూ.23 వేల కోట్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో
గత సర్కారు విశాఖను పరిపాలనా రాజధానిగా ప్రకటించిన తర్వాత 2022-23లో పలు ప్రభుత్వ స్థలాలు, ఆస్తులను బ్యాంకుల్లో తనఖా పెట్టి వేల కోట్ల రూపాయలు తీసుకున్న వైనంపై తాజా కూటమి ప్రభుత్వం ఎటువంటి నిర్ణయం తీసుకోనుందన్న విషయమై సర్వత్రా చర్చ సాగుతోంది. 'బిల్డ్ ఎపి మిషన్' పేరుతో 15 స్థలాలను ఎంపిక చేసి తుదకు 13 స్థలాలను తనఖా పెట్టింది. సుమారు 100 ఎకరాల మేర ప్రభుత్వ భూములను వివిధ బ్యాంకుల్లో కుదువ పెట్టింది. వాటి మార్కెట్ ధర 2023లో సుమారు రూ.2950 కోట్లు కాగా బ్యాంకుల్లో వీటికి సంబంధించిన పత్రాలన్నింటినీ దఖలు పరచి సుమారు రూ.23,200 కోట్లు అప్పుగా తీసుకుంది. ప్రభుత్వ స్థలాలను ష్యూరిటీ కింద పెట్టింది.

భూములు ఎక్కడెక్కడ ? ఎంతెంత ?

గోపాలపట్నం రైతు బజారు 3.80 ఎకరాలు కాగా బ్యాంకు నుంచి సుమారు రూ.27.58 కోట్లకు తనఖా పెట్టింది. ప్రభుత్వ ఐటిఐ కప్పరాడలో 17.33 ఎకరాలను రూ.494.87 కోట్లకు, సర్క్యూట్ హౌస్‌కు చెందిన 2.94 ఎకరాలను రూ.59.76 కోట్లకు, కప్పరాడలోగల ప్రభుత్వ పాలిటెక్నిక్ భవనం 23.58 ఎకరాలను రూ.673 కోట్లకు, రేసపువానిపాలెం రెవెన్యూ క్వార్టర్స్ మూడు ఎకరాలను 88.57 కోట్లకు, చినగదిలిలోని పశుసంవర్థక శాఖ డెయిరీ ఫారం 30 ఎకరాలను రూ.436 కోట్లకు, సీతమ్మధార రెవెన్యూ కార్యాలయం ఎకరా స్థలాన్ని రూ.295.24 కోట్లకు, బక్కన్నపాలెంలోని సెరీకల్చర్‌కు చెందిన 5.78 ఎకరాలను రూ.55.95 కోట్లకు, కిర్లంపూడి లేఅవుట్ ఇరిగేషన్ ఆఫీసు వద్దగల పోలీస్ క్వార్టర్స్ 8.58 ఎకరాలను రూ.250 కోట్లకు, కిర్లంపూడి లే అవుట్ వద్దగల ఇఇ బంగ్లా, ఇరిగేషన్ కార్యాలయం 4.25 ఎకరాలను రూ.360 కోట్లకు తనఖా పెట్టింది. సుమారు రూ.23,200 కోట్ల మేర అప్పులు జగన్ సర్కారు చేసిందని పెద్ద ఎత్తున విమర్శలున్నాయి.

కూటమి ప్రభుత్వంలో స్పందన ఉంటుందా ?

ప్రభుత్వ ఆస్తులను బ్యాంకుల్లో కుదువ పెట్టి రూ.వేల కోట్లు అప్పు తీసుకుని ప్రజలపై భారాలు మోపుతుందంటూ వైసిపి సర్కారుపై పెద్ద ఎత్తున టిడిపి, జనసేనలు 2023లో ప్రచారం చేపట్టాయి. తాము అధికారంలోకి వస్తే వాటన్నింటినీ వెనక్కి తీసుకుంటామని ప్రజలకు హామీ ఇచ్చాయి. అధికారం చేపట్టి పక్షం రోజులవుతున్నా విశాఖ భూములపై ప్రభుత్వ పెద్దలు ఒక నిర్ణయం చేసినట్లు ఇప్పటి వరకూ కనిపించలేదు.



గత ప్రభుత్వం తనఖా పెట్టిన విశాఖలోని సీతమ్మధార తహశీల్దార్ కార్యాలయ స్థలం


ఇంధన శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న రవికుమార్

కొత్తగా 40,336 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు

- ప్రభుత్వ కార్యాలయాలకు దశలవారీగా సోలార్ విద్యుత్ : గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ఇంధన శాఖ మంత్రిగా గొట్టిపాటి రవికుమార్ సచివాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మూడు ఫైళ్లపై సంతకాలు చేశారు. రాష్ట్రంలో కొత్తగా 40,336 వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్లు మంజూరుకు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేయగా, ప్రభుత్వ కార్యాలయాలకు దశల వారీగా సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరు ఫైల్‌పై రెండో సంతకం చేశారు. ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంలో ఇంటింటికీ మూడు కిలోవాట్ల సోలార్ విద్యుత్ కనెక్షన్ల మంజూరుకు సంబంధించిన ఫైల్‌పై మంత్రి గొట్టిపాటి మూడో సంతకం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన రీతిలో విద్యుత్‌ను అందించేందుకు విద్యుత్ సరఫరా, డిమాండ్లపై దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పారు. దేశంలోనే ఉత్తమంగా రాష్ట్ర విద్యుత్ శాఖను తీర్చిదిద్దేందుకు అన్ని విధాలా ప్రయత్నిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, బాపట్ల ఎంపి తెన్నేటి కృష్ణప్రసాద్, బాపట్ల, పెదకూరపాడు ఎమ్మెల్యేలు వి.నరేంద్రవర్మ, భాష్యం ప్రవీణ్, ప్రజాప్రతినిధులు, ఇంధనశాఖ అధికారులు పాల్గొన్నారు.

'వందేభారత్'ను వెంటాడుతున్న సమస్యలు

- సి-9 కోచ్‌లో సాంకేతిక లోపం
- నాలుగు గంటలు ఆలస్యం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)
విశాఖ - సికింద్రాబాద్ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ను సాంకేతిక సమస్యలు వెంటాడుతున్నాయి. తరచూ సర్వీసులు ఆలస్యమవుతున్నాయి. తాజాగా శనివారం విశాఖ నుంచి సికింద్రాబాద్ వెళ్లాల్సిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లోని సి-9 కోచ్‌లో సాంకేతికత లోపం తలెత్తింది. దీంతో ఉదయం 5.45 గంటలకు విశాఖపట్నం నుంచి బయలుదేరాల్సిన రైలు 10.04 గంటలకు కదిలింది. రైలు సకాలంలో బయలుదేరకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వందేభారత్ నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. రెండు నెలల క్రితం కూడా సికింద్రాబాద్ నుంచి విశాఖ వెళ్లే వందే భారత్ ఐదు గంటలు ఆలస్యమయింది.


విశాఖలో సాంకేతిక సమస్యతో నిలిచిన వందేభారత్ రైలు

విశాఖలో వైసిపి కార్యాలయానికి నోటీసులు

ప్రజాశక్తి - మధురవాడ (విశాఖపట్నం)
అనుమతులు లేకుండా నిర్మాణ పనులు చేపట్టారంటూ విశాఖలోని ఎండాడ వద్ద నిర్మించిన వైసిపి కార్యాలయానికి జివిఎంసి జోన్ - 2 అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరారు. లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.



టిడిపి కూటమి దాడులు పెరిగాయి : అమర్‌నాథ్

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందని వైసిపి మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. తమ పార్టీ కార్యాలయానికి జివిఎంసి అధికారులు నోటీసులు ఇచ్చిన విషయమై ఆయన స్పందిస్తూ మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ఫలితాల తరువాత రాష్ట్ర వ్యాప్తంగా వైసిపి నేతలు, ఆస్తులపై టిడిపి కూటమి దాడులు పెరిగాయని ఆరోపించారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయాన్ని సైతం అన్యాయంగా నేలమట్టం చేశారన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అంబేద్కర్ రాజ్యాంగాన్ని పక్కనపెట్టి టిడిపి రాసిన రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు.

2014-19 కాలంలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు పలు జిల్లాల్లో ప్రభుత్వ స్థలాలను వారి కార్యాలయాల పేరిట కాజేశారన్నారు. విశాఖలోని వైసిపి కార్యాలయం కోసం సంబంధిత స్థలాన్ని 33 సంవత్సరాలపాటు లీజుకు తీసుకుని ముందుకెళ్లామని తెలిపారు. చట్టపరంగా నోటీసులను ఎదుర్కొంటామన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో 'ఉక్కు'ను కాపాడుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)
ఐక్య పోరాటాలతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1227వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ టిపిపి, ఆర్ఇడి, పిఇఎం, స్టోర్స్ విభాగాల ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాల కోసం ప్రధాని మోడీతో జతకట్టిన నేతలకు రానున్న రోజుల్లో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ రెండు కళ్ల సిద్ధాంతాన్ని అమలు చేసి గతంలో ప్రజల ఆగ్రహానికి గురై అధికారానికి దూరమైన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రజల ఆకాంక్షలను గుర్తెరిగి పనిచేయాలని సూచించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధన, విశాఖ ఉక్కు పరిరక్షణ, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, రైల్వే జోన్, కడప ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణం, రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కును కాపాడేందుకు కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని, వర్కింగ్ క్యాపిటల్ కింద రూ.3500 కోట్లను సమకూర్చాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కుపై ఉన్న ఆర్థిక భారాన్ని మాఫీ చేయాలని, ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలని కోరారు.



అమర రాజాకు 'గ్రేట్ ప్లేస్ టు వర్క్' అవార్డు

హైదరాబాద్ : అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్‌కు 'ది గ్రేట్ ప్లేస్ టు వర్క్' ఇన్స్‌ట్యూషన్ నుంచి అవార్డు దక్కింది. మెరుగైన పని ప్రదేశాల్లో 68వ ర్యాంక్‌తో ప్రశంసను పొందింది. తమ సంస్థలో ఉద్యోగులకు సానుకూల, సంతృప్తికర పని వాతావరణం కల్పనకు కట్టుబడి ఉన్నామని అమర రాజా గ్రూపు హెచ్‌ఆర్ ప్రెసిడెంట్ జైక్రిష్ణా బి తెలిపారు.



ఉత్తమ పని ప్రదేశంగా సింక్రోనీ

హైదరాబాద్ : ఉత్తమ పని ప్రదేశాల్లో ప్రీమియర్ కన్స్యూమర్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ సింక్రోనీ దేశంలోనే అత్యుత్తమ కంపెనీలలో రెండవ స్థానంలో నిలిచింది. సిబ్బందికి సానుకూల పని కేంద్రంగా ఈ అవార్డును 'ది గ్రేట్ ప్లేస్ టు వర్క్' ఇన్స్‌ట్యూషన్ నుంచి వరుసగా ఏడవ సంవత్సరం సాధించినట్లు సింక్రోనీ ఇండియా హెడ్ రచనా బహదూర్ పేర్కొన్నారు. తమ సంస్థలో ఆరోగ్యకరమైన పని వాతావరణాన్ని సృష్టించడం, అందరికీ ఒకే స్థాయిలో ప్రోత్సాహం ఉంటుందన్నారు. సింక్రోనీలో 51 శాతం పైగా మహిళ ఉద్యోగులతో పాటుగా, 106 మంది వైకల్యం వ్యక్తులు, 50 శాతం పైగా నిపుణులు తమ కార్యాలయంలో పని చేస్తున్నారన్నారు.

టెక్ స్టార్టప్‌లకు నిధుల కటకట

- గతేడాది నిధుల్లో 77% పతనం
- పెట్టుబడులకు ఇన్వెస్టర్ల అనాసక్తి
- విస్తరణలో సవాళ్లు
- 2023లో కొత్తగా 480 సంస్థల ఏర్పాటు

న్యూఢిల్లీ: భారత టెక్ స్టార్టప్‌లు నిధుల సమీకరణలో గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. మోడీ సర్కార్ కార్పొరేట్లకు ఇస్తున్న ఆర్థిక ప్రాధాన్యత స్టార్టప్‌లకు ఇవ్వడం లేదని పలు రిపోర్టులు స్పష్టం చేస్తున్నాయి. మరోవైపు వెంచర్ కాపిటలిస్టు పెట్టుబడిదారులు భారత స్టార్టప్‌లకు పెట్టుబడులను సమకూర్చడంలో వెనక్కి తగ్గుతున్నారు. స్టార్టప్ నిధులు, వాటి సవాళ్లపై టెక్నాలజీ ఇండస్ట్రీ బాడీ నాస్కామ్, గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ జిన్నోవ్ ఓ కీలక నివేదికను వెల్లడించింది. ఆ వివరాలు.. గతేడాది దేశంలో దాదాపు 480 కొత్త డీప్‌టెక్ స్టార్టప్‌లు ప్రారంభమయ్యాయి. దీంతో ప్రపంచంలోనే భారత్ మూడవ అతిపెద్ద స్టార్టప్‌ల హబ్‌గా మారింది. మరోవైపు ఈ స్టార్టప్‌ల నిధుల సమీకరణపై నీలినీడలు కమ్ముకోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. డీప్‌టెక్ స్టార్టప్‌లు అనేవి సాంకేతికత లేదా ఇంజనీరింగ్ పురోగతులపై ఆధారపడి విప్లవాత్మక పరిష్కారాలను అందించే లక్ష్యంగా ఏర్పాటు చేసినవి.

'ఇండియాస్ డీప్‌టెక్ డాన్: ఫోర్జింగ్ ఎహెడ్' పేరుతో విడుదల చేసిన ఈ నివేదికలో ప్రధానంగా స్టార్టప్‌లు మూడు సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణ, నైపుణ్యవంతుల కొరత, అంతర్జాతీయ విస్తరణ ప్రధాన సవాళ్లుగా ఉన్నాయి. "భారత్‌లో ప్రస్తుతం 3600 పైగా డీప్‌టెక్ స్టార్టప్‌లు ఉన్నాయి. వాటిలో 480 గతేడాది స్థాపించబడ్డాయి. 2022లో స్థాపించబడిన డీప్‌టెక్ స్టార్టప్‌ల సంఖ్య కంటే దాదాపు 2 రెట్లు ఎక్కువ" అని నివేదిక పేర్కొంది. కాగా ఆ సంస్థల హామీలు, లక్షాలు నిధుల కొరత వల్ల నెరవేరలే కోతున్నాయి. కొన్ని ఇతర ప్రముఖ డీప్‌టెక్ పర్యావరణ వ్యవ స్థల్లోని స్టార్టప్‌లతో పోలిస్తే, భారత డీప్‌టెక్ స్టార్టప్‌లు ప్రతి దశలోనూ మధ్యస్థ పెట్టుబడిలో ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ నిధుల కొరత కొన్ని ఆశాజనకమైన టెక్ స్టార్టప్‌ల సామర్థ్యం పెంపును పరిమితం చేస్తుంది. దీంతో ప్రపంచ టెక్ స్టార్టప్‌లతో పోటీపడలేక పోతున్నాయి." అని నాస్కామ్ తన రిపోర్ట్‌లో పేర్కొంది.



కేవలం రూ.7100 కోట్లతో సరి..

గడిచిన ఐదేళ్లలో భారత టెక్ స్టార్టప్‌లు 10 బిలియన్ల (రూ.83వేల కోట్లు) నిధులు సమీకరించాయి. 2023లో కేవలం 850 మిలియన్ డాలర్ల (రూ.7100 కోట్లు) నిధులు అందుకున్నాయి. 2022లోని 3.7 బిలియన్ డాలర్ల (రూ.30వేల కోట్లు)తో పోల్చితే.. గతేడాది నిధుల్లో 77 శాతం పతనం చోటు చేసుకుంది. అదే విధంగా 2022తో పోల్చితే 2023లో ఆర్థిక ఒప్పందాల్లో 25 శాతం తగ్గుదల చోటు చేసుకుంది. గతేడాది 74 టెక్ స్టార్టప్‌లు కృత్రిమ మేధా (ఎఐ) ఆధారంగా నెలకొల్పబడ్డాయి. ఎఐ ఆధారిత స్టార్టప్‌ల్లో 86 శాతం నిధులను సమీకరించాయి.

మెగా డీల్స్ జీరో..

2022తో పోలిస్తే 2023లో భారతదేశ డీప్‌టెక్ స్టార్టప్‌ల కోసం ఫండింగ్ రౌండ్‌లలో పాల్గొనే పెట్టుబడిదారుల సంఖ్య 60 శాతానికి పైగా పడిపోయింది. ఇంతకుముందు నిధులను అందించిన అనేక మంది పెద్ద ప్రపంచ పెట్టుబడిదారులు అనాసక్తి చూపడం ఈ క్షీణతకు కారణం. "2022లో తొమ్మిది పెద్ద ఒప్పందాలతో పోలిస్తే 2023లో మెగా డీల్‌లు అసలు లేకపోవడంతో పెద్ద టికెట్ పెట్టుబడులపై పెట్టుబడిదారుల ప్రాధాన్యత తగ్గుముఖం పట్టిందని స్పష్టం అవుతుంది" అని నివేదిక పేర్కొంది. డీప్‌టెక్‌లో పెట్టుబడి పెట్టేటప్పుడు వాటి ప్రతిఫలం కోసం సుదీర్ఘకాలం ఎదురు చూడాల్సి రావడం అతిపెద్ద సవాలు అని వెంచర్ కాపిటలిస్టులు అభిప్రాయపడుతున్నారు.

బహుముఖ విధానం అవసరం..

పెట్టుబడిదారులు తక్కువ మొత్తం పరిమాణాలు, తక్కువ రిస్క్‌తో సీడ్ స్టేజ్ డీప్‌టెక్ స్టార్టప్‌లలో పెట్టుబడి పెట్టడానికి ఇష్ట పడటంతో నిధుల పరిమాణం మరింత క్షీణించింది. "ఈ సవాళ్లను ఎదుర్కోవడానికి టెక్ స్టార్టప్‌ల అభివృద్ధికి భారత్‌కు బహుముఖ విధానం అవసరం. ఇన్నోవేషన్ క్లస్టర్‌లను గుర్తించి బలోపేతం చేయాలి. మూలధనం, పటిష్టమైన మౌలిక సదుపాయాల లభ్యతను సులభతరం చేయాలి. నేషనల్ డీప్‌టెక్ స్టార్టప్ పాలసీ (ఎన్‌డిటిఎస్‌పి) అమలును వేగవంతం చేయాలి. స్టార్టప్ పర్యావరణ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. నిధులు, వాటి పెరుగుదలకు మద్దతునిచ్చే మార్కెట్ పర్యావరణ వ్యవస్థ, వాణిజ్యీకరణకు సహాయపడే బలమైన ప్రోత్సాహకాలు ఇవ్వాలి." అని నాస్కామ్, గ్లోబల్ కన్సల్టింగ్ సంస్థ జిన్నోవ్ తన రిపోర్టులో ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందాలి

- నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వికె సరస్వత్
- ఘనంగా ట్రిపుల్‌ఐటి డిఎం స్నాతకోత్సవం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్
గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని నీతి ఆయోగ్ సభ్యులు డాక్టర్ వికె. సరస్వత్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం కర్నూలులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మ్యానుఫ్యాక్చరింగ్ డిజైనింగ్ అండ్ మ్యానుఫాక్చరింగ్ (ట్రిపుల్ ఐటిడిఎం) ఆరవ స్నాతకోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థ డైరెక్టర్ బిఎస్.మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా వికె.సరస్వత్, ట్రిపుల్ ఐటిడిఎం వ్యవస్థాపక డైరెక్టర్ సోమయాజులు పాల్గొన్నారు. విద్యార్థులనుద్దేశించి సరస్వత్ మాట్లాడుతూ... సమాజంలోని ప్రస్తుత సవాళ్లకు ఇంటర్ డిసిప్లీనరీ పరిశోధనలు సమాధానాలు కనుగొనవని, నానోటెక్నాలజీ, డేటాసైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ మన జీవితాన్ని మార్చడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చితే సైన్స్ పరిశోధనలు భారతదేశంలో తక్కువ ఖర్చులో అందుబాటులో ఉన్నాయని వివరించారు. గ్రామీణ సమస్యలను పరిష్కరించడానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వేషించాల్సిన అవసరం ఉందని విద్యార్థులకు సూచించారు. తద్వారా పట్టణ వలసలను నియంత్రించవచ్చని తెలిపారు. డైరెక్టర్ బిఎస్.మూర్తి మాట్లాడుతూ.. విద్యార్థులు ఉద్యోగార్థులుగా కాకుండా ఉద్యోగ సృష్టికర్తలుగా ఉండాలని సూచించారు. అవుట్‌గోయింగ్ విద్యార్థులు క్యాంపస్‌కు అంబాసిడర్‌లుగా ఉండాలని ఆకాంక్షించారు. సిఎస్ఇ, మెకానికల్ ఇంజనీరింగ్, వివిధ శాఖల నుంచి 143 మంది విద్యార్థులు డిగ్రీ పట్టాలు, ఐదుగురు విద్యార్థులు బంగారు పతకాలు అందుకున్నారు. తిరుపతి ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ, ఎన్ఐటి రాయ్‌పూర్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమణారావు. కర్నూలు ట్రిపుల్‌ఐటి డిఎం రిజిస్ట్రార్ గురుమూర్తి, సెనేటర్లు, డీన్లు, ఇన్‌స్టిట్యూట్ హెడ్స్ పాల్గొన్నారు.


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న సరస్వత్

రిలయన్స్ డైరెక్టర్‌గా యాసిర్‌పై వాటాదారుల విముఖత..!

న్యూఢిల్లీ : సౌదీ అరామ్‌కో ఛైర్మన్ యాసిర్ ఒత్మాన్ హెచ్ అల్ రుమయ్యన్‌ను రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో స్వతంత్ర డైరెక్టర్‌గా పునర్నియమించడాన్ని 16 శాతం మంది వాటాదారులు వ్యతిరేకించారు. అయితే.. మెజారిటీ ఇన్వెస్టర్లు 83.97 శాతం మద్దతు పలకడంతో ఐదేళ్ల పాటు కంపెనీ బోర్డులో స్వతంత్ర డైరెక్టర్‌గా కొనసాగనున్నారు. కంపెనీ ఎగ్జిక్యూటివ్ పిఎంఎస్ ప్రసాద్‌ను మరో ఐదేళ్ల పాటు డైరెక్టర్‌గా మళ్లీ నియమించేందుకు వాటాదారులు ఆమోదం తెలిపారు. యాసిర్‌కు బోర్డ్ లేదా కమిటీల సమావేశాలకు హాజరైనందుకు రుసుము, ఇతర సమావేశాలలో పాల్గొనడానికి అయ్యే ఖర్చుల రీయింబర్స్‌మెంట్, లాభానికి సంబంధించిన కమీషన్ ద్వారా రెమ్యునరేషన్ చెల్లించనుంది.




రేపటి నుంచి అమెజాన్ 'బిజినెస్ వెల్యూడేస్'

బెంగళూరు : అమెజాన్ బిజినెస్ వ్యాపార కస్టమర్స్ కోసం జూన్ 24 నుండి 30 వరకు 'బిజినెస్ వేల్యూ డేస్'ను ప్రకటించినట్లు అమెజాన్ ఇండియా తెలిపింది. ఇందులో వ్యాపార కస్టమర్లకు అదనపు ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు ఆ సంస్థ పేర్కొంది. అనేక ఉత్పత్తులపై 70 శాతం వరకు డిస్కౌంట్ కల్పిస్తున్నట్లు పేర్కొంది. బిజినెస్ కస్టమర్స్ అదనంగా 10 శాతం లేదా రూ.9999 వరకు క్యాష్‌బ్యాక్ కూడా పొందవచ్చని తెలిపింది. స్మార్ట్ వాచెస్, గృహోపకరాలు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులపై భారీ ఆఫర్స్‌ను అందిస్తున్నట్లు వెల్లడించింది.

కేంద్రానికి బిఒఎం రూ.857 కోట్ల డివిడెంట్

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర (బిఒఎం) కేంద్ర ప్రభుత్వానికి రూ.857 కోట్ల డివిడెండ్‌ను ప్రకటించింది. ఆర్థిక సంవత్సరం 2023-24గాను ఆ మొత్తానికి విలువ చేసే చెక్కును కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌కు బిఒఎం ఎండి, సిఇఒ నిధు సక్సేనా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆశీష్ పాండే అందజేశారు. ప్రతీ ఈక్విటీ షేర్‌పై 14 శాతం డివిడెండ్ చెల్లించాలని నిర్ణయించింది. 2023-24లో బిఒఎం నికర లాభాలు రికార్డ్ స్థాయిలో 55.84 శాతం పెరిగి రూ.4,055 కోట్లకు చేరాయి. ఇంతక్రితం 2022-23లో రూ.2,602 కోట్ల నికర లాభాలు నమోదు చేసింది.



స్టాన్లీ లైఫ్‌స్టైల్ ఐపిఒకు బ్రోకరేజీల మద్దతు

ముంబయి : సూపర్ ప్రీమియం, లగ్జరీ ఫర్నిచర్ బ్రాండ్ స్టాన్లీ లైఫ్ స్టైల్స్ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు ప్రముఖ బ్రోకరేజ్‌ల నుండి సబ్‌స్క్రైబ్ రేటింగ్‌ను అందుకున్నట్లు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. జూన్ 21న తెరువబడిన ఈ ఐపిఒ జూన్ 25తో ముగియనుంది. ఈ ఇష్యూలో రూ.537 కోట్ల నిధులు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఇప్పటికే యాంకర్ ఇన్వెస్టర్ల నుంచి రూ.161.11 నిధులు సమీకరించింది. అనేక రకాల గృహ పరిష్కారాలతో పాటుగా విస్తృత శ్రేణి లగ్జరీ ఫర్నిచర్ వస్తువులను ఈ కంపెనీ అందిస్తుంది.

సంపాదకీయం

వాస్తవ ప్రతీకలు

నిజం నిష్ఠూరంగానే కాదు...నగ్నంగానూ ఉంటుంది. అణచివేత ఎప్పుడూ ఆక్రోశం, ఆగ్రహజ్వాలగానే మారుతుంది. అల్లకల్లోలం సృష్టిస్తుంది. నిర్భయంతో వుండే గుండెలను నిర్బంధం ఎప్పుడూ నియంత్రించలేదు. అంతేకాదు... నియంతలెప్పుడూ నిటారుగా నిలువలేరు. నిలిచిన దాఖలాలు చరిత్రలో లేవు. విమర్శ, వ్యంగ్యం, ప్రశ్నించేతత్వం కళలకు జీవం పోస్తాయి. అలాంటి కళలకు ఒకప్పుడు విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థల నుంచి గొప్ప ప్రోత్సాహం లభించేది. వీధిలోనైనా విశ్వవిద్యాలయంలోనైనా...నిగ్గదీసి అడిగేది, పిడికిలి బిగించి ప్రశ్నించే గొంతుక కళా రూపమే. ప్రఖ్యాత నాటకకర్త షేక్స్‌పియర్ 'నాటక రంగస్థలం ప్రకృతికి పట్టే అద్దం వంటిది' అంటాడు. ఈ పాత్రలు నిజమైన వ్యక్తులు కారు. నిజమైన వ్యక్తులవలె రూపొందించబడి, వ్యవహరించే ప్రతీకలు. 'అవస్థాను కృతిర్నాట్యమ్' అంటాడు ధనుంజయుడు. అంటే 'నాట్యం జీవితంలోని విభిన్న అవస్థలకు అనుకృతి'. ప్రజల అవస్థల రూపాన్ని వ్యంగ్యంగానో, చురుక్కుమనేలాగో ప్రతీక పాత్రలు రూపుకట్టిస్తాయి.

భారతీయులకు విస్తారమైన సాంస్కృతిక వారసత్వం వుంది. సాహిత్యం, కళారూపాలు, నాటకాలను నిత్యం సజీవంగా వుంచే బుద్ధిజీవులు ఈ గడ్డపై వున్నారు. కళ కళకోసం కాదు... ప్రజలకోసం అంటూ వీధి నాటక కేతనమైన సఫ్దర్ హష్మీ హత్య భారతదేశ మనస్సాక్షిని కదిలించింది. దేశంలోని ప్రతి నాడినీ తాకింది. 'నా గుండెల్లో సూది గుచ్చుకుంటే చాలు... ఏ శ్రీశ్రీ కలం కరిగో విప్లవ గేయాన్నైపోయుందును' అంటాడో కవి. ప్రజా చైతన్యానికి వీధి నాటికను అత్యంత చైతన్యవంతంగా వినియోగించిన గొప్ప కళాకారుడు హష్మీ. స్వేచ్ఛా స్వాతంత్ర్యం, రాజకీయాలు-నేర సంబంధాలపై అసహనం, ఉదారవాద ప్రజాస్వామ్యంపై స్వారీ చేసే క్రూరమైన శక్తులతో ఘర్షణ పడినందునే హష్మీ హత్యగావించబడ్డాడు. ప్రశ్నించే గొంతులు, నినదించే పిడికిళ్లు అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ వుంటాయి. అయితే, హత్యలు, నిరంకుశ అణచివేతలు ఇప్పుడు మరింత పెరిగాయి. ఈ కోవలో వెల్లువెత్తిన అనేక ఉద్యమాలను చూశాం. రైతుల సుదీర్ఘ ఉద్యమం, హిజాబ్ ఆంక్షలకు ఎదురు తిరిగిన అమ్మాయిల చైతన్యం ఈ నేలపైనే చూశాం. నిజం కోసం నిలబడి ప్రాణాలర్పించిన కల్బుర్గి, పన్సారే, దబోల్కర్, గౌరీ లంకేష్ వంటి వారినీ చూశాం. తాజాగా రామాయణాన్ని, అందులోని రాముడి గుణగణాలను ప్రశ్నిస్తూ 'రాహొవన్' పేరిట వ్యంగ్య నాటకాన్ని ప్రదర్శించిన 8 మంది విద్యార్థులకు ఐఐటి- బాంబే భారీ జరిమానా విధించింది. ఈ ఏడాది మార్చి 31న పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఫెస్టివల్ (పిఎఎఫ్)లో భాగంగా ఈ నాటకం ప్రదర్శించారు. అయితే ఈ నాటకం రాముడిని, రామాయణాన్ని కించపర్చేలా ఉందని సంఘ్‌పరివార్‌కి చెందినవారు విద్యాసంస్థ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి విద్యార్థులపై చర్యలకు ఒత్తిడి తెచ్చారు. ఆ ఒత్తిళ్లకు తలొగ్గిన అధికారులు నాటకం ప్రదర్శించిన విద్యార్థులకు జరిమానా విధించారు. గతంలో బెంగళూరు జైన్ విశ్వవిద్యాలయం, అస్సాంలోని బోడోలాండ్ విశ్వవిద్యాలయం వంటి చోట్ల కూడా ఇలాంటి సంఘటనలే జరిగాయి.

ఒక కళారూపం ప్రదర్శించిన విద్యార్థులకు జరిమానా అంటే...అది భావప్రకటనా స్వేచ్ఛ అణచివేత... అరాచకత్వానికి పరాకాష్ట. భావప్రకటనను నియంతృత్వంతో అంతం చేయాలని కంకణం కట్టుకుంది మోడీత్వ హిందూ సామ్రాజ్యవాదం. దీన్ని ఎదుర్కోవాలంటే...వేల గొంతుకలు చైతన్య ప్రతీకలుగా మారతాయి. 'పువ్వులకో కాయలకో గాయాలైతే/ కావ్యాలైపోయిన దేశంలో నేను పువ్వుగానో/ ఆకుగానో పుట్టాల్సింది' అంటారు కలేకూరి ప్రసాద్. వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ... కవల పిల్లలు. ఈ రెంటినీ కలిపివుంచే సాహిత్య రూపమే కళారూపం. అందుకే 'నాటకాంతంహి సాహిత్యం' అన్నారు. తమ రూపానికి ప్రతీకలుగా మారిన భావ ప్రకటనా స్వేచ్ఛను అణచివేయడానికి సిద్ధంగా వుండే ధనాఢ్యశక్తులకు ప్రభుత్వాలు కొమ్ము కాస్తుంటాయి. ఈ విషయంలో మోడీ ప్రభుత్వం, సంఘ్‌పరివార్ శక్తులు నగ్నంగా వ్యవహరిస్తున్నాయి. 'స్వేచ్ఛను త్యజించడం అంటే మనిషిగా వుండటాన్ని త్యజించడం' అంటారు ఫ్రెంచ్ తత్వవేత్త జీన్ జాక్వెస్ రూసో. భావప్రకటనా స్వేచ్ఛ, ప్రశ్నించేతత్వం కళలకు జీవం పోస్తాయి. మనిషితత్వాన్ని నిలబెడతాయి. ఈ సత్యాన్ని విస్మరిస్తే...ప్రజల రాజకీయ హక్కులు కూడా అణచివేతకు గురవుతాయి.

మహనీయుల మాట




దురలవాట్లు మొదట్లో
సాలెగూళ్ళ లాంటివి.
తర్వాత అవి ఇనుప గొలుసులై
మిమ్మల్ని బంధిస్తాయి.
- లాంగ్ ఫెలో,
కవి, విద్యావేత్త.

Henry W. Longfellow.

రాజకీయ తీర్పు తర్వాత రాజ్యాంగ తీర్పులు?

ప్రస్తుతం



తెలకపల్లి రవి

లోక్‌సభకూ ఎ.పి తో సహా నాలుగు శాసనసభలకూ ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వాలు కొలువు తీరాయి. అప్రతిహతంగా సాగిపోతుందనుకున్న నరేంద్ర మోడీ హవాకు బ్రేకులు వేశారు ఓటర్లు. మిశ్రమ కూటమిగానే ఆయన అధికారం చేపట్టవలసి వచ్చింది. మోడీ సర్కారు ఏకపక్ష పోకడలకు ఇకనైనా కొంత పగ్గాలు పడతాయని ప్రజాస్వామిక లౌకిక వాదులు ఎదురు చూస్తున్నారు. ప్రజా న్యాయస్థానంలో పరిస్థితి ఇదైతే రాజ్యాంగ న్యాయస్థానాల్లో అంటే న్యాయ వ్యవస్థలో ఏమైనా మార్పులు రావడానికి ఇది దారితీస్తుందా అనే చర్చ న్యాయవర్గాల్లో సాగుతున్నది. ఎందుకంటే సంపూర్ణమైన ఆధిక్యత లేదంటే అంతకు మించిన సంఖ్యాబలం కలిగిన ఏక పార్టీ ప్రభుత్వాలు వున్నప్పుడు న్యాయవ్యవస్థ ఒకింత ఆలోచించి అడుగు వేస్తుందనేది ఇన్నేళ్ల అనుభవం. నిజానికి రాజ్యాంగం న్యాయ వ్యవస్థకు పూర్తి స్వయంప్రతిపత్తి ఇచ్చినప్పటికీ రాజకీయ వాస్తవాలు దృష్టిలో పెట్టుకుని ఇలా జరుగుతుంటుందని అంటుంటారు.

వివాదాలు, ఆరోపణలు

రాజ్యాంగ సంబంధమైన అంశాలలో కూడా సుప్రీం కోర్టు తీర్పులు, ఆదేశాలు, ఆలస్యాలు రకరకాల వ్యాఖ్యలకు విమర్శలకు దారితీశాయి. తెలుగు రాష్ట్రాలలోనూ వేర్వేరు ప్రభుత్వాలు, ముఖ్యమంత్రులు తమ తమ అనుకూలతలను బట్టి కోర్టులపై వ్యాఖ్యలు చేయడం తెలిసిన విషయమే. కేరళ, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలలోనూ కోర్టులపై వివాదాస్పద సన్నివేశాలు చూశాం. 1991-1996 మధ్య కాంగ్రెస్ మెజార్టీ కోల్పోయిన పరిస్థితి. తర్వాత యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం వున్నప్పుడే న్యాయవ్యవస్థ క్రియాశీలత వంటి పదాలు ఎక్కువగా వాడుకలోకి వచ్చాయి. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావును కూడా విచారించిన ఘట్టం అప్పుడే చూశాం. మళ్లీ 2004-14 మధ్య మన్మోహన్ సింగ్ హయాంలో మరీ ముఖ్యంగా మలి దఫా పాలనలో 2జి స్పెక్ట్రం, బొగ్గు గనుల వేలం, కామన్‌వెల్త్ క్రీడలు ప్రతీదీ సుప్రీం కోర్టు ముందుకు రావడం దేశ రాజకీయాలపై ఎంతో ప్రభావం చూపింది. అదే మోడీ హయాంలో రాఫెల్ కుంభకోణం వంటివి కూడా కోర్టులలో తేలిపోయాయి. అయోధ్య తీర్పు, శబరిమల వివాదం, కాశ్మీర్ 370 అధికరణం ప్రతిపత్తి, పౌరసత్వ సవరణ చట్టం, ఇవిఎంలు, ఎన్నికల బాండ్లు ఇంకా అనేక అంశాల్లో అత్యున్నత న్యాయస్థానం తీరు అసంతృప్తి మిగిల్చింది. రాజకీయ నేతలు, మీడియా ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు, ఆఖరుకు ముఖ్యమంత్రుల వంటివారిపై కేసులలోనూ భిన్న ప్రమాణాలు పాటించడం ప్రశ్నార్థకమైంది. సుప్రీంకోర్టు ప్రధాన నాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులు కూడా పదవులలో పునరావాసం పొందిన తీరు మరో వివాదమైంది. ఈ నేపథ్యంలో బిజెపికి స్వంతంగా మెజార్టీ లేని ప్రస్తుత పరిస్థితి న్యాయవ్యవస్థపై ఎలాంటి ప్రభావం చూపుతుంది? ఇది ఇప్పుడు, అనేకమందిని ఆలోచింపచేస్తున్న అంశం. సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ స్వయంగా ఈ మాటన్నారు. బలమైన కార్యనిర్వాహక వర్గం (ఎగ్జిక్యూటివ్) వుంటే న్యాయవ్యవస్థ గట్టి వైఖరి తీసుకోవడానికి కాస్త తటపటాయిస్తుందని ఆయన అన్నారు.



సిజెఐ చంద్రచూడ్ వ్యాఖ్యలు

సిజెఐ చంద్రచూడ్ పదవీ కాలం ఈ నవంబర్ నెలతో ముగుస్తుంది. ఇటీవలి కాలంలో అత్యధిక కాలం పదవిలో వుంటున్న సిజెఐ ఆయనే. స్వలింగ వివాహాల వంటి సామాజికాంశాల్లో సంచలన తీర్పులకు ఆధ్వర్యం వహించిన సిజెఐ చంద్రచూడ్ రాజకీయ రాజ్యాంగ అంశాల్లో ఒక విధంగా...మిశ్రమ వ్యాఖ్యలే మూటకట్టుకున్నారు. ఎన్నికల బాండ్లపై వెలువడిన తీర్పు ఇటీవలి కాలంలో ప్రత్యేకించి చెప్పుకోవాలి. నవంబర్ రెండవ వారంలో పదవీ విరమణ చేసే ముందు ఆయన ఆరు రాజ్యాంగ సమస్యలపై తీర్పులు ఇవ్వాల్సి వుంటుంది. సిజెఐతో కూడిన రాజ్యాంగ ధర్మాసనాల ముందున్న తీర్పులు వాయిదా పడితే మళ్లీ కొత్త వారు రావడం, వీటిని పునర్వ్యవస్థీకరించడం పెద్ద ప్రక్రియ. ఆలస్యానికి దారితీయొచ్చు. అందుకే వేగంగా పూర్తి చేస్తుంటారు.

ఎస్.సి, ఎస్.టి మైనార్టీ ప్రతిపత్తి

రాజ్యాంగం 16వ అధికరణం కింద వున్న ఎస్.సి, ఎస్.టి రిజర్వేషన్లలో వర్గీకరణ ఉప వర్గీకరణ చెల్లుతుందా అనే అంశాన్ని ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఫిబ్రవరిలో విచారించింది. 2010లో పంజాబ్ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌తో పాటు 2004 ఎ.పి వర్గీకరణ అంశంలో ఇచ్చిన తీర్పు తర్వాత పంజాబ్ విధానం అమలు కాకుండా పోయింది. అయితే ఈ విధంగా కొట్టివేయడం ఇందిరా సహానీ కేసులో 1992లో ఇచ్చిన చారిత్రాత్మక తీర్పుకు విరుద్ధమని పంజాబ్ వాదిస్తున్నది. ఆ కేసు తర్వాత చిన్నయ్య కేసులో సుప్రీం కోర్టు ఉప వర్గీకరణ కుదరదని చెప్పింది. ఇప్పుడు దీనిపై తుది తీర్పు వెలువడవలసి వుంది.

ప్రతిష్టాత్మక అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (ఎ.ఎం.యు) రాజ్యాంగం 30వ అధికరణం ప్రకారం మైనార్టీ సంస్థ కిందకు వస్తుందా లేదా అనే అంశంలోనూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించాల్సి వుంది. 2006లో అలహాబాద్ హైకోర్టు మైనార్టీ ప్రతిపత్తి కొట్టివేస్తూ ఇచ్చిన తీర్పును ఎ.ఎం.యు సుప్రీంలో సవాలు చేసింది. తమ మైనార్టీ ప్రతిపత్తికి ముప్పు తెచ్చేలా ఎ.ఎం.యు చట్టానికి చేసిన వివిధ సవరణలు చెల్లవని వాదించింది. అలహాబాద్ హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టు స్టే విధించింది. రంజన్ గొగోయ్ సిజెఐగా వుండగా ఈ కేసును ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి అప్పగించారు. ఫిబ్రవరిలో ఈ కేసు విచారణ ముగించిన ధర్మాసనం తీర్పు రిజర్వులోవుంచింది. ఈ కేసులో తీర్పు దేశవ్యాపితంగా మైనార్టీ సంస్థల హక్కులకు సంబంధించి చాలా ప్రభావం చూపనుంది.

ఆస్తుల పున:పంపిణీ తప్పా?

మూడో కేసుకు మరింత కీలకమైన రాజకీయ ప్రాధాన్యత వుంది. నిజానికి ప్రధాని మోడీ ఎన్నికల ప్రచారంలో దాన్ని వివాదాస్పదం చేశారు కూడా. సంపద పున:పంపిణీ జరగాలన్న రాజ్యాంగ నిర్దేశాన్ని పక్కదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఒక దశలో మతం రంగు కూడా పులిమారు. వాస్తవం ఏమంటే రాజ్యాంగం 39వ అధికరణం సమాజ భౌతిక వనరులను సమిష్టి ప్రయోజనం కోసం ఉపయోగించాలని చెబుతున్నది. సమాజ భౌతిక వనరులను ఉమ్మడి ప్రయోజనం కోసం పున:పంపిణీ చేయాలని ఈ అధికరణం(బి) పేర్కొంటున్నది. అయితే వ్యక్తిగత ఆస్తిని సమాజానికి చెందిన భౌతిక సంపదగా పరిగణించవచ్చునా అనే అంశంపై సుప్రీం కోర్టులో అనేక కేసులు దాఖలయ్యాయి. ముంబయిలోని ఆస్తి యజమానుల సంఘం పేరుతో 20 వేలమంది భూ యజమానులు 1991లో మొదటి పిటిషన్ వేశారు. కొన్ని ఆస్తులను తీసుకోవచ్చునని మహారాష్ట్ర శాసనసభ చేసిన సవరణను వారు సవాల్ చేశారు. ఇదిలా వుండగానే 2019లో మళ్లీ మహారాష్ట్ర ప్రభుత్వమే గృహ చట్టానికి సవరణ చేస్తూ నిర్ణీత గడువు లోపల ఆస్తి యజమానులు గనక ఆస్తిని పునరుద్ధరించకపోతే ప్రభుత్వం దాన్ని స్వాధీనం చేసుకోవచ్చని నిర్ణయించింది. ఈ సవరణ వల్ల నివాస గృహ సముదాయాలను హస్తగతం చేసుకోవడానికి మహారాష్ట్ర భవన మరమ్మతులు పునరుద్ధరణ బోర్డుకు నిర్నిబంధమైన అధికారాలు సంక్రమిస్తాయంటూ వారు ఆరోపించారు. ప్రైవేటు ఆస్తులు నిజంగా 39(ఎ) అధికరణం కింద పున:పంపిణీ చేయడానికి అవకాశం వుంటుందా అనే అంశంపై ఇప్పుడు సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వాల్సి వుంది. ఇక్కడ మౌలికమైన అంశం ఏమంటే రాజ్యాంగం సంక్షేమరాజ్య భావనలో ఆర్థిక అసమానతల తొలగింపు కీలకాంశం. మోడీ వంటి వారు మాత్రం ఇదేదో వ్యక్తి గత ఆస్తి హక్కుకు భంగకరమన్నట్టు ప్రచారం చేసి అదరగొట్టడానికి ప్రయత్నించారు. మన దేశంలో కూడా ఇటీవలి వరకూ ఈ సంపద పన్ను, వారసత్వ ఆస్తి పన్ను వుండేవి. ఈ పరిస్థితుల్లో సుప్రీంకోర్టు ఇచ్చే తీర్పు ముంబయి కేసుకే గాక దేశ విధానాలకే గీటురాయి కానుంది.

గనులు, ఆల్కహాలు

ఇక మిగిలిన రెండు రాజ్యాంగ కేసులు రాష్ట్ర కేంద్ర హక్కులకు ఆదాయాలకు సంబంధించినవి. పారిశ్రామిక ఆల్కహాలు, మద్యపానం ఆల్కహాలు పరిధి గురించిన చర్చ ఇది. పారిశ్రామిక ఆల్కహాలుపై నియంత్రణ ఎవరిదనేది ప్రశ్న, ఇవి రెండూ స్పిరిట్ నుంచే తయారవుతాయి. మరిన్ని రసాయన ప్రక్రియల తర్వాత అది పారిశ్రామిక ఆల్కహాలుగా మారుతుంది. ఏడవ షెడ్యూలులో ఈ రెంటినీ వుంచడం పరస్పర విరుద్ధ వ్యాఖ్యానాలకు దారితీస్తున్నది. ప్రజా క్షేమం రీత్యా పరిశ్రమలపై నియంత్రణ కలిగివుండే హక్కు కేంద్రానికి వుంది. మరోవైపున ప్రజల ఆరోగ్యానికి భంగం కలిగించే విష పదార్థాలను నియంత్రణ రాష్ట్ర అధికారంగా వుంది. దాంతో ఎవరు అదుపు చేయాలనేదానిపై వివాదం కొనసాగుతున్నది. సిజెఐ చంద్రచూడ్ ధర్మాసనం దీన్ని విచారించి తేల్చవలసి వుంది.

గనుల నుంచి లోహాల తవ్వకంపై చెల్లించే రాయల్టీ పన్ను కిందకు వస్తుందా అనేది కూడా 25 ఏళ్ల కాలంగా వివాదంగా వుంది.గనులు లోహాల చట్టం సెక్షన్9 వాటిని తవ్వుకునేవారు కేంద్రానికి రాయల్టీ చెల్లించాలని నిర్దేశిస్తుంది. దాన్ని గనక పన్నుగా పరిగణించేట్టయితే అప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అదనపు పన్ను విధించవచ్చు. 1963లో తమిళనాడు ప్రభుత్వం ఇండియా సిమెంట్స్‌పై రాయల్టీ గాక అదనపు పన్ను విధించడంతో ఈ వివాదం మొదలైంది. దాని మీద వరసగా విచారణలు జరిపిన అనంతరం 1989లో సుప్రీంకోర్టు రాయల్టీ ఒక పన్ను అని నిర్ధారించింది. ఈ నిర్ణయం గనుల కాంట్రాక్టర్లకు పారిశ్రామిక వేత్తలకు మింగుడు పడలేదు.వారు అనేక హైకోర్టులలోనూ సుప్రీం లోనూ సవాలు చేయగా అదేదో అనుకోకుండా జరిగిన అచ్చు తప్పు వంటిదని అభిప్రాయం వెలిబుచ్చాయి. అదనపు పన్నును గురించి మాత్రమే కోర్టు పరిశీలించింది తప్ప రాయల్టీని ఉద్దేశించి తీర్పు చెప్పలేదని వివిధ కోర్టులు వ్యాఖ్యానించాయి. ఇది పన్ను అని తేలిస్తే రాష్ట్రాలు దాన్ని పెంచి ఆదాయం పెంచుకోవడానికి వీలవుతుంది. అసలే వనరుల కొరతతో ఇబ్బంది పడే రాష్ట్ర ప్రభుత్వాలకు కాస్త వెసులుబాటు దక్కుతుంది. కొంతకాలం కిందట దీనిపై విచారణ జరిపిన తొమ్మిది మంది ధర్మాసనం తీర్పు రిజర్వు చేసి వుంచింది.

మరింత జటిలం

వీటన్నిటిపై ప్రజాస్వామిక పరిష్కారాలు వస్తాయా అని ఎదురు చూస్తుంటే పులి మీద పుట్రలా కొత్త వివాదాలు బయలుదేరాయి. ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను లిక్కర్ కేసులో కింద కోర్టు బెయిలుపై విడుదల చేస్తే ఢిల్లీ హైకోర్టు విడుదల ఆపింది. కానీ పోస్కో కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి ఎడియూరప్పను అరెస్టు చేయాలని కింద కోర్టు ఉత్తర్వులిస్తే మాజీ ముఖ్యమంత్రి విషయంలో అలా ఎలా చెప్తారని హైకోర్టు ఆపేసింది. ఈ ద్వంద్వ నీతిని న్యాయ నిపుణులు తీవ్రంగా ప్రశ్నించారు. లోక్‌సభ ఫలితాలు వచ్చాకనే ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్...ప్రముఖ రచయిత్రి అరుంధతీ రాయ్‌పై రాజద్రోహ నేరారోపణ విచారణ జరపాలని అనుమతినివ్వడం కూడా నిరసనకు గురైంది. నేర చట్టాలను ఇష్టానుసారం మార్చి అమలుకోసం హడావుడి పడటం కూడా ఆక్షేపణకు దారి తీస్తున్నది. అందుకే రానున్న రోజుల్లో ఈ అంశాలు దేశంలో మరింత చర్చనీయం కానున్నాయి. కార్యాచరణకూ దారితీస్తాయి. ★

వ్యాఖ్య

మహిళలకు న.మో వట్టి విస్తరి, పచ్చి మంచినీళ్లు

సత్య

బేటీ బచావో-బేటీ పఢావో, మహిళా సురక్ష కేంద్ర, మహిళా పోలీసు వలంటీర్లు, రాష్ట్రీయ మహిళా కోష్, సుకన్య సమృద్ధి యోజన, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ...ఇవన్నీ మన దేశంలో ఉన్న పథకాలు, ఎవరికో చెప్పనవసరం లేదు. కొన్ని రాష్ట్రాల్లో వీటికి పేర్లు మార్చి అమలు జరుపుతున్నారు. మొత్తం మీద ఇన్ని జరిగిన తరువాత కూడా ప్రపంచంలో స్త్రీ, పురుష సమానత్వ తేడాలో 2024 ప్రపంచ 146 దేశాల జాబితా ప్రకారం మన స్థానం 129. పదేళ్లతో పోల్చుకుంటే దిగజారింది. మహిళల అభ్యున్నతి గురించి గత పది సంవత్సరాలుగా గొప్పలు చెప్పుకున్న, మహిళలను వంచించిన వారు, వారికి భజన చేసిన ఘనులు తలలెక్కడ పెట్టుకుంటారో చూడాలి. పథకాలన్నీ మావే, రాష్ట్రాలు పేర్లు మార్చుకుంటున్నాయి, అందువలన మా ఫొటోలు పెట్టాలి, వాటి "ఖ్యాతి"లో మాకూ వాటా రావాలని కోరుతున్న బిజెపి పెద్దలు ఆ మొత్తాన్ని వారే తీసుకున్నా ఎవరికీ అభ్యంతరం లేదు. కేంద్రంలో, మెజారిటీ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నది బిజెపి, మిత్రపక్షాలే. మెరుగు పరచకపోయినా దిగజారటానికి నెపం నెహ్రూ మీదో, గాంధీ మీదో నెడితే కుదరదు.

సూచికలను రూపొందించటానికి నాలుగు అంశాలను ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. 1.ఆర్థిక వ్యవస్థలో భాగస్వామ్యం, అవకాశాలు, 2. విద్యా అవకాశాలు, 3. ఆరోగ్యం, బతుకు, 4. రాజకీయ సాధికారత. వీటన్నింటిలో ఏ దేశం ఎక్కడుందనే సూచికలు, పాయింట్లు వేస్తారు. వాటన్నింటిని కలిపి మొత్తంగా సాధారణ సూచికలను రూపొందిస్తారు. ఇలాంటి నివేదికలను 2006 నుంచి ప్రతి ఏటా రూపొందిస్తున్నారు. పరిగణనలోకి తీసుకున్న 146 దేశాల సగటు లింగ సమానత్వ తేడా 2024లో 68.5 శాతం ఉంది. గతేడాది కంటే కేవలం 0.1 శాతమే మెరుగైంది. అంటే 31.5 శాతాన్ని పూరించాల్సి ఉంది. ఇప్పుడున్న వేగంతో తేడాను పూర్తిగా తగ్గించాలంటే 134 సంవత్సరాలు పడుతుంది. ప్రపంచంలో నూటికి నూరు శాతం సమానత్వం సాధించిన దేశమేమీ లేదు. మొదటి స్థానంలో ఉన్న ఐస్‌లాండ్‌లో 93.5 శాతం సాధించారు. భారత్‌లో 64.1 శాతం ఉంది. ఈ లెక్కన పూర్తి సమానత్వం సాధించటానికి కనీసం 152 సంవత్సరాలు పడుతుంది. దక్షిణాసియా దేశాల సగటు తేడా 63.7 శాతమే. పది సంవత్సరాల నాడు మొత్తం ర్యాంకు మార్కులను చూస్తే 0.6455 కాగా తాజా సూచికలో 0.641కి దిగజారింది.



మన దేశంలో లింగ బేధాలను తగ్గించటంలో పదేళ్ల నరేంద్ర మోడీ పాలన ఘోరంగా విఫలమైంది. ఇరుగు పొరుగు దేశాలలో బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్ తరువాత ఐదవదిగా మన దేశం ఉంటే బిజెపి పెద్దలు నిత్యం స్మరించే పాకిస్తాన్ ఏడవదిగా ఉంది. ఆర్థిక భాగస్వామ్యం, ఆరోగ్యంలో 146కు గాను 142వదిగా ఉంది (మన తరువాత పాకిస్తాన్ ఉంది). విద్య అందుబాటులో 112, రాజకీయ రంగంలో 65, కార్మికశక్తి భాగస్వామ్యంలో 134వదిగా ఉంది. విద్యా అవకాశాలు, రాజకీయ సాధికారత తగ్గుదల కారణంగానే గతేడాది వచ్చిన 127వ ర్యాంకు 129కి దిగజారింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించినప్పటికీ ఆ స్ఫూర్తిని రాజకీయ పార్టీలేవీ పాటించలేదు. దాని ఘనత తమదే అని భుజాలు చరుచుకున్న బిజెపి 30 మంది క్యాబినెట్ మంత్రులకు గాను కేవలం ఇద్దరికి పరిమితం చేసింది. మొత్తం మంత్రివర్గంలో గతంలో ఉన్న పది మందిని ఈసారి ఏడుకు తగ్గించింది.

మన దేశంలో లింగ బేధాలను తగ్గించటంలో పదేళ్ల నరేంద్ర మోడీ పాలన ఘోరంగా విఫలమైంది. మరింత దిగజారింది. ఇరుగు పొరుగు దేశాలలో బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, భూటాన్ తరువాత ఐదవదిగా మన దేశం ఉంటే బిజెపి పెద్దలు నిత్యం స్మరించే పాకిస్తాన్ ఏడవదిగా ఉంది. ఆర్థిక భాగస్వామ్యం, ఆరోగ్యంలో 146కు గాను 142వదిగా ఉంది (మన తరువాత పాకిస్తాన్ ఉంది). విద్య అందుబాటులో 112, రాజకీయ రంగంలో 65, కార్మికశక్తి భాగస్వామ్యంలో 134వదిగా ఉంది. విద్యా అవకాశాలు, రాజకీయ సాధికారత తగ్గుదల కారణంగానే గతేడాది వచ్చిన 127వ ర్యాంకు 129కి దిగజారింది. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును ఆమోదించినప్పటికీ ఆ స్ఫూర్తిని రాజకీయ పార్టీలేవీ పాటించలేదు. దాని ఘనత తమదే అని భుజాలు చరుచుకున్న బిజెపి 30 మంది క్యాబినెట్ మంత్రులకు గాను కేవలం ఇద్దరికి పరిమితం చేసింది. మొత్తం మంత్రివర్గంలో గతంలో ఉన్న పది మందిని ఈసారి ఏడుకు తగ్గించింది. నేపాల్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో ఉన్న మంత్రులలో 23.5 శాతం మంది మహిళలే. చట్టసభల్లో మహిళల ప్రపంచ సగటు 33 శాతం కాగా అక్కడ 49.9 శాతం ఉంది.

జనాభాలో సగంగా ఉన్న మహిళలకు ఉత్పాదక రంగంలో భాగస్వామ్యం కల్పించకుండా వారి సాధికారత గురించి ఎన్ని కబుర్లు చెప్పినా వట్టి విస్తరి పచ్చి మంచి నీళ్ల తప్ప మరొకటి కాదు. గడచిన పది సంవత్సరాల్లో జరిగింది అదే. లింగ సమానత్వ తాజా నివేదికలో మన దేశంలో కార్మిక శక్తిలో మహిళా భాగస్వామ్యం 35.09 శాతం ఉన్నట్లు పేర్కొన్నారు. ఇది కూడా ప్రభుత్వం అందచేసిన తప్పుడు లెక్కల కారణంగానే. నిజంగానే అంత ఉందా? లోక్‌సభ ఎన్నికలకు ముందు తాత్కాలిక బడ్జెట్‌ను ప్రవేశట్టే ముందు నరేంద్ర మోడీ తన పాలనలో మహిళాభ్యున్నతిని చూసి ప్రతిపక్షాలు ఆత్మశోధన చేసుకోవాలని చెప్పారు. తన పదేళ్ల ఏలుబడిలో దిగజారిన ర్యాంకును చూసి తల వంచుకుంటారా? ప్రతిపక్షాలకు సుభాషితాలు చెబుతూనే ఉంటారా? ప్రభుత్వం ప్రకటించిన సమాచారాన్ని విశ్లేషించిన పరిశోధకులు చెబుతున్న అంకెలకు, ప్రభుత్వ లెక్కలకు పొంతన కుదరటం లేదు. స్టాటిస్టా విశ్లేషణ ప్రకారం 2014 నుంచి 2022 వరకు తొమ్మిదేళ్ల సగటు 26.81 శాతం కాగా 2023లో 32.68 శాతం ఉన్నట్లు అదే సంస్థ పేర్కొన్నది. ఒక్కసారిగా అంత ఎలా పెరిగింది? ప్రపంచ బ్యాంకు లెక్క 32.7 శాతం అన్నది. దేశంలో 2022-23లో నియమిత కాల కార్మిక శక్తి సర్వే ప్రకారం మహిళలు అంతకు ముందుతో పోలిస్తే 4.2 శాతం పెరిగి యూజువల్ స్టేటస్ లెక్కింపు అవగాహన ప్రకారం 37 శాతానికి చేరినట్లు కేంద్ర ప్రభుత్వం గతేడాది అక్టోబరు తొమ్మిదిన ప్రకటించింది. అందుకే అంకెల గారడీ అనాల్సి వస్తోంది.

ఇండియా టుడే వెబ్‌సైట్ 2023 జూన్ పదకొండున రోషిణీ చక్రవర్తి రాసిన విశ్లేషణకు "భారత్‌లో తగ్గుతున్న మహిళా శ్రామికులు, ఎందుకు మహిళలు పని చేయటం లేదు?" అనే శీర్షిక పెట్టింది. భారత్‌లో వేతనాలు చెల్లించే ఉపాధిలో మహిళలు ఇరవై శాతానికి లోపుగానే ఉన్నట్లు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) నివేదికను దానిలో ఉటంకించారు. ఐఎల్‌ఓ నివేదిక ప్రకారం ఉపాధిలో కేవలం 19.2 శాతం మంది మాత్రమే మహిళలు ఉండగా పురుషుల్లో 70.1 శాతం ఉన్నారు. మహిళల భాగస్వామ్యం పెరిగితే 2025 నాటికి జిడిపిలో 70 వేల కోట్ల డాలర్లు పెరుగుతుందన్నది ఒక అంచనా. ఐఎల్‌ఓ నివేదిక ప్రకారం భారత్‌లో 52 శాతం మంది మహిళలు వేతన ఉపాధి లేదా లేదా కుటుంబ సంరక్షణలో రెండింటిలో ఉంటామని చెప్పారు. కానీ 2005లో 32 శాతంగా ఉన్న మహిళా శ్రామిక శక్తి 2021 నాటికి 19.2 శాతానికి తగ్గింది. ప్రముఖ మీడియా సంస్థ అల్ జజీరా 2023 ఏప్రిల్ పదిన ఒక విశ్లేషణ ప్రచురించింది. "జనాభాలో భారత్ దూసుకుపోతున్నా శ్రామిక శక్తిలో తగ్గుతున్న మహిళలు" అని పేరు పెట్టింది. ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్న భారత్ మహిళా శ్రామిక శక్తిలో ప్రపంచంలోని అతి తక్కువ 20 దేశాల్లో ఒకటిగా ఉందని, గత కొద్ది సంవత్సరాలుగా తగ్గుతున్నట్లు పేర్కొన్నది. పెరుగుతున్న జనాభాకు ప్రత్యేకించి మహిళలకు ఉపాధిని చూపటంలో విఫలమైతే భారత్‌కు అది గుదిబండగా మారుతుంది. అధికారిక సమాచారాన్ని విశ్లేషించినపుడు 2004లో గరిష్టంగా 35 శాతం మంది మహిళలు ఉపాధి పొందగా 2022 నాటికి 25 శాతానికి తగ్గినట్లు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయానికి చెందిన ఆర్థికవేత్త రోజా అబ్రహం చెప్పిన అంశాన్ని అల్ జజీరా ఉటంకించింది. సిఎంఐయి ఉపాధి నిర్వచనం ప్రకారం 2022లో పని చేసే వయస్సులో ఉన్నవారిలో కేవలం పదిశాతం మంది మాత్రమే అంటే 3.9 కోట్ల మంది మాత్రమే పని చేస్తూ ఉండటం లేదా పని కోసం ఎదురు చూస్తున్నవారున్నారని, అదే పురుషుల విషయానికి వస్తే 36.1 కోట్ల మంది ఉన్నట్లు పేర్కొన్నది. పని చేయగలిగిన వయస్సు వారి పెరుగుదలకు అనుగుణంగా ఉపాధి పెరగటం లేదని, గత దశాబ్దిలో మంచి ఉద్యోగాలు గణనీయంగా తగ్గినట్లు, తక్కువ వేతనాలతో పని చేయటం కంటే ఇల్లు, పిల్లలను చూసుకోవటం మరింత లాభదాయకమని వారి కుటుంబాలు భావిస్తున్నాయని సిఎంఐఇ డైరెక్టర్ మహేష్ వ్యాస్ చెప్పిన మాటలను ఉటంకించింది. శ్రామిక శక్తిలో మహిళల భాగస్వామ్యం పది శాతం పెరిగితే జిడిపి 552 బిలియన్ డాలర్ల మేరకు అదనంగా పెరుగుతుందని 2018లో మెకెన్సీ నివేదిక పేర్కొన్నది. చిత్రం ఏమిటంటే మహిళలకు అన్ని గ్యాస్ కనెక్షన్లు ఇచ్చాం, ఇన్ని మరుగుదొడ్లు కట్టించాం అని ఊరూ వాడా ప్రచారం చేసే బిజెపి ప్రచార దళాలు తమ రెండింజన్ల డ్రైవర్లు సాధించిందేమిటో, పదేళ్లలో పరిస్థితి ఎందుకు దిగజారిందో ఎక్కడా మాట్లాడటం లేదు. గోడీ మీడియా సంగతి సరేసరి. తేలు కుట్టిన దొంగల్లా నోరెత్తటం లేదు. ఈ అంశాన్ని పట్టించుకోవాల్సింది కాదన్నట్లుగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో బిజెపి సంపూర్ణ మెజారిటీని కోల్పోవటానికి మహిళా ఉపాధి తగ్గటం కూడా ఒక కారణమే. ★

మళ్లీ ప్రపంచబ్యాంకుకు

- అమరావతికోసం భారీ రుణ ప్రతిపాదన

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాజధాని అమరావతి నిర్మాణం కోసం అవసరమైన మొత్తాన్ని ప్రపంచబ్యాంకు నుండి రుణంగా పొందాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. రానున ఐదేళ్లలో కాలంలోనే సాధ్యమైనంతగా నిర్మాణాలు పూర్తిచేయాలని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ మేరకు ప్రపంచబ్యాంకు నుండి రుణం తీసుకోవడమే మార్గమని నిర్ణయించినట్లు సమాచారం. ఆర్థికశాఖ అధికారులకు కూడా సంకేతాలు అందడంతో ఈ మేరకు వారు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. ప్రపంచబ్యాంకు నుండి కనీసం 10 వేలకోట్ల రూపాయల మేరకు రుణం తీసుకునేలా ప్రతిపాదనలు రూపొందుతున్నట్లు సమాచారం. కేంద్రం నుంచి మహా అయితే ఏడాదికి 1000 నుంచి 1500 కోట్లు మాత్రమే వచ్చే అవకాశాలున్నాయని అధికారులు అంటున్నారు. ఈ నేపథ్యంలో రుణ ప్రతిపాదనలకు కేంద్రం నుండి కూడా పెద్దగా అభ్యంతరాలు ఉండవని వారు చెబుతున్నారు.

బరువెక్కిన పాఠశాల బ్యాగ్

- పెరుగుతున్న బడి పుస్తకాల బరువు
- అధికంగా కొనుగోలు చేయిస్తున్న వైనం
- ఎదుగుదల, ఆరోగ్యంపై ప్రభావం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒత్తిడితో కూడిన విద్యా బోధనతో విద్యార్థులు నానా అవస్థలూ పడుతున్నారు. మరోవైపు బండెడు పుస్తకాలతో కుస్తీ పడుతూ అనారోగ్యాలకు గురవుతున్నారు. కేజీల కేజీల బరువైన పుస్తకాలను మోస్తూ పాఠశాల విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చదువు కొనేందుకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బడి పుస్తకాలను మోయడం వల్ల వేలాది మంది పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్యులు గగ్గోలు పెడుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాల భారం ఎక్కువగా ఉంటుంది.



ప్రైవేటు ఇష్టారాజ్యం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1800 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3 లక్షల 30 వేల మంది ఏటా చదువుతున్నారు. సర్కారు బళ్లను మినహాయిస్తే ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల స్కూలు బ్యాగుల బరువు అధికంగా ఉంటోంది. టెక్నాలజీ రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్నా విద్యా విధానంలో మార్పులు కానరావడం లేదు. చదువుల భారంతో పుస్తకాల బరువుతో విద్యార్థులు సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్ని ఎక్కువ పుస్తకాలు ఉంటే అంత బాగా చదువుతారనే పరిస్థితిలోకి ఆయా విద్యాసంస్థల ప్రచారం నిర్వహిస్తున్నాయి. తమ వ్యాపార స్వలాభం కోసం అవసరానికి మించి పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు భారీగా పుస్తకాలను కొనుగోలు చేస్తున్నాయి. వాటి ధరలను విపరీతంగా పెంచి విక్రయాలు జరుపుతున్నాయి అయినా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

నిబంధనల ప్రకారం

సాధారణంగా 8 నుంచి 10 తరగతి చదివే ఆరోగ్యకరమైన చిన్నారి బరువు 25 నుండి 35 కేజీలు ఉంటుంది. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు 10 నుంచి 15 కేజీల బరువున్న పుస్తకాల బ్యాగులను మోసుకుంటూ వెళుతున్నారు. నిబంధనల ప్రకారం 1 తరగతి విద్యార్థి 750 గ్రాములు, 2వ తరగతి 2 కేజీలు, 3, 4 తరగతుల పిల్లలు 3 కేజీలు, 5వ తరగతి 4 కేజీలు, 6 తరగతి 6 కేజీలు, 7వ తరగతి 8 కేజీలు, 8వ తరగతి 10 కేజీలు, 9, 10 తరగతుల పిల్లలు 12 కేజీలు మాత్రమే బరువు మోయల్సి ఉంది. ఈ నిబంధనలకు భిన్నంగా రెట్టింపు బరువు మోస్తున్నారు.

అనారోగ్య సమస్యలు

ఆయా స్కూల్ బ్యాగులను మోస్తున్న విద్యార్థులు చిన్న వయసులోనే నడుము, మోకాళ్ల నొప్పులు, ఇతరత్రా అర్థో సమస్యలతో బాధ పడుతున్నట్లు తల్లిదండ్రులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్కూలు బ్యాగుల బరువును తగ్గించాలని భావించిన ప్రభుత్వం గతంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ వీటిని అమలుచేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

పట్టని ప్రైవేట్ విద్యాసంస్థలు

బరువులు పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని యూనిసెఫ్‌తో బాటు వివిధ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలోనే పుస్తకాల బరువు అధికంగా ఉంటుంది. క్లాస్, ఫెయిర్ వర్క్ కోసం ప్రత్యేకంగా వేరువేరు నోట్ బుక్కులు ప్రతిరోజూ తెప్పిస్తున్నారు. ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేని పుస్తకాలు, నోట్‌బుక్కులను భద్ర పర్చుకునేందుకు తరగతి గదుల్లో అల్మారాలు, ర్యాక్‌లను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. కానీ ఏ ఒక్క పాఠశాలలోనూ ఈ ఏర్పాట్లు లేవు. కొన్ని పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లో ఉండటంతో మోత బరువుతో మెట్లు ఎక్కుతున్న విద్యార్థులు వెన్ను, మోకాళ్ల నొప్పులతో సతమతం అవుతున్నారు. శక్తికి మించి బరువు మోయడంతో వారి ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతోంది.

అభివృద్ధిలో తెలుగు రాష్ట్రాలు ప్రపంచంతో పోటీ

- శంషాబాద్‌లో హెల్త్ హబ్
- బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వార్షికోత్సవంలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

అభివృద్ధి, సంక్షేమంలో తెలుగు రాష్ట్రాలు ప్రపంచంతో పోటీ పడి ఆదర్శంగా నిలవాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ 24వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సిఎం చంద్రబాబు రోజుకు 18 గంటలు పని చేస్తారని, తాను 12 గంటలు పని చేస్తే సరిపోదని పేర్కొన్నారు. అందుకే ఇక మీదట తానూ 18 గంటలు పని చేస్తానని, రాష్ట్ర నేతలు, అధికారులు కూడా 18 గంటలు పని చేయాల్సిందేనని అన్నారు. నైపుణ్యమున్న ఆటగాడితో పోటీ పడితేనే మనలో టాలెంట్‌కు గుర్తింపు వస్తుందని వ్యాఖ్యానించారు. కేన్సర్ బాధితులకు సేవలందించాలన్న ఉమ్మడి



వేడుకల్లో మాట్లాడుతున్న తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి

ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు ఆలోచనలకు చంద్రబాబు సహకారం తోడవడంతో కోట్లాది మందికి వైద్య సేవలందాయన్నారు. బసవతారకం ఆస్పత్రి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని ప్రశంసించారు. నిస్వార్థంగా, లాభాపేక్ష లేకుండా వైద్య సేవలందిస్తున్న బసవతారకం ఆస్పత్రి దేశంలోని అనేక మంది నిరుపేదలకు సేవలందించదని కొనియాడారు. ఆస్పత్రి లీజ్‌తోపాటు ఇతర సమస్యలను తన దృష్టికి తీసుకురాగానే పరిష్కరించినట్లు తెలిపారు. ప్రపంచంలోని ఎలాంటి రోగానికైనా హైదరాబాద్‌లో చికిత్స అందేలా హెల్త్ టూరిజం హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్టు ప్రకటించారు. ఇందుకోసం శంషాబాద్ చుట్టూ 500 నుంచి వెయ్యి ఎకరాల స్థలాన్ని కేటాయించాలని భావిస్తున్నట్టు తెలిపారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఆరోగ్య సంస్థలను ఈ హబ్‌కు ఆహ్వానిస్తామన్నారు. బసవతారకం ఆస్పత్రికి కూడా స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఎన్‌టిఆర్ ఆలోచనలను చంద్రబాబు, బాలకృష్ణ కొనసాగించారని, ఇప్పుడు మూడో తరం లోకేష్, శ్రీభరత్ కూడా ఆ ఆలోచనలను ముందుకు తీసుకెళ్లాలని రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. బసవతారకం ఆస్పత్రి ఛైర్మన్ నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ ఆస్పత్రి సేవలను మరింత ఎక్కువ మందికి అందించేందుకు విస్తరించనున్నట్టు తెలిపారు. తమపై నమ్మకంతో ప్రభుత్వాలు సహకారం అందిస్తున్నాయని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని అన్నారు. ఆస్పత్రి ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ నామా నాగేశ్వరరావు, సభ్యులు నోరి దత్తాత్రేయుడు, ఎం.శ్రీభరత్, వైద్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రభుత్వానికి చట్టమంటే లెక్కలేదు

- జిఓ 340 ప్రకారమే వైసిపి కార్యాలయం నిర్మాణం
- కూల్చివేతపై హైకోర్టులో తేల్చుకుంటాం
- సీనియర్ అడ్వకేట్ పొన్నవోలు సుధాకర్

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లోని టిడిపి ప్రభుత్వం చట్టాలను లెక్క చేయకుండా పనిచేస్తోందని సీనియర్ అడ్వకేట్, మాజీ అడిషనల్ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్ విమర్శించారు. హైకోర్టు ఆదేశాలను ఖాతరు చేయకుండా తాడేపల్లిలోని వెసిపి కార్యాలయాన్ని ప్రభుత్వం కూల్చి వేసిందని మండిపడ్డారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల కార్యాలయాల నిర్మాణానికి చంద్రబాబు ప్రభుత్వమే గతంలో 340 జిఒ తీసుకొచ్చిందని, దాని ప్రకారమే తాడేపల్లిలో వైసిపి కేంద్ర కార్యాలయాన్ని నిర్మిస్తున్నారని చెప్పారు. పాలకులు మారవచ్చు కానీ, చట్టం మారదని అన్నారు. జిఒ 340 ప్రకారమే ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాల నిర్మాణానికి టిడిపి భూములు తీసుకుందని తెలిపారు. ఎకరాకు వెయ్యి రూపాయిలకే టిడిపి భూములు పొందిందని, వైసిపికి కూడా అదే విధంగా రెండు ఎకరాలు భూమిని చట్టబద్ధం తీసుకుందని చెప్పారు. టిడిపి అధికారం చేపట్టిన వెంటనే వైసిపి కార్యాలయాన్ని టార్గెట్ చేసుకుందని విమర్శించారు.

అనుమతులు లేకుండా నిర్మాణం చేపట్టిన వైసిపి కార్యాలయాన్ని తొలగించాలని ప్రొవిజనల్ నోటీస్ ఇచ్చారని, దీనిపై హైకోర్టులో వైసిపి లంచ్ మోషన్ పిటిషన్ వేసిందన్నారు. డ్యూ ప్రాసెస్ ఫాలో అవుతామని కోర్టుకు తెలిపిన ప్రభుత్వం చట్టాన్ని ఉల్లంఘించిందని విమర్శించారు. 115 సిఆర్‌డిఎ యాక్ట్ కింద ప్రభుత్వానికి వివరణ కూడా ఇచ్చామన్నారు. హైకోర్టులో పిటిషన్ స్టేటస్‌ను సిఆర్‌డిఎ కమిషనర్ కాటంనేని భాస్కర్‌కు మెయిల్, వాట్సప్ ద్వారా తెలిపామని చెప్పారు. అయినా, రాష్ట్ర ప్రభుత్వం చట్ట వ్యతిరేక చర్యలు పాల్పడిందని, దీనిపై కోర్టులోనే తేల్చుకుంటామని పొన్నవోలు సుధాకర్ తెలిపారు.

తిరుమలకు హోం మంత్రి అనిత


ప్రజాశక్తి -తిరుపతి సిటీ

శ్రీవారి దర్శనార్థం రాష్ట్ర హోంమంత్రి అనిత శనివారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. గన్నవరం విమా నాశ్రయం నుంచి రేణిగుంటకు సాయంత్రం 5 గంటలకు చేరుకున్న ఆమెకు అధికారులు, ఎన్డీఎ కూటమి నాయకులు స్వాగతం పలికారు. అక్కడనుంచి రోడ్డు మార్గాన సాయంత్రం 6.30 గంటలకు తిరుమలకు చేరుకున్నారు. రాత్రికి తిరుమలలోని గాయత్రి నిలయంలో బస చేసి, ఆదివారం వేకువజామున శ్రీవారిని దర్శించుకోనున్నారు.

వెస్టిండీస్ ఘన విజయం

- అమెరికాపై 9వికెట్ల తేడాతో గెలుపు
- సెమీస్ ఆశలు సజీవం

బ్రిడ్జ్‌టౌన్: టి20 ప్రపంచకప్‌లో ఆతిథ్య వెస్టిండీస్ జట్టు అమెరికాను చిత్తుచేసి సెమీస్ ఆశలు సజీవం చేసుకుంది. గ్రూప్-2లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో.. వెస్టిండీస్ 9వికెట్ల తేడాతో అమెరికాపై విజయాన్ని నమోదు చేసింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన అమెరికా 19.5ఓవర్లలో 128 పరుగులకే ఆలౌటైంది. అమెరికా బ్యాటర్లలో గౌస్ అత్యధికంగా 29 రన్స్ చేశాడు. ఆ లక్ష్యాన్ని వెస్టిండీస్ ఒక వికెట్ చేజార్చుకొని 10.5ఓవర్లలోనే ఛేదిచింది. ఓపెనర్ షాయ్ హోప్(82నాటౌట్; 39బంతుల్లో 2ఫోర్లు, 8సిక్సర్లు) పవర్ హిట్టింగ్‌కి తోడు మరో ఓపెనర్ ఛార్లెస్(15) బ్యాటింగ్‌లో రాణించారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 6.5ఓవర్లలో 67పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆ తర్వాత ఛార్లెస్ ఔటైనా.. పూరన్(27నాటౌట్; 12బంతుల్లో ఫోర్, 3సిక్సర్లు) మ్యాచ్‌ను ముగించారు. అమెరికాపై ఘన విజయం సాధించిన వెస్టిండీస్ సెమీస్‌లో చోటు దక్కించుకునే అవకాశాన్ని పదిలం చేసుకుంది. చాలా వేగంగా స్కోర్ చేయడం వల్ల విండీస్ నెట్ రన్ రేట్ సౌతాఫ్రికా కన్నా మెరుగ్గా ఉన్నది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును రోస్టన్ ఛేజ్ దక్కించుకున్నాడు. ఛేజ్ నాలుగు ఓవర్లు బౌలింగ్ చేసి 19 పరుగులిచ్చి మూడు వికెట్లు తీసాడు. విండీస్ బౌలర్లలో రస్సెల్‌కు మూడు, జోసెఫ్ రెండు వికెట్లు పడగొట్టారు.



స్కోర్‌బోర్డు..

అమెరికా ఇన్నింగ్స్: టేలర్ (సి)ఛేస్ (బి)రస్సెల్ 2, గౌస్ (సి)హోప్ (బి)జోసెఫ్ 29, కుమార్ (ఎల్‌బి)మోటీ 20, జోన్స్ (బి)ఛేస్ 11, ఆండర్సన్ (ఎల్‌బి)ఛేస్ 7, మిలింద్ కుమార్ (రనౌట్)మోంటీ/రస్సెల్ 19, హర్మీత్ సింగ్ (సి)ఛార్లెస్ (బి)ఛేస్ 0, షాల్క్‌యిక్ (సి)ఛార్లెస్ (బి)రస్సెల్ 18, కింగ్నే (సి)పూరన్ (బి)జోసెఫ్ 1, అలీ ఖాన్ (నాటౌట్) 14, నేత్రావాల్కర్ (సి)రువాన్ పావెల్ (బి)రస్సెల్ 0, అదనం 7. (19.5ఓవర్లలో ఆలౌట్) 128పరుగులు. **వికెట్ల పతనం:** 1/3, 2/51, 3/60, 4/65, 5/88, 6/88, 7/112, 8/112, 9/125, 10/128 **బౌలింగ్:** హొసైన్ 3-0-13-0, రస్సెల్ 3.5-0-31-3, మెక్‌కొయ్ 2-0-20-0, జోసెఫ్ 4-0-31-2, మోంటీ 3-0-14-1, ఛేస్ 4-0-19-3.

వెస్టిండీస్ ఇన్నింగ్స్: హోప్ (నాటౌట్) 82, ఛార్లెస్ (సి)మిలింద్ కుల్కర్ 15, పూరన్ (నాటౌట్) 27, అదనం 6. (10.5ఓవర్లలో వికెట్ నష్టానికి) 130పరుగులు. **వికెట్ల పతనం:** 1/67 **బౌలింగ్:** నేత్రావాల్కర్ 2.5-0-31-0, కుంగ్జియ్ 1-0-11-0, అలీ ఖాన్ 2-0-18-0, హర్మీత్ సింగ్ 2-0-18-1, షడ్లే 2-0-29-0, మిలింద్ కుమార్ 1-0-22-0

అన్యాయాన్ని ప్రశ్నించే స్వరంగా విశాలాంధ్ర

- 72వ వార్షికోత్సవ సభలో వక్తలు



సభలో మాట్లాడుతున్న సిపిఐ తెలంగాణా రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్ని రంగాల్లో ప్రపంచాన్ని అధ్యయనం చేయించేది పత్రికలేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. విశాలాంధ్ర దినపత్రిక 72వ వార్షికోత్సవం విజయవాడ చంద్రం బిల్డింగ్స్‌లో శనివారం సాయంత్రం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ ఎప్పుడు ప్రజాస్వామ్యానికి అన్యాయం జరిగినా ప్రశ్నించేందుకు పుట్టిందే విశాలాంధ్రని తెలిపారు. దళితులు, మహిళలు, కార్మికులకు అండగా పత్రిక నిలుస్తుందని పేర్కొన్నారు. కొత్త పంథాలో పత్రికను నడిపించేందుకు కృషి చేయాలని కోరారు. విశాలాంధ్ర ఎడిటోరియల్ బోర్డు ఛైర్మన్, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎందరో మహనీయులు వేసిన పునాదుల వల్ల ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా విశాలాంధ్ర నిలబడిందని తెలిపారు. పత్రికను అణచివేయాలని చూసిన జగన్ లాంటి నియంతను వెనక్కు కొట్టిందని పేర్కొన్నారు. కార్పొరేట్లకు ఊడిగం చేస్తే మతోన్మాదాన్ని రెచ్చగొట్టి తమ అధికారాన్ని సుస్థిరం చేసుకునే ప్రయత్నాల్లో ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో లౌకిక, వామపక్ష ప్రజాతంత్ర శక్తులను కూడగట్టి ముందుకు వెళ్లాల్సిన బాధ్యత వామపక్షాలపై ఉందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన విశాలాంధ్ర విజ్ఞాన సమితి ఛైర్మన్ ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్ర సమగ్రాభివృద్ధి సాంస్కృతిక పునరుజ్జీవనం కోసం విశాలాంధ్ర కృషి చేసిందని అన్నారు. విజ్ఞాన సమితి కార్యదర్శి మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ ముందు తరాలు కూడా విశాలాంధ్రను విజయవంతంగా నడిపిస్తాయని తనకు నమ్మకం ఉందని పేర్కొన్నారు. సమితి కోశాధికారి ఓబులేసు, సంపాదకులు ఆర్‌వి రామారావు, జనరల్ మేనేజర్ పి.హరినాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిపి నేతగా లావు శ్రీకృష్ణ దేవరాయలు

- రాష్ట్రప్రయోజనాలే లక్ష్యంగా కృషి : బాబు దిశా నిర్దేశం



పార్లమెంటరీ సమావేశంలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ పార్టీ నేతగా నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయలు ఎన్నికయ్యారు. టిడిపి కార్యాలయంలో శనివారం ఆ పార్టీ పార్లమెంటరీ పార్టీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రసంగించిన టిడిపి అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ మేరకు ప్రకటించారు. డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా చిత్తూరు, నంద్యాల ఎంపిలు దగ్గుమల్ల ప్రసాద్‌రావు, బైరెడ్డి శబరి, కోశాధికారిగా వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, విప్‌గా గంటి హరీష్‌లను నియమిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రప్రయోజనాలే ప్రథమ కర్తవ్యంగా, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని టిడిపి ఎంపిలకు ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవిభజన చట్టంలోని హామీల అమలుకు కృషి చేయాలని చెప్పారు . దేశంలోనే టాప్-10 విశ్వవిద్యాలయాలు, ఆస్పత్రులు, పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకొచ్చేలా కృషి చేయాలని అన్నారు. ప్రతి ఎంపి కేంద్రంలో ఒక శాఖకు అనుసంధానం కావాలని, అదే శాఖతో రాష్ట్రంలో కూడా సమన్వయం చేసుకోవాలని అన్నారు. ప్రజా రాజధాని అమరావతి, ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలని చెప్పారు. ఈ సమావేశంలో కేంద్రమంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్రమంత్రి నారా లోకేష్, ఎంపిలు కలిశెట్టి అప్పలనాయుడు, ఎం భరత్, పుట్టా మహేష్ యాదవ్, కేశినేని చిన్ని, మాగుంట శ్రీనివాసులు రెడ్డి, కృష్ణప్రసాద్, బి నాగరాజు,బికె పార్థసారథి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, పొలిట్ బ్యూరోసభ్యులు టిడి జనార్ధన్, గురజాల మాల్యాద్రి, మాజీ ఎంపిలు రవీంద్రకుమార్, కె రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా రైల్వే ప్రాజెక్టులు పడకేశాయి

- కేంద్ర మంత్రి పెమ్మసాని



అధికారులతో సమీక్ష చేస్తున్న మంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్రంలో గత ఐదేళ్లుగా రైల్వే ప్రాజెక్టుల పురోగతి మందగించిందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విమర్శించారు. వైసిపి ప్రభుత్వం తన వాటాగా రైల్వే శాఖకు చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకపోవడంతో పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయన్నారు. పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులపై గుంటూరులోని ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం ఆయన సమీక్షించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ కేవలం లాభాపేక్ష కలిగిన అంశాలపై గత సిఎం జగన్ ప్రాధాన్యత ఇచ్చారే కానీ ప్రజలకు ఎంతో అవసరమైన వంతెనలు, నూతన రైల్వే లైన్ల నిర్మాణాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. గుంటూరు పార్లమెంట్ పరిధిలో మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు వద్ద, పెదపలకలూరు వద్ద, మంగళగిరిలో, గుంటూరు నగరంలో శంకర్ విలాస్ సెంటరు, సీతానగర్, నెహ్రూనగర్, సంజీవయ్యనగర్ రైల్వే గేటువద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జ్, శ్యామలనగర్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జ్ నిర్మాణాల అనుమతుల వివరాలు, నంది వెలుగు రోడ్డులోని రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనుల వివరాలను అధికారులు కేంద్ర మంత్రికి వివరించారు.

పనుల వారీగా అనుమతుల మంజూరుకు రైల్వే శాఖ, ఆర్ అండ్ బి, స్థానిక సంస్థలు చేపట్టాల్సిన చర్యలపై కేంద్ర మంత్రి సమీక్షించి అధికారులకు సూచనలు చేశారు. వందే భారత్ రైలును తెనాలిలో నిలిపి ప్రయాణికులకు సౌకర్యం కల్పించేందుకు ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపేందుకు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కోరారు. గుంటూరు నుండి బెంగుళూరుకు పగటి పూట రైల్వే సౌలభ్యం కల్పించే అంశంపై చర్చించారు. మంగళగిరి తెనాలికి రెండు లైన్ల రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు మంత్రి సూచించారు. జిల్లాలో పదిహేను వరకు రైల్వే బ్రిడ్జ్‌లు రూ.1000 నుంచి 2000 కోట్ల పనులకు ప్రతిపాదనలకు త్వరలో కేంద్రం ఆమోదం కోసం ప్రయత్నిస్తామని తెలిపారు. రైల్వే డిఆర్ఎం రామకృష్ణ, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, జాయింట్ కలెక్టర్ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్ష రద్దు సాధ్యం కాదు

నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలపై మంత్రి పెమ్మసాని స్పందించారు. ఒక విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ కేంద్రం అన్ని చర్యలూ తీసుకుంటుందని, ఎక్కడ తప్పు జరిగిందో నిర్ధారించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ దశలో పరీక్ష రద్దు చేస్తే లక్షల మంది నష్టపోతారన్నారు. తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటే సరిపోతుందని పేర్కొన్నారు.

సహకారం మరింత బలోపేతం !

- హసీనా, మోడీ చర్చలు

న్యూఢిల్లీ : భారత్‌లో పర్యటిస్తున్న బంగ్లాదేశ్ ప్రధాని షేక్ హసీనాతో ప్రధాని నరేంద్ర మోడీ శనివారం చర్చలు జరిపారు. వాణిజ్యం, అనుసంధానంతో సహ పలు రంగాల్లో సహకారాన్ని పెంపొందించుకోవడంపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు. మూడోసారి మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విదేశీ నేత భారత్‌లో జరిపిన అధికారిక పర్యటన ఇదే. రెండు రోజుల పర్యటన నిమిత్తం హసీనా శుక్రవారం ఢిల్లీ వచ్చారు. గత ఐదేళ్ళ కాలంలో ఇరువురు నేతలు పదిసార్లు సమావేశాలు జరిపారని, వీటివల్ల ద్వైపాక్షిక సంబంధాల్లో అనూహ్యమైన మార్పులు వచ్చాయని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు.

శనివారం ఉదయమే రాజ్‌ఘాట్‌ను సందర్శించిన హసీనా మహాత్మునికి ఘనంగా నివాళి అర్పించారు. చర్చలకు ముందు హసీనాకు రాష్ట్రపతి భవన్ వద్ద సాదర స్వాగతం లభించింది. వాణిజ్యం, అనుసంధానం, ఇంధన రంగాల్లో ద్వైపాక్షిక సంబంధాలకు కొత్త ఊపునిచ్చేందుకు ఈ చర్చలు దోహదపడతాయని అధికారులు తెలిపారు. పొరుగుదేశాలకు ప్రాధాన్యతా విధానం కింద భారత్‌కు బంగ్లాదేశ్ కీలకమైన భాగస్వామి. భద్రత, వాణిజ్యం ఇంధనం, సైన్స్ అండ్ టెక్నాలజీ, రక్షణ, సముద్ర జల వ్యవహారాలు తదితర రంగాల్లో సహకారం ఇప్పటికే వుంది. దక్షిణాసియాలో భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా బంగ్లాదేశ్ వుంది. ఆసియాలో బంగ్లాదేశ్‌కు భారత్ రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామిగా వుంది.

ముగ్గురు ఎమ్మెల్యేల ప్రమాణం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

శాసనసభ్యులుగా శుక్రవారం ప్రమాణం చేయలేకపోయిన ముగ్గురు ఎమ్మెల్యేలతో స్పీకర్ ఎన్నికకు ముందే ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరి శనివారం నాడు ప్రమాణం చేయించారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, వినుకొండ ఎమ్మెల్యే జివి ఆంజనేయులు, కాకినాడ సిటి ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు ప్రమాణం చేశారు. అనంతరం చంద్రబాబు వద్దకెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు.

సచివాలయ ఉద్యోగులను సింగిల్ అడ్మినిస్ట్రేటివ్ పరిధిలోకి తీసుకురావాలి

- గ్రామ వార్డు సచివాలయ శాఖ మంత్రికి వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులను సింగిల్ అడ్మినిస్ట్రేటివ్ కంట్రోల్ (ఒకే అధికారి నియంత్రణ)లో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని గ్రామ వార్డు సచివాలయ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎండి జానిపాషా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం గ్రామ వార్డు సచివాలయాల శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామిని కలిసి వినతిపత్రం అందజేశారు. సచివాలయ ఉద్యోగుల సమస్యలపై ఓ కమిటీని వేసి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీనిచ్చినట్లు పేర్కొన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఫెడరేషన్ నాయకులు బి.పుల్లారావు, ఎం.శశిధర్, ఎస్‌కె రహీం, పి.మనోహర్ ఉన్నారు.

పెరిగిపోతున్న ప్రపంచ శరణార్థులు

- అమెరికా ఆధిపత్యవాదమే అసలు కారణం

న్యూయార్క్: జూన్ 20 వ తేదీ ప్రపంచ శరణార్థి దినోత్సవం. అమెరికన్ సామ్రాజ్యవాద యుద్ధాలు, హింసాత్మక ఘర్షణల వల్ల 11 కోట్ల 70 లక్షల మందికి పైగా ప్రజలు బలవంతంగా ఇళ్ల నుండి పారిపోయేలా చేశారనేది కాదనలేని వాస్తవం. ప్రపంచ వ్యాపితంగా ఇప్పటికే ఉన్న హింసాత్మక ఘర్షణలను ఎగదోస్తుండడంతోబాటు కొత్త వాటిని అది సృష్టిస్తోంది. యుద్ధ మేఘాలు అంతటా వ్యాపించాయి. అనేకమంది మరణానికి, శరణార్థు లుగా మారడానికి కారణమైన ఈ సాయుధ ఘర్షణ లు ఏడాదికేడాది పెరిగిపోతున్నాయి. హింసాత్మక ఘర్షణల ప్రాంతాలు, ఘటనల డేటా, సంఘర్షణల సూచీ (ఎసిఎల్ఇడి) ప్రకారం ప్రతి ఆరుగురిలో ఒక రు ఈ ఘర్షణల బారిన పడినవారే. గత అయిదేళ్లలో శరణార్థుల సంఖ్య 22 శాతం పెరిగినట్లు ఆ నివేదిక తెలిపింది. ఈ హింసాత్మక ఘర్షనలు ఎందుకు పెరుగుతునాక్నయి? దీనికి కారకులెవరు? అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయ. ఈ ఘర్షణల వ్యాప్తిని అర్థం చేసుకోవాలంటే ప్రతి సంఘర్షణ వెనక కారణాలపై దృష్టి పెట్టడం కన్నా, ప్రపంచ కారకులెవరన్నదానిపై ప్రత్యేకించి దృష్టి పెట్టాలని, అప్పుడే మనకు సమగ్ర చిత్రం కనిపిస్తుందని ఎసిఎల్ఇడి పేర్కొంది. అభివృద్ధి చెందుతున్న ఆయుధ మార్కెట్, విఫలమైన ప్రపంచ పాలనా వ్యవస్థతో కూడిన అసమానతలతో కూడిన ప్రపంచ మే వీటన్నిటికీ మూలం అని మనకు అర్థమవు తుందని తెలిపింది. 1970ల నుండి తన ప్రయోజ నాల కనుగుణంగా రూపొందించిన ఏకపక్ష చర్యలు, వ్యూహాలతో కూడుకున్న ప్రపంచాధిపత్య వ్యూహమే అమెరికా విదేశాంగ విధానంగా చెలామణిలో ఉంది.

1990లో సోవియట్ యూనియన్ కూలిపోయి తరువాత అమెరికా నూతన ఏకధ్రువ ప్రపంచం స్థాపించి, దానిని కాపాడుకోవడం కోసం వ్యూహం రచించింది. అప్పటి నుంచి హింసాత్మక ఘర్షణలు బాగా పెరిగిపోయాయి. ఈ క్రమంలోనే ఇరాక్ (1990), యుగొస్లావియా (1995), ఆఫ్ఘనిస్తాన్ (2001), ఇరాక్ (2003), లిబియా (2011), సిరియా(2014), ఉక్రెయిన్ (2022) , పాలస్తీనా (2023)పై అమెరికా దాడులకు తెగబడింది.

ఆయుధ ఉత్పత్తిదారులు, యుద్ధ నిర్మాతలు

అమెరికా సామ్రాజ్యవాదం దశాబ్దాలుగా నిర్మించి కొనసాగిస్తున్న అసాధారణ సైనిక ఆధిప త్యంపై ఎక్కువగా ఆధారపడతుతోంది. అమెరికా భారీ సైనిక యంత్రాంగాన్ని నిర్వహించడం కోసం ఈ సంవత్సరం 1.537 ట్రిలియన్ డాలర్లను వెచ్చిం చింది. ఇతర మిత్ర దేశాలతో కలుపుకుంటే ఈ మిలిటరీ వ్యయం 2.13 ట్రిలియన్ డాలర్లు దాటింది. ఇది ప్రపంచ రక్షణ వ్యయంలో 74.3 శాతం అన్న మాట. ప్రపంచంలో అయిదు అగ్రశ్రేణి ఆయుధ కంపెనీలైన లాక్‌హీడ్ మార్టిన్‌కార్ప్, రేథియాన్ టెక్నాలజీస్, నార్త్‌రోప్ గుమ్మన్ కార్ప్, బోయింగ్ అండ్ జనరల్ డైనమిక్స్ కార్ప్స్ అన్నీ అమెరికాకు చెందినవే .

అమెరికా తన ధితప్య యుద్ధాలను 1945 నుంచే ప్రారంభించింది. వియత్నాం, సోమాలియా, లావోస్, కువైట్, గ్రెనెడా, యెమెన్, డజన్ల కొద్దీ ఇతర దేశాల్లో పెద్దయెత్తున బాంబులు కురిపించి భారీ విధ్వంసాన్ని సృష్టించింది. ఐరాస శరణార్థి సంస్థ (యుఎన్‌హెచ్‌సిఆర్) నివేదిక ప్రకారం 2022లో 2 కోట్ల 72 లక్షల మంది ఇళ్ల నుంచి బలవంతంగా పారిపోయేలా చేశారు. అంతకుముందు సంవత్సరంతో పోల్చితే ఇది 8 శాతం ఎక్కువ. సూడాన్, పాలస్తీనా, మయన్మార్ నుంచి ఈ శరణార్థులు ఎక్కువగా ఇతర ప్రాంతాలకు వెళ్తున్నట్టు ఆ నివేదిక తెలిపింది. శరణార్థి సమస్య పరిష్కారం కావాలంటే దీనికి మూలమైన అమెరికా సామ్రాజ్యవాదన్ని , అపారమైన దాని సైనిక యంత్రాంగాన్ని అందరూ సమిష్టిగా ఎదుర్కోవాలని అంతర్జాతీయ శాంతి సంస్థలు, కార్యకర్తలు విజ్ఞప్తి చేస్తున్నాయి. .

ఒత్తిడికి గురవుతున్నామంటున్న ఆరుగురు టాపర్స్

న్యూఢిల్లీ : ఈ ఏడాది మే 5న నిర్వహించిన నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ అవ్వడం, 1563 మందికిపైగా విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడంపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రేస్ మార్కులు కలిపిన 1,563 మంది విద్యార్థులకు ఆదివారం పున:పరీక్ష నిర్వహించేందుకు శుక్రవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) అడ్మిట్ కార్డులు జారీ చేసింది. హర్యానాలోని బహదూర్‌ఘర్‌లోని ఒకే పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసిన ఆరుగురికి 720కి 720 మార్కులు వచ్చాయి. వీరు ఆదివారం ఝజ్జర్‌లోనే రెండు వేర్వేరు పరీక్షా కేంద్రాల్లో పరీక్ష రాయనున్నారు. గత పరీక్షలో మాదిరిగా వంద శాతం మార్కులు రావాలనే విధంగా తమపై ఒత్తిడి ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గత నీట్ పరీక్షలో టాప్ స్కోర్ సాధించిన ఓ విద్యార్థి మాట్లాడుతూ.. 'వందశాతం మార్కులు సాధించాలని రోజుకు 16 గంటలు కష్టపడి చదివాను. అనుకున్నట్టుగానే నా లక్ష్యాన్ని సాధించాను. మార్కుల వివాదం వల్ల మళ్లీ పరీక్ష రాయాల్సివస్తోంది. దీనివల్ల నేనెంతో ఒత్తిడికి గురవుతున్నాను. ఇందులో నా తప్పేమీ లేకపోయినా.. మళ్లీ నేను పరీక్ష రాసి నా సామర్థ్యాన్ని నిరూపించుకోవాల్సి వచ్చింది. ఇది అన్యాయం. మరలా వందశాతం మార్కులు సాధించకపోతే ఏమి చేయాలని నా బంధువులు, ఇరుగుపొరుగువారు అడుగుతున్నారు. దీనికి సమాధానం? ఏంటి?. అయితే నాకిప్పుడు మార్కులు సాధించడంకంటే... మెడికల్ సీటు పొందడమే ముఖ్యం' అని అన్నాడు.

జిఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్ !

- కేంద్ర ప్రభుత్వ యోచన
- కొన్నిటిపై టాక్స్ తగ్గింపు
- 53వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం



కౌన్సిల్ సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతున్న నిర్మలా సీతారామన్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పెట్రోలు, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే విషయం ఆలోచిస్తున్నామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. పన్ను రేటు ఎంత ఉండాలనేది రాష్ట్రాలు సూచిస్తే , దీనిపై ముందుకెళ్తామని ఆమె తెలిపారు. జీఎస్టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్ తీసుకురావడాన్ని చాలా రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న తరుణంలో కేంద్ర ఆర్థిక మంత్రి ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. శనివారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జీఎస్టీ కౌన్సిల్ 53వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గోవా, మేఘాలయ ముఖ్యమంత్రులు, మధ్యప్రదేశ్, బీహార్, హర్యానా ఉప ముఖ్యమంత్రులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఆర్థిక మంత్రులు పయ్యావుల కేశవ్, భట్టి విక్రమార్క, వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ఆర్థిక మంత్రులు, ఆర్థిక కార్యదర్శులు, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కేంద్ర ఆర్థిక మంత్రి విలేకరులతో మాట్లాడారు.

జీఎస్టీ కిందికి ఇంధన వనరులను తీసుకొస్తే తాము మరింతగా నష్టపోతామని, చీటికి మాటికీ కేంద్రంపై ఆధారపడాల్సి వస్తుందనేది రాష్ట్రాల వాదన. ఈ విషయంలో జీఎస్టీ చట్టానికి సవరణ అవసరం లేదని సీతారామన్ అన్నారు. రేట్ల హేతుబద్ధీకరణపై గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఒఎం) ఆగస్టులో నిర్వహించే జిఎస్టి కౌన్సిల్ సమావేశంలో ప్రజెంటేషన్ ఇవ్వనుందని అన్నారు. వడ్డీ లేని కాపెక్స్ రుణాన్ని మరింత పెంచాలని రాష్ట్రాలు కోరాయని, మధ్యంతర బడ్జెట్‌లో దీనిని రూ.1.30 లక్షల కోట్లకు పెంచినట్లు కేంద్ర మంత్రి తెలిపారు.

కొన్నింటిపై పన్ను రేట్లు స్వల్పంగా తగ్గించారు. మరికొన్నింటికి మినహాయింపు ఇచ్చారు. జిఎస్‌టి కౌన్సిల్‌లో ఎజెండాలో చాలా అంశాలు ఉన్నాయని, సమయాభావం కారణంగా కొన్నింటిని చర్చించలేకపోయామని ఆర్థిక మంత్రి చెప్పారు. వచ్చే 54వ జీఎస్టీ సమావేశం ఆగస్టులో జరగనుందని తెలిపారు. అప్పుడు మిగిలిన ఎజెండాపై చర్చిస్తామని అన్నారు. సెక్షన్ 73 కింద కేసులకు వడ్డీ, పెనాల్టీని మాఫీ చేయాలని కౌన్సిల్ సిఫార్సు చేసిందని పేర్కొన్నారు. 2017-18, 2018-19, 2019-20కి సంబంధించి డిమాండ్ నోటీసుల కోసం 2025 మార్చి 31లోపు పన్ను చెల్లిస్తే వడ్డీ, జరిమానా మినహాయించబడుతుందని తెలిపారు.

జీఎస్టీపై ట్రిబునళ్ళు, కోర్టుకు వెళ్లే ట్రాన్సాక్షన్ పరిమితి పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. అలాగే వ్యాపారులు జరిమానా చెల్లించడంలో ఆలస్యమైతే, దానిపైన వడ్డీ కూడా చెల్లించాల్సి ఉందని, దీన్ని ఎత్తేయాలని జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో సభ్యుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయన్నారు. అప్పీలు దాఖలు చేసేందుకు హైకోర్టుకు రూ. 1 కోటి, సుప్రీంకోర్టుకు రూ. 2 కోట్ల పరిమితిని కౌన్సిల్ సిఫార్సు చేసిందని అన్నారు. సిజిఎస్టి ప్రీ-డిపాజిట్‌కు అప్పీలేట్ అథారిటీ ముందు అప్పీల్‌ను దాఖలు చేయడానికి గరిష్ట మొత్తం రూ. 25 కోట్ల నుండి రూ. 20 కోట్లకు తగ్గించునట్లు తెలిపారు. తక్కువ పన్ను చెల్లింపుదారులకు సహాయం చేయడానికి, కౌన్సిల్ 2024-25 కోసం రిటర్న్‌లను దాఖలు చేయడానికి జిఎస్టిఆర్4 కోసం జూన్ 30న సిఫార్సు చేసిందని అన్నారు. ఫేక్ ఇన్‌వాయిస్‌లను దశల వారీగా తనిఖీ చేయడానికి బయోమెట్రిక్ ప్రామాణీకరణ పాన్-ఇండియా అందుబాటులోకి వస్తుందని చెప్పారు.

జిఎస్టీ తగ్గింపు

"ఉక్కు, ఇనుము, అల్యూమినియం వంటి అన్ని మిల్క్ క్యాన్‌లపై జిఎస్టి 18 నుండి 12 శాతానికి తగ్గిస్తూ మండలి సిఫార్సు చేసింది. అయితే వాటిని ఎక్కడ వాడినా ఆ రేటు వర్తిస్తుంది. ఎటువంటి వివాదాలు తలెత్తవు. అన్ని అట్టపెట్టెలు (కార్టన్ బాక్సులు), ముడతలు లేని కాగితం లేదా పేపర్ బోర్డు రెండింటిపై ఏకరీతి జిఎస్టి రేటును 18 నుంచి 12 శాతం తగ్గించినట్లు కౌన్సిల్ సిఫార్సు చేసింది. ఇది ప్రత్యేకంగా హిమాచల్ ప్రదేశ్, జమ్మూకాశ్మీర్ లో యాపిల్ పెంపకందారులకు సహాయం చేస్తుందని కౌన్సిల్ కూడా స్పష్టం చేసింది. ఫైర్ వాటర్ స్ప్రింక్లర్‌లతో సహా అన్ని రకాల స్ప్రింక్లర్‌లపై జిఎస్టీని 18 నుండి 12 శాతానికి తగ్గిస్తూ సిఫార్సు చేసింది" అని పేర్కొన్నారు. అన్ని సోలార్ కుక్కర్లపై 12 శాతం నిర్ణయించినట్లు తెలిపారు.

భారతీయ రైల్వే సామాన్యులకు అందించే సేవలు, ప్లాట్‌ఫారమ్ టిక్కెట్ల విక్రయం, రిటైరింగ్ రూమ్‌లు, వెయిటింగ్ రూమ్‌ల సౌకర్యం, బ్యాటరీతో నడిచే కార్ల సేవలను జీఎస్టీ నుండి మినహాయించినట్లు పేర్కొన్నారు. ఇంట్రా-రైల్వే సరఫరాలకు కూడా మినహాయింపు ఇవ్వబడుతుందని అన్నారు. విద్యా సంస్థల పరిధిలో ఉన్న విద్యార్థుల కోసం హాస్టళ్లకు ఇప్పటికే మినహాయింపు ఉంది. ఇప్పుడు విద్యాసంస్థల్లో లేని విద్యార్థుల కోసం ఉన్న హాస్టళ్లకు కూడా జిఎస్టి నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు.

ఎరువులపై జీఎస్టీ తగ్గించాలనే అభ్యర్థన గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ (జిఒఎం) పంపారు. ప్రస్తుతం ఎరువులపై 5 శాతం జీఎస్టీ ఉంది. దీనినిజీరో జీఎస్టీ స్థాయికి తీసుకురావాలని ఎరువుల పరిశ్రమ డిమాండ్ చేస్తోంది.

గతేడాది అక్టోబర్ 7న చివరిసారిగా జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగిన విషయం తెలిసిందే. ఆ సమావేశంలో క్యాసినో, గుర్రపు పందేలు, ఆన్‌లైన్ గేమింగ్‌కు సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఆ తర్వాత జరగాల్సిన కౌన్సిల్ భేటీని, కొత్త ప్రభుత్వం ఏర్పడే వరకూ వాయిదా వేశారు. కేంద్ర ఆర్థిక మంత్రిగా మరోసారి నిర్మలా సీతారామన్ బాధ్యతలు చేపట్టారు. దీంతో కౌన్సిల్ మీటింగ్‌ను నిర్వహించారు.

కేంద్రం నుంచి ఆర్థిక సాయం కోరాం

- రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో



ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శనివారం నాడిక్కడ ప్రీ బడ్జెట్, జిఎస్‌టి 53వ కౌన్సిల్ సమావేశాల్లో పాల్గొన్న అనంతరం ఏపి భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేశవ్ మాట్లాడారు. రాష్ట్రానికి అందాల్సిన సాయంపై కేంద్రానికి నివేదిక అందజేశామన్నారు. ఆంధ్రప్రదేశ్ విభజన వల్ల వచ్చిన ఆర్థిక సవాళ్ళను అధిగమించడానికి, గత ప్రభుత్వ హయంలో గడిచిన ఐదేళ్లలో ఆర్థిక పరమైన తప్పులను సరిదిద్దడానికి కేంద్రం సహకారం కావాలని కోరామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు త్వరితగతిన పూర్తయ్యేందుకు సహకారం అందించాల్సిందిగా కోరామన్నారు. అలాగే రాజధాని నగరం అమరావతి నిర్మాణానికి, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి ఉదారంగా ఆర్థిక సాయం అందించాల్సిందిగా కోరామన్నారు.

తిరుపతి, వైజాగ్ ఎయిర్ పోర్ట్‌లకు రావాల్సిన రీయంబర్స్ మెంట్ ఇవ్వాలని కోరానని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సహకారం అందించాలని కోరినట్లు తెలిపారు. రైల్వే జోన్ ఆపరేషన్ కు సహకారం ఇవ్వాలన్నారు. గ్రేహౌండ్స్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటుకు సహకారం అందించాలని కూడా కేంద్రానికి విజ్ఞప్తి చేశామని ఆయన తెలిపారు. చేనేత వస్త్రాలపై 5 శాతం పన్ను మినహాయింపు కోరామని అన్నారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అంచనా వేయడానికి సమయం పడుతుందని తెలిపారు.

పరీక్షల నిర్వహణపై సంస్కరణలకు కమిటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రశ్నాపత్రాల లీకేజీల వరుస కుంభకోణాలు, అక్రమాల నేపథ్యంలో మోడీ సర్కార్ తల్లకిందులవుతోంది. ఎన్‌ఎటి ఛైర్మన్‌పై వేటు, కొత్త చట్టం తీసుకురావడం వంటి చర్యలతో నష్ట నివారణ చర్యలకు దిగింది. ఈ క్రమంలోనే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణలో చేపట్టాల్సిన సంస్కరణల కోసం అత్యున్నత స్థాయి కమిటీని నియమిస్తూ ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ ఉన్నత స్థాయి నిపుణుల కమిటీకి ఇస్రో మాజీ ఛైర్మన్ కె రాధాకృష్ణ నేతృత్వం వహించనుండగా, మరో ఆరుగురు సభ్యులుగా ఉంటారని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కమిటీ రెండు నెలల్లో దర్యాప్తు నివేదికను అందజేస్తుందని పేర్కొంది. యుజిసి నెట్ లీకేజీ కారణంగా రద్దు, నీట్ అవకతవకలపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ కమిటీని ఏర్పాటు చేయడం విశేషం. పరీక్షలను సజావుగా, న్యాయబద్ధంగా నిర్వహించడం, యంత్రంగాన్ని మెరుగుపరచడం, డేటా సెక్యూరిటీ ప్రోటోకాల్‌ను మెరుగుపరచడం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పనితీరుపై సిఫారసులు చేయాల్సిందిగా కమిటీని నిర్దేశించినట్లు విద్యాశాఖ పేర్కొంది. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ బిజె రావు, ఐఐటి మద్రాస్ ప్రొఫెసర్ కె రామమూర్తి, ఢిల్లీ ఎయిమ్స్ మాజీ డైరెక్టర్ రణదీప్ గులేరియా, ఐఐటి ఢిల్లీ డీన్ ప్రొఫెసర్ ఆదిత్య మిట్టల్, కేంద్ర విద్యా శాఖ జాయింట్ సెక్రటరీ గోవింద్ జైశ్వాల్, కర్మయోగి భారత్ సహ వ్యవస్థాపకుడు పంకజ్ బన్సల్ ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు.

పేపర్ లీక్‌కు పాల్పడితే పదేళ్ల జైలు.. రూ.కోటి జరిమానా

- అమల్లోకి కఠిన చట్టం
- గెజిట్ నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ : దేశవ్యాప్తంగా నీట్, నెట్ సహా పలు పోటీ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్నాల లీకేజీ వివాదాల నేపథ్యంలో పేపర్ లీక్‌కు పాల్పడినవారిపై చట్టపరంగా కఠిన చర్యలకు కేంద్ర ప్రభుత్వం ఉపక్రమించింది. 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) చట్టం 2024'ను తీసుకొచ్చింది. ఈ చట్టం జూన్ 21 నుంచి అమల్లోకి వచ్చినట్టు శుక్రవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. చట్టవిరుద్ధంగా పరీక్ష పత్రాలను అందుకున్నా, ప్రశ్నలు, సమాధాలు లీక్ చేసినా, పరీక్షకు హాజరయ్యేవారికి అనుచిత సాయం చేసినా, సాంకేతికత సాయంతో కంప్యూటర్ నెట్‌వర్క్‌ను ట్యాంపరింగ్ చేసినా, నకిలీ పరీక్షలు నిర్వహణ, నకిలీ హాల్‌టిక్కెట్లు జారీ చేసినా నేరంగా పరిగణిస్తారు. అందుకు బాధ్యులైవారికి కనీసం మూడేళ్ళ, గరిష్ఠంగా 10 ఏండ్ల వరకు జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా విధించే అవకాశమున్నది. ఇందులో భాగస్వాములైనవారు వ్యవస్థీకృత నేరానికి పాల్పడినట్టు రుజువైతే ఆస్తులను స్వాధీనం చేసుకుంటారు. అంతేకాదు, పరీక్ష నిర్వహణకు అయిన మొత్తాన్ని వారి నుంచి వసూలు చేస్తారు. ఇకపై పేపర్ లీకేజీలపై కొత్త చట్టం కింద నాన్-బెయిల్‌బుల్ కేసులు నమోదు చేయనున్నారు. అధికారుల పాత్ర ఉంటే వారికి మూడేళ్ల జైలు.. రూ.కోటి జరిమానా విధించే అవకాశం ఉంటుంది.

నీట్ పేపర్ లీక్‌లో పాత్రదారి రవి అరెస్ట్



నీట్ పేపర్ లీక్‌లో కీలకంగా వ్యవహరించిన రవి అత్రిని ఉత్తరప్రదేశ్ స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఇతడు సంజీవ్ ముఖియాకు సన్నిహితుడు. నోయిడాకు చెందిన ఇతడు పేపర్ లీక్‌లో మధ్యవర్తిగా వ్యవహరించినట్లు సమాచారం. రవి గతంలోనూ పేపర్ లీకేజీ కేసులో అరెస్టయ్యాడు.

ఏటా పరీక్షల్లో అక్రమాలు

న్యూఢిల్లీ : 2018లో నేషనల్ టెస్టింగ్ అథారిటీ (ఎన్‌టిఎ) ఏర్పడింది, అయితే అది ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు ప్రతి ఏటా పరీక్షల్లో అవకతవకలు , అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. 2019లో జెఇఇ మెయిన్స్‌లో సర్వర్ లోపం కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దీంతో పాటు కొన్ని చోట్ల విద్యార్థులు ప్రశ్నపత్రాలు ఆలస్యం అవుతున్నాయని ఫిర్యాదు చేశారు. నీట్ అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎంట్రన్స్ ఎగ్జామ్ 2020లో ఎన్‌టిఎపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తారు. పరీక్షను చాలాసార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ పరీక్షలో అనేక అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులు వచ్చాయి.

2021 సంవత్సరంలో, జెఇఇ మెయిన్స్ పరీక్షలో కొన్ని తప్పు ప్రశ్నలకు సంబంధించి అలజడి జరిగింది. చాలా చోట్ల అన్యాయంగా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించేందుకు విద్యా మాఫియా ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. 2021లోనే రాజస్థాన్‌లోని భంక్రోటాలో సాల్వర్ గ్యాంగ్ అక్రమాలకు పాల్పడిన ఉదంతం నీట్ పరీక్షలో వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగింది, 2022 సంవత్సరంలో వివిధ కేంద్ర, రాష్ట్ర, ప్రయివేట్ , డీమ్డ్ విశ్వవిద్యాలయాలలో ప్రవేశానికి నిర్వహించిన కామన్ యూనివర్సిటీ ప్రవేశ పరీక్షలో అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులు వచ్చాయి. రాజస్థాన్ నుంచి ఎక్కువ ఫిర్యాదులు వచ్చాయి. దీని తర్వాత ఏజెన్సీ కొన్ని చోట్ల మళ్లీ పరీక్ష నిర్వహించాల్సి వచ్చింది. ఈ ఏడాది నీట్ పరీక్షలోనూ అవకతవకలు జరిగాయని ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఏడాది నీట్ పరీక్షపై దేశవ్యాప్తంగా విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జూన్ 18న జరగాల్సిన యుజిసి-నెట్ పరీక్ష కూడా రద్దయింది. మొత్తంగా ఎన్‌టిఎ స్థాపించిన ఆరేళ్లలో అక్రమాలు చోటుచేసుకుంటూనేవుండటం గమనార్హం.

యానాం రీజెన్సీ కేసులో సిఐ, ఎస్ఐలకు జైలుశిక్ష

(మొదటి పేజీ తరువాయి)

యాజమాన్య ప్రతినిధి కూడా ఒకరు మరణించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో సుమారు మూడువేల మంది పని చేసే పరిశ్రమ మూత పడింది. ఈ నేపథ్యంలో పోలీసుల నిర్బంధం పతాక స్థాయికి చేరింది. గంటల వ్యవధిలో 50 మందిని అరెస్టు చేశారు. ఘటనతో ఏమాత్రం సంబంధం లేని వారిని కూడా కేసుల్లో ఇరికించారు. నాటి యానాం ఎమ్మెల్యే మల్లాడి కృష్ణారావు తన రాజకీయ ప్రత్యర్థులను సైతం ఇందులో ఇరికించారు. హత్యా నేరం అపాదించారు. వివిధ గ్రామాల్లో ఉన్న కార్మికులు వందమంది ఊరొదిలి వెళ్లారు. వందల మంది మండలాలు దాటి జిల్లాలు, రాష్ట్రాలు దాటి తలదాచుకున్నాయి. కుటుంబ సభ్యులకూ వేధింపులు తప్పలేదు. సంబంధం లేని వారిపై కేసులు నమోదు చేశారు. దాదాపు 200 మంది బాధితులు కోర్టుల చుట్టూ తిరిగారు. ఈ ఘటన నేపథ్యంలో కార్మిక సంఘాలు, వివిధ సామాజిక తరగతుల సంఘాలు, రాజకీయ పార్టీలు కలిపి అఖిలపక్షంగా ఏర్పడి చెన్నై హైకోర్టును ఆశ్రయించాయి. రెండు నెలల్లో చెన్నై హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ కేసును పోలీసుల నుంచి స్వాధీనం చేసుకుని సిబిఐ విచారణ చేయాలని హైకోర్టు తీర్పునిచ్చింది. దీంతో సిబిఐ అధికారులు మూడున్నర నెలల పాటు విచారణ జరిపారు. పోలీసులపై కూడా కేసులు పెట్టారు. ప్రస్తుతం శిక్ష పడిన ఇద్దరిపైనా కేసులు నమోదు చేసి, అరెస్టు చేసి విచారణ చేపట్టారు. కొంతకాలం వీరు పాండిచ్చేరి కేంద్రం కారాగారంలో ఉన్నారు. సిఐటియు, సిపిఎం ఈ కేసు విషయంలో క్రియాశీలంగా పని చేశాయి. అక్రమంగా కేసులు ఎదుర్కొంటున్న బాధితులకు న్యాయ సహాయం అందజేశాయి.

శ్రమ దోపిడి చేస్తున్న హిందూజా కుటుంబానికి జైలు శిక్ష !

- స్విస్ కోర్టు తీర్పు



ప్రకాష్ హిందూజా

జెనీవా : తమ ఇళ్ళల్లో పనిచేసే ఇంటి పనివారుల శ్రమను దోపిడీ చేస్తున్నందుకు హిందూజా కుటుంబానికి చెందిన నలుగురికి స్విస్ క్రిమినల్ కోర్టు శుక్రవారం జైలు శిక్ష విధించింది. నాలుగు నుండి నాలుగున్నరేళ్ళ వరకు వీరికి శిక్ష పడింది. అయితే మానవుల అక్రమ రవాణా ఆరోపణల నుండి వారిని కోర్టు విముక్తులను చేసింది. ప్రకాష్ హిందూజా, ఆయన భార్య, కుమారుడు, కోడలు ఈ నలుగురు శ్రమ దోపిడి చేస్తూ, వర్కర్లకు అనధికారికంగా ఉపాధి కల్పిస్తున్నారంటూ వారిని స్విస్ కోర్టు దోషులుగా నిర్ధారించింది. అయతే వారిపై నమోదైన ట్రాఫికింగ్ ఆరోపణలను తోసిపుచ్చింది. వర్కర్ల పాస్‌పోర్టులను స్వాధీనం చేసుకుని, వారికి స్విస్ ఫ్రాంక్స్‌లో చెల్లింపులకు బదులుగా భారత కరెన్సీలో వేతనాలు ఇస్తున్నారని హిందూజాలపై ఆరోపణలు నమోదయ్యాయి. వారిని ఇంటి నుండి బయటకు వెళ్లనివ్వకుండా సుదీర్ఘ గంటలు పనులు చేయిస్తున్నారని పేర్కొంది. ఈ వర్కర్లలో ఎక్కువమంది నిరక్షరాస్యులైన భారతీయులే. వీరికి జెనీవాలోని ఒక సరస్సు పక్కనే గల విలాసవంతమైన విల్లాలో ఉపాధి కల్పించారు. దశాబ్దాల క్రితమే హిందూజాల కుటుంబం స్విట్జర్లాండ్‌కు మకాం మార్చింది. ఈ తీర్పు వెలువడినపుడు ఈ నలుగురు కోర్టు గదిలో లేరు. 2007లో ప్రకాష్ హిందూజాకు ఇలాంటి ఆరోపణలపైనే శిక్ష పడింది. అక్రమ కార్యకలాపాలు, శ్రమ దోపిడీ, మానవుల అక్రమ రవాణా, స్విస్ కార్మిక చట్టాల ఉల్లంఘన వంటి ఆరోపణలతో జెనీవా ప్రాసిక్యూటర్లు ఈ కేసును వాదించారు.

అమెరికాలో మాంసం దుకాణం వద్ద కాల్పులు

- ముగ్గురు మృతి

లిటిల్ రాక్, ఆర్కాన్సాస్ : అమెరికాలో తుపాకీ సంస్కృతి విజృంభిస్తోంది. అర్కాన్సాస్ రాష్ట్రంలో ఒక మాంసం దుకాణం వద్ద దుండగుడు శనివారం విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోయారు. మరో 10మంది గాయపడ్డారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం. కాల్పులతో స్టోర్ తలుపులకు, అక్కడ పార్క్ చేసిన కార్ల అద్దాలకు బుల్లెట్ గుర్తులు కనిపిస్తున్నాయి. బయట నేలపై ఖాళీ తూటాలు పడి వున్నాయి. కాల్పుల కలకలంతో ఆ దారిన వెళ్ళేవారు లోపల, అక్కడ పార్కింగ్ స్థలంలో దాగుకునేందుకు ప్రయత్నించారు. కాల్పులు జరిపిన వ్యక్తిపై వెంటనే అక్కడ గల పోలీసులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ దాడిలో ఇద్దరు పోలీసులు కూడా గాయపడ్డారని రాష్ట్ర పోలీసు విభాగం తెలిపింది.

'అయోధ్య' ప్రధాన పూజారి మృతి

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యాక్రమానికి ప్రధాన పూజారిగా వ్యవహరించిన ఆచార్య లక్ష్మీకాంత్ దీక్షిత్ (86) మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన.. శనివారం తుదిశ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. లక్ష్మీకాంత్ స్వస్థలం మహారాష్ట్రలోని సోలాపూర్ జిల్లా. అయితే, ఆయన కుటుంబం తరతరాలుగా కాశీలోనే నివసిస్తోంది. మణికర్ణిక ఘాట్‌లో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నారు. ఆయన మృతిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఆయన్ను దేశంలోని గొప్ప పండితుల్లో ఒకరిగా మోడీ పేర్కొన్నారు.

ప్రభుత్వ వ్యతిరేకత కారణం కాదు

- లోక్‌సభ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్‌కు ఎదురుదెబ్బపై విజయన్



కొజికోడ్ : ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) అభ్యర్థుల పరాజయాలకు కారణాల్లో ప్రభుత్వ వ్యతిరేక ఓటు కూడా వుందని వస్తున్న ఆరోపణలను కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ తిరస్కరించారు. బిజెపికి మద్దతిచ్చిన వారు తమ వైఖరి సరైనదో కాదో ఆత్మపరిశీలన చేసుకోవాలని కోరారు.

శనివారం సాయంత్రం కేరళ ఎన్‌జిఓ యూనియన్ రాష్ట్ర సభలను ప్రారంభిస్తూ విజయన్, లోక్‌సభ ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్‌ను బలహీనపరిచేందుకు బిజెపితో కాంగ్రెస్‌తో కుమ్మక్కైందని విమర్శించారు. జమాత్ ఇ ఇస్లామి, సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డిపిఐ) సాయాన్ని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యుడిఎఫ్) పొందిందని చెప్పారు. యుడిఎఫ్ అభ్యర్థుల విజయాన్ని ఎల్‌డిఎఫ్‌కు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పుగా చూడరాదని విజయన్ పేర్కొన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో ఫలితాలు యుడిఎఫ్‌కు అనుకూలంగా వచ్చాయి. పైగా, కాంగ్రెస్ నేతృత్వంలోని కూటమి కేంద్రంలో అధికారంలోకి రావాలని రాష్ట్రంలో పెద్ద సంఖ్యలో ప్రజలు భావించారని అన్నారు.

"తాము చేసింది సరైనదేనా అని కాంగ్రెస్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్)లు తమను తాము ప్రశ్నించుకోవాలి. యుడిఎఫ్ రెండో అతిపెద్ద భాగస్వామి అయిన ఐయుఎంఎల్ జమాత్ ఇ ఇస్లామి, ఎస్‌డిపిఐ భావాలనే ప్రతిబింబిస్తోందా? దీనికి కాంగ్రెస్ అభ్యంతరం చెప్పకపోవడం వారు గర్వపడే విషయం కాదు." అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

త్రిస్సూర్ సీటు నుండి ఎన్‌డిఎ కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన సురేష్ గోపికి కూడా కాంగ్రెస్ నుంచి సహకారం ఉందని ఆయన తీవ్రంగా విమర్శించారు. బిజెపికి సాయం చేసినవారు తాము చేసింది కరక్ట్ అవునా కాదా అని పునరాలోచించుకోవాలన్నారు. వారినందరినీ కేంద్ర ప్రభుత్వం ప్రభావితం చేసినట్లు కనిపిస్తోందన్నారు. ఆయా వర్గాల నేతలు, బిజెపి సీనియర్ నేతల మధ్య ఒక అవగాహనకు రావడానికి చర్చలు జరిగాయని అన్నారు. తమ ఆస్తులను వదులుకుని పారిపోయిన తమ వారిపై జరిగిన దాడుల గురించే వారు ఆలోచించలేదన్నారు. బిజెపికి మద్దతిచ్చిన వారు ఎల్‌డిఎఫ్ పట్ల వ్యతిరేకతతో చేయలేదని, వారు పెట్టిన ఒత్తిళ్ళకు లొంగిపోయారని, తమ స్వార్థ ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవకాశవాద వైఖరి తీసుకున్నారని విజయన్ విమర్శించారు.

ప్రభుత్వ ఉద్యోగుల, పెన్షనర్ల కరువు భత్యం బకాయిలను త్వరలోనే చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వివిధ వర్గాల వారికి పెండింగ్‌లో వున్న సామాజిక భద్రతా పెన్షన్ అందిస్తామన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా కేంద్ర ప్రభుత్వం ఇబ్బందుల పాల్జేస్తోందని, ఫలితంగా రాష్ట్రంలో తీవ్ర సంక్షోభం నెలకొందన్నారు.

హమాస్‌ను ఓడించలేం!

- కుండబద్దలు కొట్టినట్లు చెప్పిన ఇజ్రాయిల్ సైనిక ఉన్నతాధికారి
- ఇరకాటంలో నెతన్యాహు



జెరూసలెం : హమాస్‌ను మొత్తంగా తుడిచిపెట్టేస్తామంటూ ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు చేసిన ప్రకటనను ఆ దేశ సైన్యం బహిరంగంగానే సవాల్ చేసింది. హమాస్‌ను సంపూర్ణంగా ఓడించడం సాధ్యం కాదని ఇజ్రాయిల్ సైన్యం ప్రతినిది రియర్. అడ్మిరల్ డేనియల్ హగారి కుండబద్దలుకొట్టినట్టు చెప్పారు. హమాస్‌ను నామరూపాల్లేకుండా తుడిచిపెట్టేస్తామని చెప్పడమంటే ప్రజల కళ్ళల్లో దుమ్ము కొట్టడమేనని సైనికాధికారి వ్యాఖ్యానించారు. గాజా ప్రజల హృదయాల్లో లోతుగా పాతుకుపోయిన ఒక సైద్ధాంతిక భావజాలమే హమాస్ అని ఆయన అన్నారు. ఇజ్రాయిల్ చానెల్ 13కి బుధవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

దీంతో నెతన్యాహు ప్రభుత్వం తీవ్ర ఇరకాటంలో పడింది. ఇంతకాలం తాను చేస్తున్న హూంకరింపులన్నీ బోగస్ అని తేలిపోయింది. హమాస్ పాలనా సామర్ధ్యాలను నిర్వీర్యం చేయడం తన యుద్ధ లక్ష్యాల్లో ఒకటని ప్రభుత్వం వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఇజ్రాయిల్ డిఫెన్స్ ఫోర్సెస్ (ఐడిఎఫ్) ప్రభుత్వ యుద్ధ లక్ష్యాలను నెరవేర్చడానికి అంకిత భావంతో పనిచేస్తుందని, హమాస్‌ను ఒక సైద్ధాంతిక భావజాలంగా, ఒక ఆలోచనగా మాత్రమే హగారీ ప్రస్తావించారని సైన్యం తన స్వరాన్ని సవరించింది. హగారీ వ్యాఖ్యల ప్రభావాన్ని తగ్గించడానికి సైన్యం ప్రయత్నించినప్పటికీ ఇజ్రాయిల్ ప్రభుత్వానికి, సైన్యానికి మధ్య అభిప్రాయ భేదాలు తీవ్రతరమయ్యాయని దీనిని ట స్పష్టమవుతోంది. పెద్ద ఎత్తున బాంబు దాడులతో గాజాను నాశనం చేస్తున్న ఇజ్రాయిల్ దాష్టీకాలపై అంతర్జాతీయంగా తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి.

గత 8మాసాలుగా దాడులు సాగిస్తున్నా, హమాస్‌ను కొంచెం కూడా బలహీనపరచలేకపోయిందని సైన్యమే అంగీకరించింది.

ప్రభుత్వ ప్రతినిధి డేవిడ్ మెన్సర్ మాట్లాడుతూ హమాస్‌ను సైనికంగా నిర్వీర్యం చేసి పాలనా సామర్థ్యాలను నిర్మూలించడమంటే ప్రతి ఒక్క సభ్యుడిని చంపుకుంటూ వెళతామని అపార్థం చేసుకోరాదని వ్యాఖ్యానించారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, ఎన్నికైన ప్రభుత్వ ఆలోచనలను, నిర్ణయాలను అమలు చేయడం సైన్యం బాధ్యత అన్నారు. . యుద్ధ కార్యకలాపాలకు హగారీ వ్యాఖ్యలు ఎలాంటి హాని చేయబోవని చెప్పారు.

తుపాకీ లైసెన్స్ కోసం 42 వేల మంది ఇజ్రాయిలీ మహిళల దరఖాస్తు

జెరూసలెం : 42 వేల మంది ఇజ్రాయిలీ మహిలలు ఆత్మ రక్షణకు తుపాకీ అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్నట్లు భద్రతా మంత్రిత్వ శాఖ తెలిపింది. అక్టోబరు 7 హమాస్ దాడి, దానికి ప్రతీకారం పేరుతో గత ఎనిమిది మాసాలుగా ఇజ్రాయిల్ సైన్యం 37 వేల మంది పాలస్తీనీయులను ఊచరోత కోయడంతో ఇజ్రాయిల్ మహిళలు తీవ్ర అభద్రతకు లోనవుతున్నారు. ఎప్పుడు ఏం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటున్నారు, నెతన్యాహు ప్రభుత్వ యుద్ధోన్మాద చర్యలను వ్యతిరేకిస్తున్నారు. 42వేల దరఖాస్తుల్లో 18 వేల దరఖాస్తులను అధికారులు ఇప్పటికే పరిష్కరించారు. ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించడానికి ముందు తుపాకులు ఉపయోగించే మహిళల సంఖ్యతో పోల్చితే ఇది మూడు రెట్లు ఎక్కువ. నెతన్యాహు ప్రభుత్వం తుపాకీ చట్టాలను సడలించిన తరువాత తుపాకుల కోసం దరఖాస్తు చేసుకునేవారి సంఖ్య పెరిగింది. ఇజ్రాయిలీ ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో 15000 మందికిపైగా మహిళలు ప్రస్తుతం తుపాకీలను ఉపయోగిస్తున్నారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం కూడా ఈ తుపాకీ సంస్కృతిని ప్రోత్సహిస్తోంది.

గాజాలో ఆగని నరమేధం

- ఇజ్రాయిల్ దాడుల్లో మరో 44 మంది బలి
- షాటి శరణార్థ శిబిరంపై దాడిలో 24 మంది
- తుఫా ప్రాంతంపై దాడిలో 20 మంది మృతి
- పౌర లక్ష్యాలపై దాడుల పట్ల హమాస్ ఆందోళన



ఇజ్రాయిల్ దాడిలో ధ్వంసమైన పౌరుల నివాసాలు

గాజా : అమెరికా మద్దతుతో గాజాలో ఇజ్రాయిల్ యథేచ్ఛగా దాడులకు తెగబడుతోంది. శుక్రవారం జరిపిన దాడిలో 44మంది పాలస్తీనియన్లు చనిపోయారు.. షాటి శరణార్థ శిబిరంలోని ఏడు నివాసాలపై జరిగిన దాడిలో 24మంది చనిపోగా, తుఫా ప్రాంతంలో జరిగిన దాడిలో 20మంది మరణించారని గాజా మీడియా కార్యాలయం ప్రకటించింది. ఇజ్రాయిల్ దాడుల్లో మరణించిన,గాయపడిన వారిని చేరుకోవడం కూడా చాలా కష్టంగా మారిందని గాజా పౌర రక్షణ దళాల ప్రతినిధి వ్యాఖ్యానించారు. జరుగుతున్న విధ్వంసం స్థాయితో పోల్చుకుంటే తమ పౌర రక్షణ సామర్థ్యం చాలా పరిమితంగా వుందని ఆయన పేర్కొన్నారు. ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం శిథిలాల కింద సహాయక బృందాలు ఇంకా గాలిస్తున్నాయని చెప్పారు. ఎంతమంది శిథిలాల కింద పడి వున్నారో కూడా తెలియదన్నారు. ఈ దాడితో మొత్తం ఆ నివాస ప్రాంగణమంతా దుమ్ము ధూళితో నిండి శిథిలాల కుప్పగా మారింది. వాటిని చూస్తేనే దాడి తీవ్రత అర్థమవుతోంది. ఆ శరణార్థ శిబిరంలోని అనేక నివాస భవనాలను ఇజ్రాయిల్ జెట్‌లు లక్ష్యంగా చేసుకున్నాయి.

ఇలా పౌరులను ఇజ్రాయిల్ లక్ష్యంగా చేసుకోవడం పట్ల హమాస్ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. నిస్సహాయులైన సామాన్యులను ఇలా కిరాతకంగా లక్ష్యంగా చేసుకుంటున్నారని, తాజాగా షాటి శరణార్థ శిబిరంపై ఊచకోత మొదలు పెట్టారని హమాస్ విమర్శించింది. ఇటువంటి దారుణ నేరాలను ఖండిస్తూ అంతర్జాతీయ సమాజం సమర్ధవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం వుందని పేర్కొంది. ఇజ్రాయిల్ నేరాలను, ఉల్లంఘనలను, ఆక్రమణలను తక్షణమే ఆపాలని కోరింది. పాలస్తీనియన్లపై అన్ని రకాలుగా ఉల్లంఘనలకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ ఇందుకు తగ్గ మూల్యాన్ని చెల్లించాలని హమాస్ పేర్కొంది. ఎంత జరిగినా పాలస్తీనియన్ల సంకల్పాన్ని మార్చలేరని స్పష్టం చేసింది.

మరోవైపు పశ్చిమ రఫాలో మరింత లోపలకు ఇజ్రాయిల్ ట్యాంకులు చొచ్చుకుపోతున్నాయి. నగరంపై అటు యుద్ధ విమానాలు ఇటు శతఘ్ని ట్యాంకులు నిరంతరాయంగా దాడులు కొనసాగిస్తునే వున్నాయి. సురక్షిత ప్రాంతంగా ప్రకటించిన అల్‌మవాసిపైన, అల్ అక్సా ఆస్పత్రిపైనా కూడా దాడులు జరుగుతునే వున్నాయని ఆరోగ్య వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యమై పోయిందని డబ్ల్యుహెచ్‌ఓ ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటివరకు 37,551మంది మరణించగా, 85,911మంది గాయపడ్డారు. వారం రోజుల వ్యవధిలో నలుగురు పిల్లలు పోషకాహార లోపంతో మరణించారని కమల్ అద్వాన్ ఆస్పత్రి డైరెక్టర్ తెలిపారు.



చిన్నారి





JEEVANA జీవన the family

చెట్లను పెంచుదాం!



చెట్లు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన వరం. భూమిపై చెట్ల వల్ల పచ్చని వాతావరణం నెలకొంటుంది. చెట్లు మానవులకు అనేక రకాలుగా ఉపయోగపడతాయి. చెట్లు వల్ల మంచి గాలి, ఆహారం మరెన్నో లభిస్తాయి. చెట్ల నుంచి పండ్లు, కూరగాయలు లభిస్తాయి. పర్యావరణ పరిరక్షణలో చెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. అయితే కొందరు అభివృద్ధి పేరుతో, మరికొందరు వంట కలప పేరుతో, ఇంకొందరు గృహావసర సామగ్రి కోసం అడవులను నరికేస్తున్నారు. ఇలా అడవులు, చెట్లను విక్షణా రహితంగా నరికేస్తే భవిష్యత్తులో పర్యావరణానికి విఘాతం కల్గుతుంది. స్వచ్ఛమైన గాలి అందే పరిస్థితి ఉండదు. అందుకే అందరం పర్యావరణాన్ని కాపాడుకునేందుకు చెట్లు నాటాలి. పచ్చదనానికి ప్రాధాన్యత ఇవ్వాలి. ప్రతి ఒక్కరూ రెండు మొక్కలు నాటేందుకు కంకణం కట్టుకోవాలి. నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగేందుకు కృషిచేయాలి. అవి పెరిగేందుకు రోజూ నీరు పోసి పరిరక్షించాలి. నా వరకూ నేను నాలుగు చెట్లు నాటుతాను. వాటిని పరిరక్షించి పెరిగేలా నా శక్తివంచన లేకుండా కృషిచేస్తాను.



– బి.ప్రేమ్‌కుమార్, 5వ తరగతి,
ఎంపిపిఎస్ వానపాముల (హెచ్‌డబ్ల్యు),
పెద పారుపూడి మండలం, కృష్ణాజిల్లా.

సరిచేయండి

పిల్లలూ, ఇక్కడ కొన్ని తెలుగు వాక్యాలు ఇచ్చాం. అవి తికమకగా ఉన్నాయి. వాటిని సాధారణ వాక్యాలుగా సరిచేసి రాయండి.

అమ్మ తెచ్చింది పండు ----
నాన్న వెళ్లాడు బజారుకి ----
నానమ్మ చెప్పింది కథలు ----
అమ్మమ్మ చేసింది పిండివంటలు ---
తాతయ్య వెళ్లాడు షికారుకి ----

నేను గీసిన బొమ్మ





కె.దేవచరణ్, 8వ తరగతి,
తిరుమల ఇంగ్లీష్ మీడియం స్కూలు,
భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పౌరాణిక పురుష పాత్రల్లో శభాష్ ..!

రంగస్థలంలో హరిశ్చంద్రుడు, అర్జునుడు, రాముడుగా తన నటనతో అందరినీ మెప్పిస్తున్నారామె. మాట, ఆహార్యం, పలకరింపు అన్నీ మూర్తీభవించిన తెలుగింటి స్త్రీ మూర్తిని తలపిస్తాయి. రంగస్థలం మీద మగ పాత్రల్లో ఆమె ఇట్టే ఇమిడిపోతారు. గడిచిన 35 ఏళ్లుగా పౌరాణిక నాటకాల్లో వివిధ పాత్రల్లో మెప్పిస్తూ అత్యుత్తమ కళాకారిణిగా రాణిస్తున్నారు.



పార్వతీపురం మన్యం జిల్లాలోని బాలగుడబ గ్రామానికి చెందిన కొప్పర మంగాదేవి (మంగమ్మ) ఉత్తరాంధ్ర ప్రజలకు సుపరిచితురాలు. హరిశ్చంద్రునిగా వేషం ధరించారంటే ఆ కళ ఉట్టి పడాల్సిందే. తన భర్త సూర్యనారాయణ ప్రోత్సాహంతో రాముడు, అర్జునుడు తదితర పాత్రల్లో పరకాయ ప్రవేశం చేసి నేడు దేశ విదేశాల్లోనూ అత్యుత్తమ ప్రదర్శనలు ఇచ్చి మంచి గుర్తింపు పొందారు.

సత్య హరిశ్చంద్ర కథ... హరికథ, బుర్రకథ, నాటకాలుగా నిత్యం జనాల్లో నానుతూనే ఉంది. పౌరాణిక నాటకాల్లో సత్యహరిశ్చంద్ర పాత్ర అత్యంత కఠినంగానూ, గంభీరత్వంతో కూడుకున్న పాత్ర. సాధారణంగా హార్మోనియంపై పట్టువుండి సప్త స్వరాలు ఆలపించగల మహానుబావులు సైతం ఆ పాత్రను మెప్పించలేరు. అలాంటి పాత్రలో మంగాదేవి అలవోకగా రాణిస్తున్నారు.

మంగమ్మ తండ్రి కొప్పర చిన్నంనాయుడు కూడా రంగస్థల కళాకారుడు. ఆయన కళాకారులకు పద్యాలు నేర్పేవారు. చిన్నప్పటి నుంచి వాటిని విన్న మంగాదేవి పాడటం నేర్చుకున్నారు. ఆ ఊరిలో జరిగే ఉత్సవాలు, పండుగల సందర్భంగా పౌరాణిక నాటకాలను వేస్తుండటం ఆనవాయితీగా వస్తోంది. ఈ క్రమంలో తండ్రి వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న మంగాదేవి బాల్యం నుంచి చక్కగా పద్యాలను ఆలాపించేవారు. ఎవ్వరేమన్నా పట్టించుకోకుండా పదే పదే ఆమె చక్కగా పాడుతుండేవారు. పద్యానికనుగుణంగా రాగాలు తీయటంపాటు హావభావాలు ప్రదర్శించేవారు. తనింటికి వచ్చే హార్మోనిస్టుల వద్ద ఆమె సంగీతానికి అనుగుణంగా పద్యాలు ఎత్తుకోవటం, సందర్భోచితంగా ఆలపించటాన్ని అలవాటు చేసుకున్నారు. చక్కని గాత్రం కల నాటక పద్యాలు నేర్పించమని ఆమె తండ్రి చిన్నం నాయుడుకి తోటి కళాకారులు సలహా ఇచ్చారు. ఆడా మగ పాత్రలకుగాను ఉచ్ఛారణలు స్పష్టంగా చెబుతుండటాన్ని గుర్తించి ప్రోత్సహించారు. అందుకే హరిశ్చంద్ర నాటకంలోని పద్యాలు నేర్పించారు. వేషం వేయించారు. ఒక్కసారి చెప్పగానే అర్థం చేసుకోగల మంగాదేవి అనతికాలంలోనే అద్భుతంగా పద్యాల వల్లెవేత నేర్చుకున్నారు. ఆ తరువాత క్రమంగా జిల్లాలోనూ, బయటా ఆమె ప్రదర్శనలు ఇచ్చి, ప్రజల ఆదరణ పొందారు. ఉత్తరాంధ్రలోనూ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఆమె పేరు మార్మోగిపోయింది. గయోపాఖ్యానంలో అర్జునుడి పాత్రలో ఇమిడిపోతుంది. కృష్ణుడితో తలపడే యుద్ధఘట్టంలో మంగ నటిస్తుంటే ద్వైతవనంలో పార్థుని ప్రతాపం కళ్లకు కనబడుతుంది.



ఆడా, మగ గొంతుతో ఉచ్ఛారణలు

స్త్రీ సహజమైన సౌమ్యత ఉట్టిపడేలాగా, మగవాళ్ల గొంతుతో పలికే గాంభీర్యాన్ని ఆశువుగా పలికించటం మంగాదేవి ప్రత్యేకత. పద్యం ఎత్తుకుంటే ఎంచుకున్న పాత్రకు తగిన విధంగా పురుషగళం ఇట్టే వచ్చేస్తుంది. అలా వివిధ పాత్రల్లో నటిస్తూ కళాకారిణిగా మారారు. తెలుగు ప్రాంతాలతోపాటుగా ఒడిస్సా, పశ్చిమ బెంగాల్, చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో నాటకాలు వేసి అలరించారు. పద్మశ్రీ యడ్ల గోపాలరావుతో రంగస్థలంపై పోటీపడి నటించారు.

సత్యహరిశ్చంద్ర పాత్రలో 'భక్త యోగ పదన్యాసి... వారనాసి', కాటిసీనులో భుజంపై కల్లు కుండ పెట్టుకుని 'అంధకారమప్పుడే బ్రహ్మాండమంతయూ ఆవరించి కళ్లున్న వారిని సైతం గుడ్డివారిని చేయుచున్నది కదా' అంటూ ఆమె పద్యం ఆలపిస్తే ప్రేక్షకులు మంత్రముగ్దులు కావాల్సిందే.

ఆమె మహిళా... అనే వారు!

ఆమె నటనతోపాటు గాత్రం కూడా గంభీరంగా పురుష గొంతును పోలి ఉంటుంది. నాటకాలు వేసిన తొలిరోజుల్లో అలా పాడుతున్నది స్త్రీ అంటే ఎవ్వరికీ నమ్మశక్యమయ్యేది కాదు. కాటి సీనులో కల్లుతో నిండిన మట్టి కుండను పట్టుకుని ప్రదర్శనలిచ్చిన ఆమెకు వెండికుండ (వెండి సురాభాండం) బహుమతిగా లభించింది. శ్రీకాకుళం జిల్లా రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో రిటైర్డ్ ఇంజనీర్ బిఎ మోహనరావు దంపతులు కిలో బరువు ఉన్న వెండికుండను పద్మశ్రీ యడ్ల గోపాలరావు చేతుల మీదుగా మంగాదేవికి అందజేయటంతోపాటు విద్వన్మణి బిరుదును ప్రధానంగా చేశారు. 43 ఏళ్ల మంగాదేవి రంగస్థలం చేరే వరకే స్త్రీ. వేదిక మీదకు వెళ్లిందా అందరూ ఆశ్చర్యపడేలా పురుషపాత్రల్లో అదరగొడుతుంది. మగాళ్లు సైతం ప్రదర్శించలేని హావభావాలను పాత్రోచితంగా పలికిస్తారు.



సినిమాల్లోనూ నటిస్తున్నా...

యడ్ల గోపాలరావు దర్శకత్వంలో 2010లో నాటకరంగం వారితో సత్యహరిశ్చంద్ర సినిమాను తీశారు. అందులో హరిశ్చంద్రుని పాత్ర నేనే పోషించాను. నేను ఏడో తరగతిలో ఉండగా, స్వాతంత్య్ర దినోత్సవం రోజున దేశభక్తి గేయాలు పాడుతుంటే– గొంతు బాగుందని స్థానిక నాటక సమాజాల వారు ప్రోత్సహించారు. నాటి నుంచి నేటి వరకూ వెనుతిరిగి చూడలేదు. ఇప్పటివరకూ 3500 వరకూ ప్రదర్శనలు ఇచ్చాను. వందలాది అవార్డులు, పురస్కారాలు పొందాను. సినీ నటుడు డాక్టర్ ఎం.మోహనబాబు, సంగీత దర్శకులు రఘు కుంచె నాతో పాటలు పాడించారు. రఘు కుంచె సంగీత సారథ్యంలో నా పాట ఉన్న సినిమా త్వరలో విడుదల కానుంది. ప్రభుత్వాలు కళాకారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తే ప్రోత్సాహకకరంగా ఉంటుంది.

– కొప్పర మంగాదేవి, రంగస్థల కళాకారిణి

– కాకిముక్కుల నాగు,
ప్రజాశక్తి విలేకరి, పార్వతీపురం
సెల్ : 94400 81649



విజయ్ పుట్టిన రోజు కానుకగా ...

తమిళ హీరో దళపతి విజయ్ పుట్టినరోజును పురస్కరించుకుని 'ద గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్ర నిర్మాతలు ఓ వీడియోను విడుదల చేశారు. టైమ్ ట్రావెల్ కాన్సెప్ట్‌తో తీస్తున్న ఈ సినిమాలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నాడు. వెంకట్‌ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. షూటింగ్ ఇప్పటికే చాలావరకూ పూర్తయ్యిందని మేకర్స్ ఇటీవల ప్రకటించారు. సెప్టెంబర్ 5న ఈ సినిమా విడుదల కానుంది. తాజాగా విడుదల చేసిన వీడియోలో ఇద్దరు విజయ్‌లు బైక్‌పై వెళుతుండగా వీళ్లను విలన్లు వెంబడిస్తుంటారు. దీనికి యువన్ శంకర్‌రాజా సంగీతాన్ని ఇచ్చారు.



గుర్తు పట్టలేనంతగా మారిపోయాడు

'స్వాగ్' చిత్రంలో నటుడు శ్రీవిష్ణు సరికొత్తగా కనబడబోతున్నాడు. ఈ సినిమాలోని పాత్ర మేకప్ కోసం దాదాపు 4 గంటలు పట్టింది. మేకప్ పూర్తయ్యేసరికి గుర్తుపట్టలేనంతగా మారిపోయాడు. ముసలివాడిగా కనిపిస్తూ దివాకర్ పేట ఎస్ఐ భవభూతి రోల్‌లో ఆయన కనిపించనున్నారు. తాజాగా ఈ గెటప్‌కు సంబంధించిన వీడియోను చిత్రబృందం షేర్ చేసింది. రాజ రాజ చోర డైరెక్టర్ హసిత్ గోలి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో రీతూ వర్మ కథానాయికగా నటిస్తున్నారు. సీనియర్ నటి మీరా జాస్మిన్ కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఎన్‌బికె -109 విలన్



బాలకృష్ణ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్‌బికె 109'. బాబీ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. తాజాగా ఈ మూవీ నుంచి విలన్ రోల్ అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ సినిమాలో కవలుదారి చిత్రం ఫేమ్ కన్నడ నటుడు రిషి విలన్ పాత్రలో నటించబోతున్నట్లు ప్రకటించారు. ఈ సినిమాను దసరా కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



'జయహో 'రామానుజ' పాటలు విడుదల

డాక్టర్ సాయి వెంకట్ నటిస్తూ దర్శకత్వం వహిస్తున్న సినిమా 'జయహో రామానుజ'. ఈ చిత్రాన్ని సుదర్శనం ప్రొడక్షన్స్‌లో సాయిప్రసన్న, ప్రవల్లిక నిర్మిస్తున్నారు. అమెరికా నటి జో శర్మ హీరోయిన్‌గా నటిస్తుండగా, సుమన్, ప్రవల్లిక ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. రెండు భాగాలుగా చిత్రీకరణ జరుపుకుంటున్న ఈ సినిమా మొదటి భాగం జులై 12న విడుదల కానుంది. ఇటీవల విడుదల చేసిన పాటలను తెలంగాణా మంత్రులు పొన్నం ప్రభాకర్, దామోదర రాజనరసింహ, కోమటి వెంకటరెడ్డి విని సాయి వెంకట్‌ను అభినందించారు. శనివారంనాడు లిరికల్ సాంగ్స్‌ను హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్‌లో విడుదల చేశారు. నిర్మాతలు తుమ్మలపల్లి రామ సత్యనారాయణ, ప్రసన్న కుమార్, ప్రవల్లిక, దర్శకుడు వీరశంకర్, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ అనిల్ కూర్మాచలం మాట్లాడుతూ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంటుందని అన్నారు.



'తుఫాన్' సెకండ్ సింగిల్ విడుదల

విజయ్ ఆంటోనీ నటిస్తున్న సినిమా 'తుఫాన్'. ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ బ్యానర్‌పై కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్‌బోరా నిర్మిస్తున్నారు. త్వరలోనే ఈ సినిమాను విడుదల చేయబోతున్నామని దర్శకుడు విజయ్ మిల్టర్ వెల్లడించారు. శనివారంనాడు సెకండ్ సింగిల్ 'వెతికా నా జాడే' పాటను విడుదల చేశారు. ఈ పాటను భాష్యశ్రీ రాయగా, మాష్మి నేహా పాడారు. హరి దఫూషియ సంగీతాన్ని అందించారు.

పల్లెటూరి నేపథ్యంలో 'పొట్టేల్'



పల్లెటూరి నేపథ్యంలో సాగే 'పొట్టేల్' సినిమాకు సాహిత్ మోతూరి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి మూడు పాటలను విడుదల చేశారు. తాజాగా ఫోర్త్ సింగిల్‌ను మేకర్స్ విడుదల చేశారు. 'బుజ్జిమేక' అంటూ సాగే ఈ పాట ఆకట్టుకునేలా ఉంది. కాసర్ల శ్యామ్ స్వరాలు అందించగా శేఖర్‌చంద్ర సంగీతాన్ని సమకూర్చారు. యువచంద్ర కృష్ణతోపాటుగా అనన్య నాగళ్ల లీడ్‌రోల్స్ పోషిస్తున్నారు. నిశాంక్‌రెడ్డి కుడిది, సురేష్‌కుమార్ సడిగే నిర్మాతలు. సినిమాటోగ్రఫీ మోనిష్ భూపతిరాజు, ఎడిటింగ్ కార్తీక శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ నార్ని శ్రీనివాస్.

సెమీస్‌కు రోహిత్ సేన

- బంగ్లాదేశ్‌తో 50పరుగుల తేడాతో నెగ్గిన టీమిండియా
- పాండ్యా ఆల్‌రౌండ్ షో



ఆంటిగ్వా: ఐసిసి టి20 ప్రపంచకప్ సెమీఫైనల్లోకి టీమిండియా దూసుకెళ్లింది. గ్రూప్–1లో భాగంగా బంగ్లాదేశ్‌తో శనివారం జరిగిన సూపర్–8 మ్యాచ్‌లో టీమిండియా 50 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలిగా బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి 196పరుగులు చేయగా.. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 146పరుగులే చేసి ఓటమిపాలైంది. దీంతో సూపర్–8లో టీమిండియా రెండో విజయాన్ని నమోదు చేసుకొని మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సెమీఫైనల్లోకి ప్రవేశించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు శుభారంభం లభించింది. ఓపెనర్లు రోహిత్, కోహ్లి కలిసి తొలి వికెట్‌కు 3.4ఓవర్లలో 39పరుగులు జతచేశారు. ఆ తర్వాత రిషబ్ పంత్‌తో కలిసి కోహ్లి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ముస్తాఫిజర్ వేసిన ఆరో ఓవర్లో కోహ్లి కళ్లు చెదిరే సిక్సర్ బాదాడు. దీంతో పవర్ ప్లే 6ఓవర్లు ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 53 పరుగులు చేసింది. వీరు 2వ వికెట్‌కు 32పరుగులు జతచేశారు. ధాటిగా ఆడే క్రమంలో పంత్(36), కోహ్లి(37) ఔటయ్యారు. ఆ తర్వాత సూర్యకుమార్ యాదవ్(6) నిరాశపరిచినా.. దూబే(34), హార్దిక్ పాండ్యా(50) ధాటిగా ఆడి టీమిండియాకు భారీస్కోర్‌ను చేకూర్చారు. ఆల్‌రౌండర్ పాండ్యా కేవలం 27బంతుల్లో 4ఫోర్లు, 3 సిక్సర్ల సాయంతో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. టీమిండియా ఇన్నింగ్స్ చివరి బంతికి హార్దిక్ ఫోర్ కొట్టి అర్ధసెంచరీని పూర్తి చేయడం విశేషం. బంగ్లాదేశ్ బౌలర్లలో తంజిమ్, రిషాద్‌లకు రెండేసి, షకీబ్‌కు ఒక వికెట్ దక్కాయి.

భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బంగ్లాదేశ్ ఏ దశలోనూ లక్ష్యంవైపు పయనించలేదు. ఓపెనర్ లింటన్ దాస్(13) నిరాశపరిచాడు. ఆ తర్వాత తంజిద్ హసన్(29), నజ్ముల్(40) రాణించినా.. మిగిలిన బ్యాటర్లు నిరాశపరిచారు. మిడిల్, లోయర్ ఆర్డర్ బ్యాటర్లు ఒక్కొక్కరుగా ఔటవుతున్నా.. నజ్ముల్ క్రీజ్‌లో నిలదొక్కుకొని భారత బౌలర్లను పరీక్షించాడు. దీంతో బంగ్లాదేశ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్లు కోల్పోయి 146పరుగులే చేయగల్గింది. భారత బౌలర్లలో కుల్దీప్‌కు మూడు, బుమ్రా, అర్ష్‌దీప్‌కు రెండేసి, హార్దిక్ పాండ్యాకు ఒక వికెట్ దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ హార్దిక్ పాండ్యాకు దక్కింది. సోమవారం జరిగే చివరి సూపర్–8 మ్యాచ్‌లో భారతజట్టు ఆస్ట్రేలియాతో తలపడనుంది.

స్కోర్‌బోర్డు...

ఇండియా ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి)జాకిర్ అలీ (బి)షకీబ్ 23, కోహ్లి (సి)తంజిమ్ (బి)షకీబ్ 37, పంత్ (సి)తంజిమ్ (బి)రిషాద్ 36, సూర్యకుమార్ యాదవ్ (సి)లింటన్ దాస్ (బి)తంజిమ్ 6, దూబే (బి)రిషాద్ 34, పాండ్యా (నాటౌట్) 50, అక్షర్ పటేల్ (నాటౌట్) 3, అదనం 7. (20ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 196పరుగులు.

వికెట్ల పతనం: 1/39, 2/71, 3/77, 4/100, 5/161 **బౌలింగ్:** మెహిదీ హసన్ 4–0–28–0, షకీబ్ 3–0–37–1, తంజిమ్ 4–0–32–2, ముస్తాఫిజుర్ 4–0–48–0, రిషాద్ 3–0–43–2, మహ్మదుల్లా 2–0–8–0

బంగ్లాదేశ్ ఇన్నింగ్స్: లింటన్ దాస్ (సి)సూర్యకుమార్ యాదవ్ (బి)హార్దిక్ పాండ్యా 13, తంజిద్ హసన్ (ఎల్‌బి)కుల్దీప్ 29, నజ్ముల్ శాంటో (సి)అర్ష్‌దీప్ (బి)బుమ్రా 40, తౌహిద్ హృదయ్ (ఎల్‌బి)కుల్దీప్ 4, షకీబ్–అల్–హసన్ (సి)రోహిత్ (బి)కుల్దీప్ 11, మహ్మదుల్లా (సి) (బి)అర్ష్‌దీప్ 13, జాకిర్ అలీ (సి)కోహ్లి (బి)అర్ష్‌దీప్ 1, రిషాద్ హొస్సైన్ (సి)రోహిత్ (బి)బుమ్రా 24, మెహిదీ హసన్ (నాటౌట్) 5, తంజిమ్ హసన్(నాటౌట్) 1, అదనం 5. (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 146పరుగులు. **వికెట్ల పతనం:** 1/35, 2/66, 3/76, 4/98, 5/109, 6/110, 7/138, 8/145 **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4–0–30–2, బుమ్రా 4–0–13–2, అక్షర్ పటేల్ 2–0–26–0, హార్దిక్ పాండ్యా 3–0–32–1, జడేజా 3–0–24–0, కుల్దీప్ 4–0–19–3

టి20 ప్రపంచకప్ సూపర్-8లో నేడు..

ఆఫ్ఘనిస్తాన్ × ఆస్ట్రేలియా
వేదిక: సెయింట్‌విన్సెంట్; ఉ.6.00గం॥లకు

అమెరికా × ఇంగ్లండ్
వేదిక: బార్బొడాస్; రా.8.00గం॥లకు

జ్యోతి సురేఖ బృందానికి మరో స్వర్ణం

- ప్రియాన్ష్‌కు రజతం
- ఆర్చరీ వరల్డ్‌కప్ స్టేజ్–3

ఆంటాల్యా(టర్కీ): ఆర్చరీ ప్రపంచకప్ స్టేజ్–3లో మహిళా ఆర్చర్లు స్వర్ణాల పంట పండిస్తున్నారు. శనివారం జరిగిన మహిళల ఆర్చరీ కాంపౌండ్ జట్టు విభాగంలో భారత్‌కు మరో స్వర్ణ పతకం దక్కింది. దీంతో ఈ విభాగంలో భారత ఆర్చరీ బృందం మూడు బంగారు పతకాలతో హ్యాట్రిక్ కొట్టింది. వెన్నెం జ్యోతి సురేఖ, పర్ణీత్ కౌర్, అదితి స్వామిలతో కూడిన భారత ఆర్చరీ జట్టు కాంపౌండ్ టీమ్ విభాగంలో బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. ఇక పురుషుల వ్యక్తిగత విభాగంలో ప్రియాన్ష్ రజత పతకాన్ని సాధించాడు. టాప్ ర్యాంక్‌తో బరిలోకి దిగిన మహిళల బృందం అదే ప్రతిభను ఫైనల్లోనూ ప్రదర్శించింది. హోరాహోరీసాగి సాగిన ఐనల్లో భారత బృందం 232–229పాయింట్ల తేడాతో ఎస్టోనియాకు చెందిన లిస్సెల్, మీరి మారిట, మారిస్‌ల బృందంపై విజయం సాధించింది. గత ఏడాది ఆసియా క్రీడల్లోనూ ఈ బృందం స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకొని పారిస్ ఒలింపిక్స్‌కు ఇప్పటికే అర్హత సాధించిన సంగతి తెలిసిందే.



Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68